
ప్రకటనల కోసం సంప్రదించండి 98483 28698

తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
Estd : 2002
# జనంసాక్షి
www.janamsakshi.org
సోమవారం 12.08.2024 | సంపుటి : 11 సంచిక : 33 | పేజీలు : 12 వెల: రూ. 4/-
RNI NO.APTEL / 2013 /50370

సామాన్యుని స్వరం
జనంసాక్షి tv
JANAMSAKSHI TV

తెలంగాణ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్



# హైదరాబాద్‌లో అమెజాన్ వెబ్‌సర్వీసెస్ విస్తరణ

## ఏఐ ఆధారిత డేటా సెంటర్‌పై చర్చలు

- అమెరికా పర్యటనలో కంపెనీ ప్రతినిధులతో సంప్రదింపులు
- చర్చలు విజయవంతమయ్యాయని మంత్రి శ్రీధర్ బాబు ప్రకటన
- తెలంగాణ ప్రభుత్వం డిజిటల్ వృద్ధిలో ఆశించిన లక్ష్యాలను అందుకునేందుకు తమ కంపెనీ భాగస్వామ్యం తప్పకుండా ఉంటుందన్న అమెజాన్ వైస్ ప్రెసిడెంట్ కెర్రీ పర్సన్

**న్యూయార్క్(జనంసాక్షి):** అమెజాన్ కంపెనీ హైదరాబాద్‌లో తన డేటా సెంటర్ ను విస్తరించే పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తి ప్రదర్శించింది. అమెజాన్ వెబ్ సర్వీసెస్ డేటా సెంటర్ ప్లానింగ్ అండ్ డెలివరీ వైస్ ప్రెసిడెంట్ కెర్రీ పర్సన్, కంపెనీ ప్రతినిధి బృందంతో ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు సమావేశమయ్యారు. తెలంగాణలో డేటా సెంటర్ కార్యకలాపాలపై చర్చలు జరిపారు. ఇప్పటికే తెలంగాణలో అమెజాన్ కంపెనీ కార్యకలాపాలను విస్తరించింది. ప్రపంచంలోనే అమెజాన్ కంపెనీకి చెందిన అతిపెద్ద కార్పొరేట్ భవనం హైదరాబాద్లో ఉంది. గత ఏడాది అమెజాన్ డెడికేటేడ్ ఎయిర్ కార్గో నెట్‌వర్క్ 'అమెజాన్ ఎయిర్' ప్రారంభించింది. అమెజాన్ వెబ్ సర్వీసెస్ కు సంబంధించి హైదరాబాద్లో మూడు డేటా సెంటర్లు ఇప్పటికే పనిచేస్తున్నాయి. అర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మిషన్ లెర్నింగ్ ఆధారిత సేవలతో కొత్త హైపర్ స్కేల్ డేటా సెంటర్‌తో పాటు తమ

మిగతా 2లో..

# సీతారామ ప్రాజెక్ట్ ట్రయల్‌రన్ విజయవంతం

## ఏటా 6 లక్షల ఎకరాలకు నీరిస్తాం • ఈ దిశగా కృషిచేస్తున్నాం : మంత్రి ఉత్తమ్


- రీడిజైన్ పేరుతో గత పాలకులు వేల కోట్లు వృథా చేశారు
- మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వర్‌రావు
- 2026 నాటికి ప్రాజెక్టు కింద ప్రతి ఎకరాకు నీరందిస్తామని వెల్లడి





**భద్రాద్రి(జనంసాక్షి):** సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు పరిధిలోని మూడు కీలకమైన పంప్‌హౌజ్‌లను తెలంగాణ మంత్రులు ఎన్ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఆదివారం భారీ ట్రయల్ రన్ నిర్వహించారు. ఆగస్టు 15న తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ప్రాజెక్టు అధికారిక ప్రారంభోత్సవానికి ముందు భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో నిర్వహించిన ట్రయల్ రన్ కీలక మైలురాయిగా నిలిచింది. తొలుత అశ్వారావుపేట నియోజకవర్గం ముల్కలపల్లి మండలం పూసుకుడెం వద్ద సీతారామ సాగర్ ప్రాజెక్టును సందర్శించిన మంత్రులు, అక్కడ రెండో పంప్ హౌస్ ట్రయల్ రన్‌ను ప్రారంభించారు. అనంతరం ముల్కలపల్లి మండలం కమలాపురం గ్రామానికి వెళ్లి మూడో పంప్‌హౌస్ ట్రయల్ రన్‌ను ప్రారంభించారు. ఖమ్మం జిల్లా వైరాలో వారి పర్యటన చివరి విడతగా ఆగస్టు 15న ప్రాజెక్టు ప్రారంభోత్సవం సందర్భంగా ముఖ్యమంత్రి ప్రసంగించనున్న బహిరంగ సభ ఏర్పాట్లను పరిశీలించారు. 2026 ఆగస్టు నాటికి సీతారామ ప్రాజెక్టు కింద ప్రతి ఎకరాకు సాగునీరు అందించేందుకు

మిగతా 2లో..



# కొట్టుకుపోయిన తుంగభద్ర డ్యామ్‌గేట్

## ప్రాజెక్టు నుంచి వృధాగా పోతున్న నీరు

### జలాశయ దిగువ ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేసిన అధికారులు

**జనంసాక్షి:** కర్నాటక రాష్ట్రంలోని తుంగభద్ర డ్యాం 19 వ గేటు కొట్టుకుపోయింది. గత కొద్ది రోజులుగా జలాశయానికి భారీగా వరద ప్రవాహం కొనసాగుతోంది. చైన్ లింక్ తెగిపోవటంతో డ్యాం గేటు కొట్టుకుపోయింది. దీంతో ఆ గేట్ నుంచి 40వేల క్యూ సెక్కుల నీరు వృధాగా పోతున్నట్లు అధికారులు తెలిపారు. ఇప్పటికే నదిలో భారీగా వరద ఉంది. మొత్తంగా లక్ష క్యూసెక్కుల నీరు నదిలో ప్రవహిస్తోందని కర్నూలు - మహబూబ్ నగర్ జిల్లాల్లోని నదీ పరీవాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా

మిగతా 2లో..

# హిండెన్‌బర్గ్ ఆరోపణలతో 'సెబీ' ప్రతిష్ట మసకబారింది

## లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్

- అదానీగ్రూప్, సెబీచీఫ్‌పై తక్షణమే చర్యలు తీసుకోవాలి.. విపక్షాల డిమాండ్
- అందుకే అదానీగ్రూప్ వివాదాలను సెబీ పట్టించుకోవడంలేదు
- సుప్రీం కోర్టు నిపుణుల కమిటీ కూడా దీన్ని గుర్తించలేకపోయింది: జైరాం రమేశ్
- ఇది క్రోనీ క్యాపిటలిజం : మహువా మొయిత్రా



**న్యూఢిల్లీ (జనంసాక్షి):** సెబీ ఛైర్‌పర్సన్ మాధవీ పురి బచ్‌పై అమెరికా షార్ట్‌సెల్లర్ సంస్థ హిండెన్‌బర్గ్ రీసెర్చ్ సంచలన ఆరోపణలు చేసిన విషయం తెలిసిందే. అదానీ గ్రూప్ సంస్థల షేర్ల విలువలు కృత్రిమంగా పెంచేందుకు వినియోగించిన మారిషస్ ఫండ్‌లలో మాధవీ పురి, ఆమె భర్తకు వాటాలు ఉన్నాయని ఆరోపించింది. ఈ వ్యవహారంపై కాంగ్రెస్ ఎంపీ, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ స్పందిస్తూ.. ఛైర్‌పర్సన్‌పై ఆరోపణలతో 'సెబీ' పవిత్రత దెబ్బతిందని విమర్శించారు. "ఛైర్ పర్సన్‌పై వచ్చిన ఆరోపణలతో సెబీ పవిత్రత మసకబారింది. దేశవ్యాప్తంగా ఉన్న

మిగతా 2లో..

### హిండెన్‌బర్గ్ వ్యక్తిత్వ హననానికి పాల్పడుతోంది

సెబీ చీఫ్ మాధబి పురి బచ్

**న్యూఢిల్లీ(జనంసాక్షి):** అమెరికాకు చెందిన షార్ట్ సెల్లింగ్ సంస్థ హిండెన్ బర్గ్ తన వ్యక్తిత్వ హననానికి పాల్పడుతోందని సెబీ చీఫ్ మాధబి పురి బచ్ ఆరోపించారు. తమ ఆర్థిక రికార్డులను బహిర్గతం చేస్తామని వెల్లడించారు. తాము ప్రైవేటు వ్యక్తులుగా ఉన్న రోజుల్లో ఆర్థిక కార్యకలాపాల వివరాలను కూడా అధికారులకు ఇచ్చేందుకు సంసిద్ధత వ్యక్తం చేశారు. ఈ మేరకు

మిగతా 2లో..

### వ్యక్తిగత లబ్ధి కోసమే హిండెన్‌బర్గ్ ఆరోపణలు

ఇవన్నీ కుట్ర పూరితమే: అదానీ గ్రూప్

వార్త 2లో

# అమెరికాకు తలవంచద్దనే రాజీనామా చేశా..

బంగ్లాదేశ్‌లో అల్లర్ల వెనుక అగ్రరాజ్యం • సెయింట్ మార్టిన్ ద్వీపం కోసమే కుట్ర

- షేక్ హసీనా సంచలన ఆరోపణ
- ఓ ఆంగ్ల పత్రికకు సందేశం పంపిన బంగ్లా మాజీ ప్రధాని




**న్యూఢిల్లీ(జనంసాక్షి):** బంగ్లాదేశ్‌లో తిరుగుబాటు తర్వాత ప్రధాని పదవికి రాజీనామా చేసి, భారత్ వచ్చిన హసీనా, ఇటీవల జరిగిన పరిణామాలపై ఓ ఆంగ్ల పత్రికకు సందేశం పంపారు. బంగ్లాదేశ్‌లో తాజా పరిస్థితులకు అమెరికానే కారణమని ఆమె ఆరోపించారు. తాను మృతదేహాల ఊరేగింపును చూడాలను కోలేదన్న ఆమె, వారు విద్యార్థుల శవాలపై అధికారాన్ని హస్తగతం చేసుకోవాలనుకొన్నారని విమర్శించారు. అందుకు తాను అంగీకరించలేదన్న హసీనా, అందుకే ప్రధాని పదవికి రాజీనామా చేశానని ఆంగ్ల పత్రికకు చెప్పారు. ఒక వేళ తాను సెయింట్ మార్టిన్ ద్వీపంపై సార్వభౌమత్వాన్ని అప్పగించి అమెరికాకు బంగాళాఖాతంలో పట్టు కల్పిస్తే తన పదవి పోయేదికాదని పేర్కొన్నారు. దయ చేసి అతివాదుల మాయలోపడొద్దని బంగ్లాదేశ్ దేశ ప్రజలను కోరుతున్నట్లు ఆంగ్ల పత్రికకు పంపిన సందేశంలో పేర్కొన్నారు. చాలా మంది నాయకులు, కార్యకర్తలు హత్యకు గురైన విషయం తెలిసి ఆవేదన చెందినట్లు హసీనా తెలిపారు. పలువురు పార్టీ సభ్యుల ఇళ్లను ధ్వంసం చేశారన్న ఆమె భగవంతుని దయవల్ల త్వరలోనే తిరిగి వెళతానని, అవామీ లీగ్ మరోసారి నిలబడుతుందని

మిగతా 2లో..

# కొత్త వంగడాల వల్లే ఆహారభద్రత

## 109 రకాల కొత్త వంగడాలను విడుదల చేసిన ప్రధాని మోదీ



**న్యూఢిల్లీ(జనంసాక్షి):** వ్యవసాయ దిగుబడులను పెంచడం సహా, రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేయడమే లక్ష్యంగా అభివృద్ధి చేసిన వివిధ రకాల వంగడాలను ప్రధాని నరేంద్ర మోదీ విడుదల చేశారు. అధిక దిగుబడి, వాతావరణ మార్పులను తట్టుకోగలగడం సహా అధిక పోషక విలువలు కలిగిన 109 రకాల వ్యవసాయ, ఉద్యానవన పంటల విత్తనాలను ప్రధాని ఆవిష్కరించారు. భారత వ్యవసాయ పరిశోధన మండలి- ఈ కొత్త వంగడాలను అభివృద్ధి చేసింది. ఇందులో స్వల్పకాలిక పంటలకు సంబంధించి 61 రకాలు, 34 ఫీల్డ్ క్రాప్స్, 27 ఉద్యానవన రకాలు ఉన్నాయి. దిల్లీలోని పుసా ప్రాంగణంలో ప్రధాని మోదీ ఈ వంగడాలను ఆవిష్కరించారు. అనంతరం రైతులు, శాస్త్రవేత్తలతో చర్చించారు. ప్రకృతి సేద్యాన్ని పెంపొందించడం సహా, ఆర్గానిక్ ఆహారాన్ని ఎక్కువగా తీసుకునేలా ప్రజలను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని ప్రధాని ఈ సందర్భంగా పేర్కొన్నారు.

# రైలు ఢీకొని..

- ఇద్దరు కుమార్తెలు సహా తండ్రి మృతి
- మేడ్చల్ గౌడవెల్లి వద్ద ఘటన

5లో




# వైద్యురాలిపై హత్యాచార ఘటనపై వెల్లువెత్తిన నిరసనలు

### నేడు దేశవ్యాప్తంగా ఆస్పత్రుల్లో వైద్యసేవలు నిలిపివేత

**కోల్‌కతా(జనంసాక్షి):** వైద్యురాలి దారుణ హత్య కేసు దేశవ్యాప్తంగా సంచలనం రేపు తోంది. బాధితురాలిపై లైంగికదాడి జరిగినట్లు పోస్టుమార్టం నివేదికలో ఇప్పటికే వెల్ల డైంది. కోల్‌కతాలోని ఆర్జీకర్ మెడికల్ కళాశాలలో ఈ దారుణ ఘటనచోటుచేసుకుంది. ఈ కేసులో సంజయ్‌రాయ్ అనే వ్యక్తిని పోలీసులు ఇప్పటికే అరెస్టు చేశారు. అతడు పోలీ సులకు అనుబంధ వాలంటీర్‌గా పనిచేస్తు న్నాడని తేలింది. పోకిరి చేష్టలతో స్థానికుల కు ఎప్పుడూ ఇబ్బంది కలిగించేవాడని తెలిసింది. అతడు పుట్టినప్పటి నుంచి తనకు కష్టాలు మొదలయ్యాయని నిందితుడి తల్లి చెప్పడం గమనార్హం. దక్షిణ కోల్‌కతాలోని

మిగతా 2లో..

# తెలంగాణ బ్రాండ్ ఇమేజ్ దెబ్బతీయొద్దు

- రాష్ట్రం అప్పుల ఊబిలో కూరుకుపోయిందని సీఎం అనడం సరికాదు
- కార్నింగ్ ప్లాంట్, అమరరాజా కంపెనీలు రాష్ట్రం నుంచి వెళ్లిపోతే తీవ్ర నష్టం
- పెట్టుబడిదారులకు ఇచ్చిన హామీలు రాష్ట్ర ప్రభుత్వం గౌరవిస్తుందని ఆశిస్తున్నా : కేటీఆర్



**హైదరాబాద్(జనంసాక్షి):** తెలంగాణ బ్రాండ్ ఇమేజ్‌ను దెబ్బతీసేలా సీఎం మాట్లాడవద్దని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు. భారాస హయాంలో రాష్ట్రంలో పెట్టుబడులకు అమరరాజాను ఒప్పించేందుకు కష్టపడ్డామని చెప్పారు. రూ.9500 కోట్ల పెట్టుబడులకు ఆ సంస్థ ముందుకొచ్చిందన్నారు. రాజకీయ విభేదాలతో తెలంగాణకు నష్టం జంగకూడదని చెప్పారు. కార్నింగ్ ప్లాంట్, అమరరాజా కంపెనీలు రాష్ట్రం నుంచి వెళ్లిపోతే తీవ్ర నష్టం జరుగుతుందన్నారు. పెట్టుబడిదారులకు ఇచ్చిన హామీలు రాష్ట్ర ప్రభుత్వం గౌరవిస్తుందని ఆశిస్తున్నట్లు చెప్పారు. రాష్ట్రం అప్పుల ఊబిలో కూరుకుపోయిందనడం సీఎం మానేయాలని వ్యాఖ్యానించారు. కాగా యూట్యూబ్ మాజీ సీఈవో సుశాన్ వొజ్కికి మరణ వార్త చాలా బాధ కలిగించిందని కేటీఆర్ అన్నారు. వొజ్కికి ఎంతో తెలివైన వారని.. ఆమెతో పలు సందర్భాల్లో మాట్లాడటం ద్వారా చాలా నేర్చుకు న్నానని తెలిపారు. వొజ్కికి ఆత్మకు శాంతి చే కూరాలని ప్రార్థిస్తున్నట్లు కేటీఆర్ పేర్కొన్నారు. ఆమె కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతి తెలిపారు.

### బహ్రెయిన్ జైలులో సిరిసిల్ల వాసి..

స్వదేశానికి తీసుకురావాలని విదేశాంగ మంత్రికి కేటీఆర్ లేఖ

వార్త 2లో

జనంసాక్షి
www.janamsakshi.org
సోమవారం
12.08.2024



# హైదరాబాద్‌లో అమెజాన్ వెబ్ సర్వీసెస్ విస్తరణ

వ్యాపారాన్నివిస్తరించే ఆలోచనలను ఈ సందర్భంగా కంపెనీ ప్రతినిధులు పంచుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ అమెజాన్‌తో చర్చలు విజయవంతమయ్యాయని ప్రకటించారు. ప్రభుత్వం తరఫున తగినంత సహకారంతో పాటు ఉత్తమమైన ప్రోత్సాహకాలు అందిస్తామని వారికి హామీ ఇచ్చినట్లు చెప్పారు. రాష్ట్రంలో భారీ విస్తరణకు కంపెనీ ముందుకు వస్తుందనే ఆశాభావం వ్యక్తం చేశారు. అమెజాన్ వెబ్ సర్వీసెస్ వైస్ ప్రెసిడెంట్ కెర్రీ పర్సన్ మాట్లాడుతూ, హైదరాబాద్‌లో తమ క్లౌడ్ సదుపాయాలను మరింత విస్తరించే అవకాశాలపై ఆనందం వ్యక్తం చేశారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌తో అమెజాన్ వెబ్సర్వీసెస్ క్లౌడ్ సేవల వృద్ధికి హైదరాబాద్ కీలక పాత్ర పోషిస్తుందనే అభిప్రాయం వ్యక్తం చేశారు. తెలంగాణ ప్రభుత్వం డిజిటల్ వృద్ధిలో ఆశించిన లక్ష్యాలను అందుకునేందుకు తమ కంపెనీ భాగస్వామ్యం తప్పకుండా ఉంటుందన్నారు.

# బహ్రెయిన్ జైలులో సిరిసిల్ల వాసి..

**స్వదేశానికి తీసుకురావాలని విదేశాంగ మంత్రికి కేటీఆర్ లేఖ**

**హైదరాబాద్(జనంసాక్షి):** పాస్‌పోర్ట్ పోగొట్టుకొని బహ్రెయిన్ జైల్లో చిక్కుకుపోయిన సిరిసిల్ల జిల్లా తంగళ్ళపల్లి మండలం చీర్లవంచ గ్రామానికి చెందిన మానువాడ నర్సయ్య (62)కు అండగా ఉంటానని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హామీనిచ్చారు. సిరిసిల్ల వాసి నర్సయ్యను భారత్‌కు రప్పించేందుకు కృషి చేస్తానని కేటీఆర్ అన్నారు. ఈ మేరకు కేటీఆర్ కేంద్ర విదేశాంగశాఖ మంత్రి ఎస్ జయశంకర్‌కు లేఖ రాశారు. నర్సయ్యను తిరిగి తీసుకువచ్చేలా విదేశాంగ శాఖతోపాటు రాష్ట్రప్రభుత్వం చొరవ చూపాలని కేటీఆర్ కోరారు. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కార్యాలయానికి కూడా కేటీఆర్ విజ్ఞప్తి చేశారు. బహ్రెయిన్‌లోని పార్టీ ఎన్ఆర్ఐ విభాగం, బీఆర్ఎస్ ఎన్ఆర్ఐ (ఃఖీూ ఔఖీఎ) విభాగం సమన్వయం చేసుకొని నర్సయ్య విడుదలకు సహకరించాలని సూచించారు. నర్సయ్యను వెంటనే దేశానికి రప్పించేలా చూడాలని లేఖలో కోరారు. చాలా సంవత్సరాలుగా ఆచూకీ లేకుండా పోయిన నర్సయ్య బహ్రెయిన్‌లోని జైల్లో పాస్‌పోర్ట్ సమస్యలతో అక్కడే చిక్కుకున్నారు. 28 ఏండ్ల క్రితం బతుకు దెరువు కోసం బహ్రెయిన్ వెళ్లిన నర్సయ్య అక్కడే చిక్కుకుపోయారు. నర్సయ్య గత జనవరి నుంచి అక్కడి జైల్లో ఉన్నాడు. 1996లో బహ్రెయిన్ వెళ్లిన నర్సయ్య అక్కడి ది అరబ్ ఇంజనీరింగ్ అండ్ కాంట్రాక్టింగ్ కంపెనీలో మూడేండ్లపాటు తాపీ మేస్త్రీగా పనిచేశాడు. 1999 ఆగస్టులో ఆయన వర్క్ పర్మిట్ ముగిసినా అక్కడే పనిచేస్తూ ఉన్నాడు. ఆయన పాస్ పోర్ట్ గడువు 2001లో ముగియటంతో బహ్రెయిన్‌లోని ఇండియన్ ఎంబసీ రెన్యువల్ చేసింది. ఇప్పుడు ఆ పాస్ పోర్ట్ గడువు కూడా ముగిసింది. నర్సయ్య పాస్ పోర్ట్ పోగొట్టుకున్నాడు. వర్క్ పర్మిట్, పాస్ పోర్ట్ లేకపోవటంతో అక్రమంగా తమ దేశంలో ఉంటున్నాడని నర్సయ్యను బహ్రెయిన్ పోలీసులు అరెస్ట్ చేసి జైల్లో ఉంచడంతో ఆయన జైల్లో ఉన్న విషయం వెలుగులోకి వచ్చింది. నర్సయ్యను భారత్‌కు రప్పించాలని అతని భార్య లక్ష్మి, కూతుళ్లు సోన, అపర్ణ, కుమారుడు బాబు కోరుతున్నారు. ఈ విషయం స్థానిక ఎమ్మెల్యే కేటీఆర్ దృష్టికి రావటంతో ఆయన స్పందిస్తూ.. నర్సయ్యను భారత్‌కు రప్పించేందుకు అన్ని విధాలుగా తన సహకారం ఉంటుందని చెప్పారు. ఈ మేరకు నర్సయ్యకు తాత్కాలిక పాస్ పోర్ట్‌ను ఇచ్చే విషయంలో విదేశాంగ శాఖ చొరవ చూపాలని కేంద్ర విదేశాంగశాఖ మంత్రి ఎస్ జయశంకర్‌ని లేఖలో కోరారు. ఈ విషయంలో పూర్తి సహకారం అందించి నర్సయ్య పాస్ పోర్ట్ జారీ అయ్యేలా చూడాలని విదేశాంగ శాఖతోపాటు రాష్ట్ర ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. నర్సయ్యను విడుదల చేసి భారత్ కు పంపించాలంటే ఆయన భారతీయుడని తెలిపే ఆధారాలను బహ్రెయిన్ ప్రభుత్వానికి సమర్పించాల్సి ఉందని, నర్సయ్య గుర్తింపును ధృవీకరించాలని బహ్రెయిన్ ప్రభుత్వ సంస్థ 'లేబర్ మార్కెట్ రెగ్యులేటరీ అథారిటీ' 2024 జనవరి 8న బహ్రెయిన్ లోని భారత రాయబారికి లేఖ రాసిందని తెలిపిన కేటీఆర్, ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో నర్సయ్యను వెంటనే స్వదేశానికి పంపించే ఏర్పాటు చేయాలని కోరారు. ఇప్పుడు నర్సయ్యకు భారత ప్రభుత్వం తాత్కాలిక పాస్ పోర్ట్‌ను జారీ చేస్తే బహ్రెయిన్ ప్రభుత్వం అతన్ని డిపోర్ట్ చేసి తిరిగి భారత్ కు పంపించే అవకాశం ఉందన్నారు కేటీఆర్. ప్రస్తుతం హైదరాబాద్ పాస్‌పోర్ట్ అధికారి పాత రికార్డులను పరిశీలించి నర్సయ్య చిరునామా కనుక్కొని సంబంధిత జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ ల ద్వారా నివేదిక ఇవ్వాల్సి ఉందని, ఈ విషయంలో హైదరాబాద్ పాస్ పోర్ట్ అధికారి, సిరిసిల్ల జిల్లా కలెక్టర్, ఎస్పీతో మాట్లాడి వీలైనంత త్వరగా నివేదిక ఇచ్చేలా ప్రయత్నం చేస్తానని కేటీఆర్ తెలిపారు. ఈ మేరకు జిల్లా అధికార యంత్రాంగంతోపాటు రాష్ట్ర ఎన్నారై వ్యవహారాల శాఖ అధికారులతో సమన్వయం చేసుకొని ఈ ప్రక్రియను మరింత వేగంగా తీసుకెళ్లాలని తన కార్యాలయ సిబ్బందిని కేటీఆర్ ఆదేశించారు.

# వైద్యురాలిపై హత్యాచార ఘటనపై వెల్లువెత్తిన నిరసనలు

శంభునాథ్ పండిట్ వీధిలో ఉండే సంజయ్.. స్థానిక పోలీస్ విభాగంలో విపత్తుల నిర్వహణ బృందంలో వాలంటీర్‌గా చేరాడు. అప్పటి నుంచి ఓ పోలీసు ఉన్నతాధికారికి పీఏగా పనిచేస్తున్నానంటూ చెలామణి అయ్యేవాడు. కొందరికి మాత్రం హోంగార్డుగా పరిచయం చేసుకునేవాడు. నగరంలోని ఓ పోలీసు బెటాలియన్ వద్ద ఎక్కువగా కనిపించేవాడు. ఈ క్రమంలోనే ఆర్జీ కర్ ఆసుపత్రి చెక్‌పోస్టు వద్ద బాధ్యతలు అప్పగించారు. వాలంటీర్‌గా పనిచేస్తూనే మధ్యవర్తిగా పనిచేసేవాడని సమాచారం. పోలీసుల దర్యాప్తులో మరికొన్ని విషయాలు వెలుగులోకి వచ్చాయి. అతడి మొబైల్‌లో అభ్యంతరకర ఫొటోలు, వీడియోలు గుర్తించిన అధికారులు.. అశ్లీలతకు బానిసై ఉండొచ్చని ప్రాథమికంగా నిర్ధరించారు. అంతేకాకుండా మహిళా సహోద్యోగుల పట్ల అమర్యాదగా ప్రవర్తించినట్లు తేలింది. ఈ విషయాలన్నీ నిజమేనని దర్యాప్తు అధికారుల ముందు నిందితుడు అంగీకరించాడు. దర్యాప్తు సమయంలో ఎటువంటి పశ్చాత్తాపం వ్యక్తం చేయకపోగా.. తనను ఉరితీయాలనుకుంటే.. తీయండి.. అంటూ ఎదురుచెప్పడం గమనార్హం .మరోవైపు స్థానికంగానూ పోకిరీ చేష్టలతో ఇబ్బంది కలిగించేవాడని తెలిసింది. ఇదే విషయంపై నిందితుడి తల్లి స్పందిస్తూ.. సంజయ్‌కు జన్మనిచ్చినప్పటి నుంచి కష్టాలు మొదలయ్యాయని వాపోయారు. కానీ, ఇటువంటి దుశ్చర్యకు పాల్పడతాడని మాత్రం అనుకోలేదని, ఇది నమ్మశక్యంగా లేదన్నారు.

**నేడు దేశవ్యాప్తంగా వైద్య సేవలు నిలిపివేత**

బంగాల్ కోల్‌కతాలోని ఆర్‌జీ కార్ మెడికల్ కళాశాలలో జూనియర్ వైద్యురాలి దారుణ హత్యపై రెసిడెంట్ డాక్టర్లు తీవ్రంగా స్పందించారు. సోమవారం దేశవ్యాప్తంగా కొన్ని రకాల వైద్య సేవలను నిలిపివేస్తున్నట్లు ఫోర్డా (ది ఫెడరేషన్ ఆఫ్ రెసిడెంట్ డాక్టర్స్ అసోసియేషన్) తెలిపింది. ఈ మేరకు కేంద్ర ఆరోగ్యశాఖ మంత్రి జేపీ నడ్డాకు లేఖను పంపించింది. ఆర్‌జీ కార్ మెడికల్ కళాశాల వైద్యులకు మద్దతుగా ఈ చర్యను చేపట్టినట్లు ప్రకటించింది. అయితే, జూనియర్ వైద్యురాలి దారుణ హత్యపై తక్షణమే చర్యలు తీసుకోవాలని ఫోర్డా కేంద్రాన్ని శనివారం డిమాండ్ చేసింది. అందుకు గాను 24 గంటల డెడ్‌లైన్ కూడా ఇచ్చింది. చర్యలు తీసుకోకుంటే ఆస్పత్రుల్లో సేవలను నిలిపివేస్తామని హెచ్చరించింది. దౌర్జన్యాలకు గురైన తమ వారికి న్యాయం జరగాలని పేర్కొంది. ఈ విషయానికి రాజకీయ రంగు పులిమి ప్రతికూల కోణంలో చూడొద్దని అభ్యర్థించింది.

# సీతారామ ప్రాజెక్ట్ ట్రయల్ రన్ విజయవంతం



ప్రభుత్వం కట్టుబడి ఉందని నీటి పారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి విలేకరుల సమావేశంలో పునరుద్ఘాటించారు. ఆగస్టు 15న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ ప్రాజెక్టును ప్రారంభించడమే కాకుండా.. రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ పథకాన్ని ప్రారంభించనున్నారు. ఇది రైతులకు ఎంతో ఉపశమనాన్ని అందించగలదని మరియు వ్యవసాయ అభివృద్ధికి ప్రభుత్వ మద్దతును మరింత బలోపేతం చేయనుందని అన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వాలు అసంపూర్తిగా వదిలేసిన సీతారామ ప్రాజెక్టు ఇప్పుడు కాంగ్రెస్ హయాంలో పూర్తయ్యే దశకు చేరుకుందని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. వ్యవసాయ అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉన్నందున ప్రతి ఎకరాకు నీరు చేరేలా నిర్మాణ పనులను వేగవంతం చేయాల్సిన అవసరం ఉందని ఆయన నొక్కి చెప్పారు. గోదావరి రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు ద్వారా పూర్తి ఆమోదం పొందిన సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టుకు గోదావరి నది నుండి 67 టిఎంసిల నీరు అందుతుందని. ఆగస్టు 2026 గడువులోగా ప్రాజెక్టు పరిధిలోని ప్రతి ఎకరాకు నీరు చేరేలా ఈ కేటాయింపు కీలకమని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. ఈ ప్రాజెక్టులో ఏన్కూరు లింక్ కెనాల్ పేరును రాజీవ్ కాలువగా మారుస్తామని ఇది ప్రాంతం అంతటా సాగునీటిని స్థిరీకరించడంలో కీలకంగా ఉంటుందని వివరించారు. పాలేరు ప్రాంతానికి గోదావరి నీటిని తీసుకురావడానికి కీలకమైన యాతలకుంట, జులూరుపాడు టన్నెల్స్ వంటి డిస్ట్రిబ్యూటరీ కాలువలు, కీలకమైన మౌలిక సదుపాయాల కల్పనను వేగవంతం చేయాల్సిన అవసరం ఉందని ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. నిర్దిష్ట ప్రదేశాలలో రైల్వే క్రాసింగ్‌లకు సంబంధించిన సవాళ్లను కూడా మంత్రి రెడ్డి ప్రస్తావించారు, నిర్మాణంలో జాప్యాన్ని నివారించడానికి రైల్వే అధికారులతో సహకరించాలని అధికారులను కోరారు. సుప్రీంకోర్టు, కేంద్ర పర్యావరణ, అటవీ మంత్రిత్వ శాఖ నుంచి అవసరమైన అనుమతులు పొందడంపై అధికారులు దృష్టి సారించాలని ఉత్తమ్ కుమార్ రెడ్డి కోరారు. నిర్మాణ జాప్యాన్ని నివారించడానికి 34.561 మరియు 37.551 కిలోమీటర్ల రైల్వే క్రాసింగ్‌లకు సంబంధించిన సమస్యలను పరిష్కరించాల్సిన ప్రాముఖ్యతను కూడా ఆయన నొక్కి చెప్పారు. ప్రాజెక్టు లక్ష్యాలను సకాలంలో చేరుకోవడానికి 3,000 ఎకరాలతో కూడిన ప్యాకేజీ 1 మరియు 2 కోసం తక్షణ భూసేకరణ అవసరమని ఆయన వివరించారు. ఈ పనులు పూర్తయితే 3.40 లక్షల ఎకరాలకు సాగునీరు స్థిరీకరించడంతోపాటు అదనంగా 2.60 లక్షల ఎకరాలు సాగులోకి వస్తాయని పేర్కొన్నారు. ప్రాజెక్ట్ ప్యాకేజీలు 1 మరియు 2 కోసం అవసరమైన మిగిలిన 1,658 ఎకరాల భూమిని తక్షణమే సేకరించడంపై కీలక దృష్టి సారించామని ఈ ప్యాకేజీలను సకాలంలో పూర్తి చేయడం ద్వారా 3.40 లక్షల ఎకరాలకు సాగునీరు స్థిరీకరించి, సాగునీరు తీసుకురావడానికి ప్రజల సహకరించాలని ఉత్తమ్ కుమార్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. "సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ దాదాపు 6 లక్షల ఎకరాలకు సాగునీటికి అందిస్తుంది, ఇది వ్యవసాయ ఉత్పాదకతను పెంచడానికి మరియు రైతుల జీవనోపాధిని మెరుగుపరుస్తుందని. ఈ ప్రాజెక్టును విజయవంతంగా అమలు చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని, ఈ లక్ష్యాన్ని చేరుకోవడానికి అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటోందని ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. రీడిజైనింగ్ పేరుతో గత పాలక వర్గం అసమర్థత, వృథా ఖర్చుతో ప్రాజెక్టు వ్యయాన్ని రూ.2,400 కోట్ల నుంచి రూ.18,000 కోట్లకు పెంచారని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి విమర్శించారు. దీనికి విరుద్ధంగా, ఖర్చులను అదుపులో ఉంచుకుంటూ అవసరమైన అన్ని అనుమతులు మరియు నీటి కేటాయింపులను సాధించడానికి ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న కృషిని ఆయన ప్రశంసించారు. ఈ ప్రాజెక్టు వల్ల విశాలమైన ప్రాంతానికి ప్రయోజనం చేకూరుతుందని, రైతుల చిరకాల అవసరాలు తీరుతాయని కాంగ్రెస్ ప్రభుత్వం హామీ ఇచ్చిందని ఆయన పేర్కొన్నారు. సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ నమ్మదగిన నీటి వనరును అందించడం, ఉత్పాదకతను పెంపొందించడం మరియు ప్రాంతమంతటా రైతుల జీవనోపాధిని మెరుగుపరుస్తుందని మంత్రులు విశ్వాసం వ్యక్తం చేశారు. గత బీఆర్ఎస్ హయాంలో నిర్లక్ష్యానికి గురైన కీలకమైన అనుమతులు, కేటాయింపులను కాంగ్రెస్ ప్రభుత్వం దక్కించుకున్న ఘనత ఉత్తమ్‌కుమార్‌రెడ్డిదే. 2026 ఆగస్టు నాటికి ప్రాజెక్టును పూర్తి చేస్తామని, తెలంగాణ వ్యవసాయ శ్రేయస్సులో కొత్త శకానికి నాంది పలుకుతామని హామీ ఇచ్చారు. ఈ ట్రయల్ రన్ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర నీటి పారుదల అభివృద్ధి సంస్థ చైర్మన్ మువ్వా విజయ్ బాబు, ఇరిగేషన్ ప్రిన్సిపల్ సెక్రటరీ రాహుల్ బొజ్జా, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ జితేష్ వి.పటేల్, పోలీస్ సూపరింటెండెంట్ రోహిత్ రాజు, ఐటీడీఏ ప్రాజెక్ట్ ఆఫీసర్ రాహుల్ అధికారులు పాల్గొన్నారు.

# అమెరికాకు తలవంచద్దనే రాజీనామా చేశా

పేర్కొన్నారు. ఈ ఏడాది మే నెలలో హసీనా కీలక ప్రకటన చేశారు. బంగ్లాదేశ్‌లో వైమానిక స్థావరం ఏర్పాటుచేసుకోవడానికి ఒక దేశానికి అనుమతిస్తే తన ఎన్నిక సాఫీగా జరిగేలా చేస్తామని ఆఫర్ ఇచ్చారన్నది ఆ ప్రకటన సారాంశం. ఈ ప్రకటన ఒక్కసారిగా ప్రపంచం దృష్టిని ఆకర్షించింది. అమెరికానే ఆ దేశం అయిఉంటుందనే ప్రచారం జరిగింది. ఒక దేశానికి బంగ్లాదేశ్‌లో వైమానిక స్థావరం ఏర్పాటు చేసేందుకు అనుమతిస్తే తనకు ఏ సమస్యా ఉండేది కాదన్న హసీనా, ఇది చూడటానికి ఒక దేశాన్ని మాత్రమే లక్ష్యంగా చేసుకొన్నట్లు కనిపిస్తుందని తెలిపారు. కానీ వారి లక్ష్యం ఎంతదూరం వెళుతుందో తనకు తెలుసునని ఆ ప్రకటనలో హసీనా వివరించారు. అయితే తాను జాతిపిత బంగబంధు షేక్ ముజిబుర్ రెహ్మాన్ కుమార్తెనని, వారికి చాలా స్పష్టంగా చెప్పానని పేర్కొన్నారు. బంగ్లాదేశ్ స్వాతంత్యంత్ర పోరాటాన్ని గెలిచామని స్పష్టంగా చెప్పానని గుర్తుచేశారు. తన దేశాన్ని ఎవరికో అద్దెకు ఇచ్చి, లేదా అప్పగించి అధికారంలోకి రావాలని కోరుకోవడం లేదని వారికి స్పష్టంగా చెప్పినట్లు వివరించారు. ఈస్ట్ తైమూర్ మాదిరిగానే వారు ఇక్కడ కూడా బంగ్లాదేశ్‌లోని చోటోగ్రామ్, మయన్మార్‌లోని కొంత భాగాన్ని విడగొట్టి కొత్త దేశం ఏర్పాటుచేస్తారని అంచనా వేశారు. బంగాళాఖాతంలో ఒక స్థావరాన్ని ఏర్పాటుచేసుకొంటారని నాడు హసీనా పేర్కొన్నారు. అప్పటి నుంచి హసీనా ప్రభుత్వం ఎక్కువ రోజులు అధికారంలో ఉండదనే ప్రచారం మొదలైంది. ఆగస్టు 5 నుంచి బంగ్లాదేశ్‌లో తీవ్ర స్థాయిలో అల్లర్లు జరుగుతున్నాయి. గత వారం తీవ్రం కావడం వల్ల ప్రధాని షేక్ హసీనా పదవికి రాజీనామా చేసి భారత్‌కు వచ్చేశారు. యూకేలో ఆశ్రయం కోసం చేసుకొన్న దరఖాస్తును ఆ దేశం తిరస్కరించింది.

# కొట్టుకుపోయిన తుంగభద్ర డ్యామ్‌గేట్



ఉండాలని అధికారులు కోరారు. తుంగభద్ర గేటు కొట్టుకుపోవడంపై సీఎం చంద్రబాబు ఆరా తీశారు. జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, మంత్రి పయ్యావుల కేశవ్‌లతో మాట్లాడారు. తాత్కా లిక గేటు ఏర్పాటు చేయటంపై టీబీ డ్యాం అధికా రులతో మాట్లాడి తగిన సహకారం అందించాలని మంత్రి పయ్యావుల కేశవ్‌ను సీఎం ఆదేశించారు. తాత్కాలికంగా స్టాప్‌లాక్ గేటు ఏర్పాటు చేయడానికి ఇబ్బందులు ఉన్నాయని మంత్రి పయ్యావుల కేశవ్ వెల్లడించారు. టీబీ డ్యాం 1960లో నిర్మించిన పాత డిజైన్ కావడంవల్ల స్టాప్‌లాక్ గేట్ ఏర్పాటు చేయలేని పరిస్థితి నెలకొందని మంత్రి పయ్యావుల, చంద్రబాబుకు తెలిపారు. అలాగే నీటిపారుదలశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీతో సీఎం మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. తుంగభద్ర డ్యామ్ గేటు కొట్టుకు పోయిన వెంటనే రాష్ట్రంలోని ఉన్నతాధికారులను అప్రమత్తం చేసినట్లు మంత్రి పయ్యావుల కేశవ్ తెలిపారు. డ్యామ్ అధికారులతోనూ మాట్లాడినట్లు చెప్పారు. తెల్లవారుజామున గేటు కొట్టుకుపోవడం, ప్రాజెక్టు నుంచి పెద్ద ఎత్తున నీరు వృథాగా పోతుందన్నారు. అనంతపురం, కర్నూలు జిల్లాలకు తుంగభద్ర డ్యామ్ గుండెకాయలాంటిదన్నారు. దీని నమ్ముకుని లక్షలాదిమంది రైతులు పంటలు వేశారని, నీరు వృథాగా పోకుండా అధికారులు వెంటనే చర్యలు చేపట్టాలని కోరారు.

# కేంద్ర మాజీ మంత్రి నట్వర్ సింగ్ కన్నుమూత

**వృద్ధాప్య సమస్యలతో ఆస్పత్రిలో తుదిశ్వాస**
**ప్రధాని మోదీ తీవ్ర సంతాపం**

**న్యూఢిల్లీ(జనంసాక్షి):** కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నేత నట్వర్‌సింగ్ (93) కన్నుమూశారు. అనారోగ్యంతో గత రెండు వారాలుగా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఆయన..శనివారం అర్ధరాత్రి తుది శ్వాస విడిచారు. గుర్‌గ్రామ్‌లోని మేదాంత ఆసుపత్రిలో కన్నుమూసినట్లు కుటుంబసభ్యులు వెల్లడించారు. నట్వర్ సింగ్ 1931లో రాజస్థాన్‌లోని భరత్‌పూర్ జిల్లాలో జన్మించారు. మన్మోహన్ సింగ్‌గా ప్రధాని ఉన్న సమయంలో నట్వర్‌సింగ్ కేంద్రమంత్రిగా పనిచేశారు. విదేశాంగ మంత్రిగా బాధ్యతలు నిర్వర్తించారు. 1953లో ఐఎఫ్ఎస్ అధికారిగా ఎంపికైన నట్వర్ సింగ్.. 1984లోనే ముందస్తు రిటైర్‌మెంట్ తీసుకున్నారు. గతంలో పాకిస్థాన్‌లో భారత రాయబారిగానూ నట్వర్ పనిచేశారు. 1966 నుండి 1971 వరకు ప్రధాన మంత్రి ఇందిరా గాంధీ కార్యాలయంతో పనిచేశారు. నట్వర్‌సింగ్‌కు 1984లో పద్మభూషణ్ అవార్డు లభించింది.

**ప్రధాని తీవ్ర సంతాపం**

కేంద్ర మాజీ మంత్రి నట్వర్ సింగ్ మృతిపై ప్రధాన మంత్రి మోదీ, విదేశాంగ మంత్రి జైశంకర్ సంతాపం ప్రకటించారు. "నట్వర్ సింగ్ మరణ వార్త తీవ్రంగా బాధించింది. భారత విదేశాంగ విధానంలో ఆయన కృషి ఎనలేనిది. రచయితగానూ అందరికీ సుపరిచితులే. నా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తు న్నా" అని ప్రధాని పోస్టు పెట్టారు. "ప్రముఖ దౌత్యవేత్త, మాజీ విదేశాంగ మంత్రి నట్వర్ సింగ్ మృతి అత్యంత బాధాకరం. భారత్ – అమెరికా న్యూక్లియర్ డీల్‌లో కీలక పాత్ర పోషించారు. దౌత్యం గురించి ఎన్నో విలు వైన పుస్తకాలు రచించారు. ఆయన కుటుంబానికి సానుభూతి తెలియజేస్తున్నా" అని జైశంకర్ పేర్కొన్నారు.

# పంజాబ్‌లో విషాదం

**వాగులో కొట్టుకుపోయిన కారు..**
**11 మంది మృత్యువాత**

**హోషియార్‌పూర్(జనంసాక్షి):** పంజాబ్‌లో విషాదం చోటుచేసుకుంది. పెళ్లి వేడుకకు కారులో బయల్దేరిన ఓ కుటుంబం తిరిగిరాని లోకాలకు వెళ్లింది. భారీ వర్షాల నేపథ్యంలో ఉప్పొంగి ప్రవహిస్తున్న ఓ వాగులో ఎస్‌యూవీ వాహనం కొట్టుకుపోవడంతో ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. ఈ ఘటనలో ఒకే కుటుంబానికి చెందిన ఏడుగురు మృతిచెందగా.. ముగ్గురు గల్లంతయ్యారు. ఈ ఘటనతో వారి స్వగ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి. హిమాచల్ ప్రదేశ్‌లోని మెహత్‌పూర్ సమీపంలోని డెహ్రా నుంచి పంజాబ్‌లోని ఎస్‌బీఎస్ నగర్‌లోని మెహ్రోవాల్ గ్రామంలో జరిగే వివాహ వేడుకకు వెళ్తుండగా ఈ విషాదం చోటుచేసుకుందని పోలీసులు వెల్లడించారు.



# హిండెన్‌బర్గ్ ఆరోపణలతో 'సెబీ' ప్రతిష్ట మసకబారింది

పెట్టుబడిదారులు ప్రస్తుతం ప్రభుత్వానికి మూడు ప్రశ్నలు వేస్తున్నారు. సెబీ ఛైర్‌పర్సన్ మాధవీ పురి ఇంకా ఎందుకు రాజీనామా చేయలేదు?; ఒకవేళ ఇన్వెస్టర్లు తాము కష్టపడి సంపాదించిన డబ్బును కోల్పోతే.. ఎవరు జవాబుదారీగా ఉంటారు? ప్రధాని మోదీనా? సెబీ ఛైర్పర్సనా? లేదా అదానీనా?; కొత్త, తీవ్రమైన ఆరోపణలు వెలుగులోకి వచ్చిన నేపథ్యంలో.. ఈ అంశాన్ని సుప్రీంకోర్టు మరోసారి సుమోటోగా పరిశీలిస్తుందా?" అని 'ఎక్స్' వేదికగా రాహుల్ గాంధీ ప్రశ్నలు లేవనెత్తారు. ఈ వ్యవహారంలో జేపీసీ విచారణకు ప్రధాని ఎందుకు భయపడుతున్నారో అర్థమైందన్నారు. హిండెన్‌బర్గ్ ఆరోపణలను మాధవీ పురి ఇప్పటికే ఖండించారు. ఆ సంస్థ తన వ్యక్తిత్వ హననానికి పాల్పడుతోందని ఆరోపించారు. తమ ఆర్థిక రికార్డులను బహిర్గతం చేస్తామని వెల్లడించారు. తాము ప్రైవేటు వ్యక్తులుగా ఉన్న రోజుల్లో ఆర్థిక కార్యకలాపాల వివరాలను కూడా అధికారులకు ఇచ్చేందుకు సంసిద్ధత వ్యక్తం చేశారు. అదానీ గ్రూప్ కూడా ఈ ఆరోపణలను కుట్రపూరితమేనంటూ కొట్టిపారేసింది. వ్యక్తిగత లాభం కోసం సమాచారాన్ని వక్రీకరిస్తూ మదుపరులను తప్పుదోవపట్టించేందుకు యత్నిస్తోందని పేర్కొంది. అదానీ గ్రూప్ చేస్తున్న కుంభ కోణాలపై, సెబీ ఛైర్మన్ మాధబి పురి బచ్ క్రోనీ క్యాపిటలిజంపై కేంద్ర ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలని విపక్షాలు డిమాండ్ చేస్తున్నాయి. హిండెన్‌బర్గ్ రీసెర్చ్ నివేదికలో చేసిన సంచలన ఆరోపణలపై వెంటనే దర్యాప్తు ప్రారంభించాలని, కానీ మోదీ సర్కార్? ఈ విషయంలో చాలా ఉదాసీనంగా ఉందని దుయ్యబట్టాయి. అమెరికా షార్ట్‌సెల్లర్ సంస్థ హిండెన్‌బర్గ్ రీసెర్చ్ తాజాగా సంచలన ఆరోపణలు చేసింది. అదానీ గ్రూప్ సంస్థల షేర్ల విలువలు కృత్రిమంగా పెంచేందుకు వినియోగించిన మారిషస్ ఫండ్‌లలో సెబీ ఛైర్‌పర్సన్ మాధబి పురి, ఆమె భర్తకు వాటాలు ఉన్నాయని ఆరోపించింది. అదానీ గ్రూప్ అనేక అవకతవకలకు పాల్పడుతోందని కూడా పేర్కొంది. దీనితో విపక్షాలు కేంద్ర ప్రభుత్వం పెద్ద ఎత్తున విమర్శలు కురిపిస్తున్నాయి.

తక్షణమే చర్యలు తీసుకోవాలి – కాంగ్రెస్

అదానీ గ్రూప్‌పై కేంద్రం తక్షణమే చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ డిమాండ్ చేసింది. 'అదానీ గ్రూప్ చేస్తున్న కుంభకోణాలపై దర్యాప్తు విషయంలో సెబీ ఆసక్తి కనబరచకపోవడానికి గల కారణం ఇప్పుడు అర్థమైంది. దీనిని సుప్రీం కోర్టు నిపుణుల కమిటీ కూడా గుర్తించలేకపోయింది' అని కాంగ్రెస్ నేత జైరాం రమేశ్ అన్నారు. 2023లో అదానీ గ్రూప్ చేస్తున్న అవకతవకలపై హిండెన్‌బర్గ్ నివేదిక వెలువరించినప్పుడు 13 అనుమానాస్పద లావాదేవీలపై దర్యాప్తు చేస్తున్నామని సెబీ నిపుణుల కమిటీకి తెలిపిందన్నారు. కానీ ఇప్పటికీ వారు చేస్తున్న దర్యాప్తు పూర్తి కాలేదు అంటూ వ్యంగ్యాస్త్రాలు సంధించారు. ముందు పార్లమెంటు సమావేశాలు ఆగస్టు 12 వరకు కొనసాగుతాయని చెప్పిన మోదీ సర్కార్?, ఆగస్టు 9న మధ్యాహ్నం అకస్మాత్తుగా వాయిదా వేయడానికి కారణం ఏమై ఉండొచ్చో ప్రజలకు ఇప్పుడు అర్థమవుతోందని జైరాం రమేశ్ ఎద్దేవా చేశారు.

ఇది క్రోనీ క్యాపిటలిజం

తృణమూల్ కాంగ్రెస్ నేత మహువా మొయిత్రా ఎక్స్ వేదికగా స్పందిస్తూ 'సెబీ ఛైర్మన్ కూడా అదానీ గ్రూపులో పెట్టుబడిదారుగా ఉన్నారు. అంటే ఇక్కడ క్రోనీ క్యాపిటలిజం స్పష్టంగా కనిపిస్తోంది. ఇప్పుడు సీబీఐ, ఈడీలు సెబీ చీఫ్‌పై దర్యాప్తు ప్రారంభిస్తాయా?" అంటూ ప్రశ్నించారు. గతంలో అదానీ గ్రూప్‌పై హిండెన్‌బర్గ్ చేసిన ఆరోపణలను సుప్రీం పునఃసమీక్షించాలని ఆమె కోరారు. శివసేన (యూబీటీ) నాయకురాలు ప్రియాంక చతుర్వేది మాట్లాడుతూ, అదానీ గ్రూప్ కంపెనీల వివరాలను కోరుతూ తాను రాసిన లేఖలకు సెబీ ఎందుకు సమాధానం ఇవ్వలేదో ఇప్పుడు స్పష్టమైందని తీవ్రంగా విమర్శించారు. అసలేజరిగిందంటే.. హిండెన్‌బర్గ్ రీసెర్చ్ శనివారం విజిల్‌బ్లోయర్ పత్రాలను ఉదహరిస్తూ, గౌతమ్ అదానీ సోదరుడు వినోద్ అదానీ నియంత్రణలో కొన్ని ఆఫ్‌షోర్ బెర్ముడా, మారిషస్ ఫండ్‌లు ఉన్నాయని పేర్కొంది. ఇందులో సెబీ ఛైర్?పర్సన్? మాధబి పురి, ఆమె భర్త ధావల్ బచ్‌లకు వాటాలు ఉన్నాయని ఆరోపించింది. ఈ దంపతుల వాటాల నికర విలువ 10 మిలియన్ డాలర్ల (సుమారు రూ.83 కోట్ల) వరకు ఉండొచ్చని పేర్కొంది.

## వ్యక్తిగత లబ్ధి కోసమే హిండెన్‌బర్గ్ ఆరోపణలు

**– ఇవన్నీ కుట్ర పూరితమే**
**– అదానీ గ్రూప్**

**దిల్లీ(జనంసాక్షి):** తమ సంస్థపై అమెరికా షార్ట్‌సెల్లర్ హిండెన్‌బర్గ్ రీసెర్చ్ చేసిన తా జా ఆరోపణలను అదానీ గ్రూప్ తీవ్రం గా ఖండించింది. అవన్నీ కుట్రపూరితంగా చేస్తున్నవని కొట్టిపారేసింది. వ్యక్తిగత లా భం కోసం సమాచారాన్ని వక్రీకరిస్తూ మ దుపరులను తప్పుదోవపట్టించేందుకు యత్నిస్తోందని తెలిపింది. అదానీ గ్రూప్ సంస్థల షేర్ల విలువలు కృత్రిమంగా పెంచేందుకు వినియోగించిన మారిషస్ ఫండ్‌లలో సెబీ ఛైర్‌పర్సన్ మాధబి పురి, ఆమె భర్తకు వాటాలు ఉన్నాయని హిండెన్‌బర్గ్ తాజాగా ఆరోపించిన నేపథ్యంలో కంపెనీ అధికార ప్రతినిధి ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. హిండెన్‌బర్గ్ చేసిన ఆరోపణలపై ఇప్పటికే సమగ్ర దర్యాప్తు జరిగినట్లు అదానీ గ్రూప్ పేర్కొంది. అవన్నీ నిరాధారమైనవని తేలిందని తెలిపింది. సుప్రీంకోర్టు సైతం క్లీన్‌చిట్ ఇచ్చినట్లు పేర్కొంది. అయినప్పటికీ.. హిండెన్‌బర్గ్ పాత వాదనలను పదే పదే వల్లె వేస్తోందని స్టాక్ ఎక్స్ఛేంజీలకు ఇచ్చిన సమాచారంలో అదానీ గ్రూప్ ప్రతినిధి తెలిపారు. తమ విదేశీ కంపెనీల కార్యకలాపాలు పారదర్శకంగా సాగుతున్నాయని వివరించారు. వాటికి సంబంధించిన వివరాలు ఎప్పటికప్పుడు ప్రజల ముందుంచుతామని చెప్పారు. తమ కంపెనీలకు ఏ వ్యక్తితోనూ వాణిజ్య సంబంధాలు లేవంటూ పరోక్షంగా మాధబి పురిని ఉద్దేశించి తెలిపారు. తమ వ్యాపారాలన్నీ చట్టాలకు లోబడే సాగుతున్నాయన్నారు. అందుకు సంబంధించిన సమాచారాన్ని ఎప్పటికప్పుడు బహిర్గతం చేస్తూ పారదర్శకంగా ముందుకెళ్తున్నామని పేర్కొన్నారు. విజిల్‌బ్లోయర్ పత్రాల ప్రకారం.. గౌతమ్ అదానీ సోదరుడు వినోద్ అదానీ నియంత్రణలో కొన్ని ఆఫ్‌షోర్ బెర్ముడా, మారిషస్ ఫండ్‌లు ఉన్నాయని హిండెన్‌బర్గ్ తాజా నివేదికలో ఆరోపించింది. ఇందులో మాధబి పురి, ఆమె భర్త ధావల్ బచ్‌లకు వాటాలు ఉన్నాయని పేర్కొంది. ఈ దంపతుల వాటాల నికర విలువ 10 మిలియన్ డాలర్ల (సుమారు రూ.83 కోట్ల) వరకు ఉండొచ్చని తెలిపింది. ఈ ఆరోపణలను మాధబి పురి కొట్టిపారేశారు. హిండెన్ బర్గ్ తన వ్యక్తిత్వ హననానికి పాల్పడుతోందని ఆరోపించారు. తమ ఆర్థిక వివరాలను వెల్లడించేందుకు ఎటువంటి ఇబ్బంది లేదన్నారు. గత ఆరోపణలపై సెబీ చర్యలు తీసుకొని షోకాజు నోటీసులు జారీ చేసిన నేపథ్యంలోనే తమపై హిండెన్‌బర్గ్ ఈ తరహా దాడులకు పాల్పడుతోందని ఆరోపించారు. అదానీ గ్రూప్ కంపెనీల షేర్ల విలువను కృత్రిమంగా పెంచేందుకు అవకతవకలకు పాల్పడిందని, కంపెనీల ఖాతాల్లోనూ మోసాలు చేస్తోందని ఆరోపిస్తూ గతేడాది జనవరిలో హిండెన్‌బర్గ్ నివేదిక వెలువరించింది. దీంతో అదానీ గ్రూప్ సంస్థల మార్కెట్ విలువ 150 బి.డాలర్ల మేర పతనమైనా, మళ్లీ దాదాపు పూర్వస్థితికి వచ్చింది. సెబీ, సుప్రీం కోర్టులు కూడా అదానీ గ్రూప్‌నకు క్లీన్‌చిట్ ఇచ్చాయి.

## హిండెన్‌బర్గ్ వ్యక్తిత్వ హననానికి పాల్పడుతోంది

మాధబి దంపతులు ఓ సంయుక్త ప్రకటన జారీ చేశారు. "మా జీవితం తెరిచిన పుస్తకం. ఇప్పటికే కొన్నేళ్లుగా అన్ని రకాల వివరాలను మేం సెబీకి సమర్పించాం. ఏ శాఖ అధికారులు కోరినా.. మేం ప్రైవేటు వ్యక్తులుగా ఉన్న రోజుల్లోని ఏ ఆర్థిక కార్యకలాపాల వివరాలు వెల్లడించేందుకైనా మాకు ఎటువంటి ఇబ్బంది లేదు. రానున్న రోజుల్లో మా ఆర్థిక కార్యకలాపాలకు సంబంధించి సమగ్ర ప్రకటన జారీ చేస్తాం" అని ఆ ప్రకటనలో పేర్కొన్నారు. "హిండెన్‌బర్గ్‌పై సెబీ చర్యలు తీసుకొని షోకాజు నోటీసు జారీ చేయడంతో.. దానికి ప్రతిస్పందనగా ఆ సంస్థ మా వ్యక్తిత్వ హననానికి పాల్పడేందుకు ప్రయత్నించడం దురదృష్టకరం" అని మాధబి దంపతులు ఆరోపించారు. సెబీ ఛైర్‌పర్సన్ మాధబి పురి బచ్‌పై అమెరికా షార్ట్‌సెల్లర్ సంస్థ హిండెన్‌బర్గ్ రీసెర్చ్ సంచలన ఆరోపణలు చేసింది. అదానీ గ్రూప్ సంస్థల షేర్ల విలువలు కృత్రిమంగా పెంచేందుకు వినియోగించిన మారిషస్ ఫండ్‌లలో మాధబి పురి, ఆమె భర్తకు వాటాలు ఉన్నాయని హిండెన్‌బర్గ్ తాజాగా ఆరోపించింది. అదానీకి చెందిన మారిషస్, ఆఫ్‌షోర్ షెల్ సంస్థల వివరాలను తెలుసుకోవడంలో సెబీ ఆసక్తి చూపకపోవడం తమను ఆశ్చర్యపరిచిందని పేర్కొంది. 'నియంత్రణ సంస్థల జోక్యం లేకుండా అదానీ పూర్తి విశ్వాసంతో కార్యకలాపాలు సాగించడం గమనించాం. సెబీ ఛైర్‌పర్సన్ మాధబితో అదానీ సంస్థల సంబంధాలను వివరించడం ద్వారా దీన్ని అర్థం చేసుకోవచ్చు. విజిల్‌బ్లోయర్ పత్రాల ప్రకారం.. గౌతమ్ అదానీ సోదరుడు వినోద్ అదానీ నియంత్రణలో కొన్ని ఆఫ్‌షోర్ బెర్ముడా, మారిషస్ ఫండ్‌లు ఉన్నాయి. ఇందులో మాధబి పురి, ఆమె భర్త ధావల్ బచ్‌లకు వాటాలు ఉన్నాయి' అని హిండెన్‌బర్గ్ తాజా నివేదికలో ఆరోపించింది. ఈ దంపతుల వాటాల నికర విలువ 10 మిలియన్ డాలర్ల (సుమారు రూ.83 కోట్ల) వరకు ఉండొచ్చని తెలిపింది.

# భువనగిరి డిపో హామీ నీటి బుడగేనా?

- ఎమ్మెల్యే గారు మా బాధలు తీరేదెన్నడు?
- భువనగిరి ప్రయాణికుల ఆవేదన



భువనగిరి ప్రతినిధి, ఆగస్టు 11 (జనం సాక్షి) : ఉప్పల్ నుంచి భువనగిరికి వచ్చే ప్రయాణికుల బాధలు వర్ణాతీతంగా ఉన్నాయి. రాష్ట్ర రాజధానికి చేరువలో ఉన్న జిల్లా కేంద్రమైన భువనగిరి కి సరైన రవాణా సదుపాయాలు లేక ప్రయాణికుల బాధలు రోజురోజుకు పెరిగిపోతున్నాయి. సాయంత్రం 6 గంటలు దాటింది అంటే ఉప్పల్‌లో నరకం చూడాల్సిందే. బస్సులు వందల సంఖ్యలో ఉన్న భువనగిరికి మాత్రం రావు అంటారు. హనుమకొండ, వరంగల్, జనగామ డిపోలో బస్సులు నేరుగా జనగామ వరంగల్ అని మాత్రమే అంటూ ప్రయాణికులను పిలుస్తూ ఎక్కించుకుంటారు. భువనగిరి ప్రయాణికుల పరిస్థితి రోడ్డు వెంట బస్సులు కోసం పరుగులు అటు ఇటు తీస్తూ గంటల కొద్ది సమయం వృధా చేసుకోవడమే కొన్ని సందర్భాలలో నాలుగైదు గంటల వరకు వేచి ఉండాల్సిన దుస్థితి. భువనగిరి బస్సు ఎక్కాలంటే కండక్టర్ డ్రైవర్‌లను ప్రాధేయపడాల్సిందే .దీనికి అంతటి కారణం భువనగిరి జిల్లా కేంద్రంలో బస్ డిపో లేకపోవడమే.

విద్యా ఉద్యోగము వ్యాపార వాణిజ్య ఇతరత్రా అవసరాలు రీత్యా అనునిత్యం వేలాదిమంది హైదరాబాదుకు రాకపోగలు సాగిస్తుంటారు. ఈ క్రమంలో ఉప్పల్ బస్ స్టాప్ వద్ద సాయంత్రం పని ముగించుకున్న తర్వాత రావాలి అంటే ఆరు గంటల తర్వాత నుంచి భువనగిరికి వచ్చే ప్రయాణికుల బాధలు నరకప్రాయం. యాదాద్రి భువనగిరి జిల్లాలో ఉన్న ఏకైక బస్ డిపో యాదగిరిగుట్ట అది కేవలం భక్తుల రాకపోకలకు మాత్రమే ఉపకరిస్తుంది. జిల్లాలోని మిగతా 17 మండలాల జనాభాకు ఎటువంటి రవాణాకు ఉపయోగపడే పరిస్థితులు లేవు గత ఎన్నికల్లో స్థానిక ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి ప్రతి ప్రచార మీటింగ్లో పదేపదే భువనగిరి పట్టణ ప్రజల రవాణా పరిస్థితులను మెరుగుపరిచి ఇబ్బందులు తొలగిస్తానని వాగ్దానం చేసి ఇప్పటికి 7 నెలలు దాటిపోయిన పరిస్థితి యథాతదంగానే ఉన్నాయి. దీనికి తోడు ఆర్టీసీ ఉచిత ప్రయాణకుల తోటి నిత్యం వచ్చి పోయే వాళ్లకు ఇబ్బందులు విపరీతంగా పెరిగిపోయాయి అంటున్నారు. ముఖ్యంగా భువనగిరిలో స్వర్ణ గిరి అటు అటు యాదగిరిగుట్ట, భువనగిరి దుర్గం పర్యాటకంగా సమీపంలోని సుప్రసిద్ధ బౌద్ధ పుణ్యక్షేత్రం కొలనుపాక నలువైపులా అనునిత్యం వచ్చి పోయే ప్రయాణికుల రద్దీతో కళకళలాడుతుంటుంది .దానికి తోడు బస్సులు అంతంత మాత్రమే ఇది ఒక వంతు అయితే సాయంత్రం చిన్న పిల్లలు మహిళలు తో వచ్చే ప్రయాణం చేసే వాళ్ళ పరిస్థితి దీనంగా ఉంటుంది . ఉప్పల్ నుంచి.ఏ బస్సు దగ్గరికి వెళ్ళినా భువనగిరికి వెళ్లదు అంటారు ఎవరైనా బలవంతంగా ఎక్కినట్లయితే బైపాస్ లో దిగబెడతారు. పట్టణానికి మూడు కిలోమీటర్ల దూరం ఆటో లేదా నడవాల్సిన దుస్థితి.ఈ పరిస్థితి తోటి దిక్కుతోచని స్థితిలో భువనగిరి వాసుల పరిస్థితి నెలకొంది .ఏది ఏమైనప్పటికీ భువనగిరి పేరు పెద్ద ఊరు దిబ్బ అనేట్టుగానే ఆర్టిసి పరిస్థితులు కనబడుతుంటాయి. బస్ స్టేషన్ పరిస్థితి ప్రయాణికులకు అడుగడుగునా ఇబ్బందులు ఎదురవుతాయి. రాత్రి సమయాల్లో కంట్రోలర్ ఉండరు ఆలస్యమైన ప్రయాణికులకు సమాచారం ఇచ్చే నాధుడే లేక నానా యాతనలు పడుతుంటారు . అయోమయంలో పరిస్థితిలో ఉంటాయి చెప్పడానికి అటు సమీపం హైదరాబాద్ 47 కిలోమీటర్లు దూరంలోనే ఉంటుంది. కానీ ఫలితం మాత్రం శూన్యం అనే ఆవేదనలు వ్యక్తంగా వినిపిస్తుంటాయి ఇప్పటికైనా ఎమ్మెల్యే ఆలోచించి స్థానిక ప్రజలకు న్యాయం చేయాలని కోరుతున్నారు. ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ పట్టణ అధ్యక్షుడు డైరెక్టర్ హ్యూమన్ రైట్స్ యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షుడు తాళ్లపల్లి చంద్రశేఖర్ ఇటీవల ఉప్పల్ లో తాను ఎదుర్కొన్న పరిస్థితులను ఆవేదన వ్యక్తపరిచారు.



# అతిధి అధ్యాపకులపై ఎందుకీ వివక్షా?

- 15 రోజులైనా కంటిన్యూ చేయడం లేదు
- ఉద్యోగ భద్రత కల్పించాలంటున్న విద్యావంతులు
- మంత్రుల మాటలకు విలువలేదు
- ఇంటర్ బోర్డు కమీషనర్ పట్టించుకోదు
- క్లాసులు లేక నష్టపోతున్న పేద విద్యార్థులు
- ప్రభుత్వ ఇంటర్ విద్యను బలహీనం చేస్తున్నారు
- ప్రజా కాంగ్రెస్ ప్రభుత్వానికి చెడ్డ పేరు తెస్తున్నారు
- ఇంటర్ బోర్డు అధికారులు తీరుపై రాష్ట్ర వ్యాప్తంగా సర్వత్రా విమర్శలు

కల్వకుర్తి ఆగస్ట్ 11(జనం సాక్షి) : తెలంగాణ రాష్ట్రంలోని 405 ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గత పది సంవత్సరాల నుంచి విధులు నిర్వహిస్తున్న 1654 మంది అతిథ్యాపకులను కంటిన్యూయేషన్ కొనసాగించి ఉద్యోగ భద్రత కల్పించాలని సామాజిక విద్యావేత్త గెస్ట్ లెక్చరర్స్ సంఘం రాష్ట్ర నాయకులు సదానందం గౌడు డిమాండ్ చేశారు . పాఠాలు బోధించాల్సిన లెక్చరర్స్ చెప్పులు అరిగేలా ఆఫీసుల చుట్టు తిరుగుతూ ఎమ్మెల్యేలు, మంత్రులు, ఇంటర్ బోర్డు కమీషనర్, ప్రిన్సిపాల్ సెక్రటరీలకు వినతిపత్రాలు అందజేసి 15 రోజులు అవుతున్న అతిథుల కంటిన్యూయేషన్ పై ఇవాల రేపు అంటూ కాలం వెళ్ళదీస్తున్నారు.

ఐటి శాఖ మంత్రివర్యులు శ్రీధర్ బాబు ఆదేశాల మేరకు జేఎల్ రిక్రూట్మెంటుతో సంబంధం లేకుండా అతిథి ఆధ్యాపకులను మేనిఫెస్టోలో పెట్టిన ప్రకారము 42,000 జీతం అందించి సూపర్ న్యూమరీ పోస్టుల ద్వారా ఉద్యోగ భద్రత కల్పిస్తామని ఇచ్చిన హామీని వెంటనే అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు ప్రభుత్వ కళాశాల బలోపేతానికి అతిథి ఆధ్యాపకులు అహర్నిశలు కృషి చేయడం జరుగుతుంది అని కళాశాలలో విద్యార్థుల సంఖ్యను పెంచామని చక్కటి రిజల్ట్స్ ని తెప్పించాము అని విద్యార్థులు తల్లిదండ్రుల మరియు అధికారం నుండి ప్రశంసలు పొందుతున్నాము అని అన్నారు. జీతాలు సక్రమంగా సమయానికి రాకపోయినా నిజాయితీగా సమర్థవంతంగా విధులు నిర్వహిస్తున్నాము తెలిపారు. అలాంటి గెస్ట్ లెక్చరర్స్ ని కంటిన్యూయేషన్ ఇచ్చి సుపర్ న్యూ మరీ పోస్టుల ద్వారా ఉద్యోగ భద్రత కల్పించాలని గెస్ట్ లెక్చరర్స్ సంఘం రాష్ట్ర నేత సదానంద గౌడ్ విజ్ఞప్తి చేశారు.



# పని ఒత్తిడితో ఆశాకార్యకర్త మృతి



గద్వాల నడిగడ్డ ఆగస్టు 11 (జనంసాక్షి) : జోగులాంబ గద్వాల జిల్లా రాజోలి మండలంలోని పచ్చర్ల గ్రామానికి చెందిన ఆశ కార్యకర్త మాబుబ్ బీ(46) గత నాలుగు రోజులుగా అనారోగ్యంతో ఉంటే మీటింగులు వ్యాక్సిన్స్ డ్యూటీ ఉండటం వల్ల ఆరోగ్యం క్షీణించింది. శనివారం రాత్రి సీరియస్ కావడంతో కర్నూల్ ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకువెళ్లారు.ఆదివారం ఉదయం 7:30 గంటలకు మృతి చెందింది.ఈమెకు భర్త తో పాటు ఇద్దరూ మగ పిల్లలు ఒక ఆడపిల్ల ఉన్నారు.భర్త రజాక్ రెండు రోజుల ముందు వెళ్లి ఉంటే ఇంత ఆరోగ్యం క్షీణించెది కాదేమో అని వాళ్ళు కన్నీరుమున్నీరయ్యారు.ఆమె మృతి పట్ల పచ్చర్ల గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.ఈమె కుటుంబానికి ప్రభుత్వపరంగా ఆదుకోవాలని ఆశ కార్యకర్తల యూనియన్ డిమాండ్ చేశారు. గద్వాల జిల్లా ఆశా వర్కర్ యూనియన్ అధ్యక్షురాలు పద్మ,మల్దకల్ మండల ఆశ వర్కర్ల సంఘం అధ్యక్షురాలు కాంతమ్మ మృతి చెందిన మాబుబి కుటుంబాన్ని పరామర్శించి 3000 రూపాయలు ఆర్థిక సాయం అందజేశారు.

## రవి కృష్ణ చిల్డ్రన్స్ హాస్పిటల్‌లో వైద్యం వికటించి

# ఎనిమిది నెలల బాలుడు మృతి






- చిన్నారి మృతదేహంతో ఆస్పత్రి నందు బంధువుల ఆందోళన
- అర్హత గల డాక్టర్లు లేకపోవడంతోనే సరైన వైద్యం చేయక బాలుడు మృతి చెందాడని ఆరోపిస్తున్న బంధువులు

ఇబ్రహీంపట్నం, ఆగస్టు 11 (జనం సాక్షి) : రవికృష్ణ చిల్డ్రన్స్ హాస్పిటల్ లో వైద్యం వికటించి ప్రజ్వల్ అనే 8 నెలల బాలుడు మృతి చెందాడు. ఇబ్రహీంపట్నం మండలం రాయపోల్ గ్రామానికి చెందిన ఖానాపురం మహేష్,ప్రవళికల కుమారుడు ప్రజ్వల్ (8 నెలలు) అనే బాలుడు జ్వరం వచ్చిందని ఇబ్రహీంపట్నం మంచాల రోడ్డులో రవికృష్ణ చిల్డ్రన్స్ హాస్పిటల్ కు తీసుకువెళ్లారు. శనివారం రోజు అడ్మిట్ చేయగా డెంగ్యూ ఫీవర్ వచ్చిందని డాక్టర్లు అడ్మిట్ చేసుకున్నారు.ఆదివారం ఉదయం టెస్టులు చేయగా రక్తంలో ప్లేట్లెట్స్ భారీగా పడిపోయాయని అర్జెంటుగా హైదరాబాద్ తీసుకెళ్లి మెరుగైన వైద్యం అందించాలని తల్లిదండ్రులకు తెలిపారు. హైదరాబాద్ కు తరలిస్తుండగా మార్గ మధ్యంలోని బాలుడు మృతి చెందాడు. నిన్న అడ్మిట్ చేసుకొని డాక్టర్ లు ఎలాంటి టెస్టులు చేయకుండా, దగ్గరుండి చూడవలసిన డాక్టర్లు అందుబాటులో లేక కాలయాపన చేయడం వల్లనే బాలుడు మరణించారని దీనికి పూర్తి బాధ్యత ఆస్పత్రి యాజమాన్యందే అని హాస్పిటల్ వద్ద పెద్ద ఎత్తున ఆందోళనకు దిగారు. ఇబ్రహీంపట్నం పోలీసులు ఆందోళన చేస్తున్న బాలుడు బంధువులను అదుపు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇబ్రహీంపట్నం సీఐ సత్యనారాయణ తెలిపారు.

## పాలకుల వైఫల్యం వల్లే వంజరి గ్రామస్తులకు ఇబ్బందులు

- రైల్వే అండర్ బ్రిడ్జిని సందర్శించిన ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్



కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లా బ్యూరో (జనం సాక్షి) : పాలకుల వైఫల్యం వల్లనే ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదని బి.ఆర్.ఎస్ నాయకులు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ అన్నారు. ఆదివారం కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా కాగజ్ నగర్ మండలంలోని వంగిరి రైల్వే అండర్ బ్రిడ్జిని ఆయన బి.ఆర్.ఎస్ నాయకులతో కలిసి సందర్శించారు. రైల్వే అండర్ బ్రిడ్జిలు వర్షం వల్ల నీరు నిలిచిపోవడంతో వ్యాపారులు, రైతులు, విద్యార్థులు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని అన్నారు. స్థానిక ఎమ్మెల్యే హరీష్ బాబు వైఫల్యం వల్ల , అలాగే రాష్ట్ర ప్రభుత్వ అసమర్థ పాలన వల్ల ప్రజలు చాలా ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని తెలిపారు. చాలా గ్రామాలకు వర్షాకాలంలో బురద వల్ల రోడ్డు రవాణా సౌకర్యాలు స్తంభించిపోయాయని తెలిపారు. దీంతో అత్యవసర సమయాల్లో ముఖ్యంగా గర్భిణీలు వెళ్లాలంటే రహదారి సౌకర్యం లేకపోవడంతో వారు మార్గ మధ్యంలోనే ప్రసవించడం, తల్లి బిడ్డ చనిపోవడం ఇలాంటి దురదృష్టక సంఘటనలు దాపురిస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజా సమస్యలను గాలికి వదిలేస్తే తాము చూస్తూ ఊరుకోమని ప్రభుత్వాలను నాయకులను నిలదీసి సమస్యలు పరిష్కారం అయ్యేంతవరకు కొట్లాడుతామన్నారు. ఈ పర్యటనలో బి.ఆర్.ఎస్ జిల్లా కన్వీనర్ ఎల్ శ్యామ్ రావు, ఓదేలు తదితరులు పాల్గొన్నారు.

# సాహసోపేత నిర్ణయాలకు కేరాఫ్ అడ్రస్ మోదీ

- దేశభక్తి విషయంలో రాజీపడని ధీరత్వం ప్రధాని సొంతం
- ఆర్మీ జవాన్లే ఈ దేశానికి రియల్ హీరోస్...అగ్నిపథ్ మంచి స్కీం...
- కేంద్ర హెూం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ వ్యాఖ్యలు.
- ఢిల్లీ డిఫెన్స్ అకాడమీ ' ప్రెషర్స్ డే ' కార్యక్రమం ...





కరీంనగర్ బ్యూరో, ఆగస్టు 11 (జనం సాక్షి) : సాహసోపేత నిర్ణయాలకు కేరాఫ్ అడ్రస్ ప్రధానమంత్రి నరేంద్రమోదీ అని కేంద్ర హెూం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు. దేశభక్తి విషయంలో రాజీలేని ధీరత్వం మోదీ సొంతమన్నారు. 370 ఆర్టికల్ రద్దుతో జమ్మూకాశ్మీర్ భారత్ లో అంతర్భాగమేనని చాటి చెప్పడమే కాకుండా 'ఏక్ దేశ్ మే దో విధాన్, దో ప్రధాన్, దో నిషాన్ నహీ చలేగా అని నిరూపించిన ధీరోధాత్తుడు నరేంద్రమోదీ అని కొనియాడారు. కేంద్రం తీసుకొచ్చిన 'అగ్ని పథ్' స్కీం ఎంతో మంచిదని, దీనిపై ప్రతిపక్షాలు లేనిపోని రాద్ధాంతం చేసి విద్యార్థులను రెచ్చగొట్టి లబ్ది పొందాలని చూశాయన్నారు. ఈ స్కీంలో ఏమైనా ఇబ్బంది ఉంటే ప్రభుత్వం పరిష్కరించేందుకు సిద్ధంగా ఉందే తప్ప విపక్షాల వలలో పడి విద్యార్థులు మోసపోవద్దని కోరారు. ఆదివారం రోజు కరీంనగర్ లోని రేకుర్తి రాజశ్రీ గార్డెన్ లో నిర్వహించిన ఢిల్లీ డిఫెన్స్ అకాడమీ 'ఫ్రెషర్స్ డే' కార్యక్రమానికి బండి సంజయ్ ముఖ్య అతిథిగా హాజరై చేసిన ప్రసంగం విద్యార్థులకు స్ఫూర్తిదాయకంగా నిలిచింది. మీరంతా ఆర్మీ , నేవీ , ఎయిర్ ఫోర్స్ వంటి ఉద్యోగాల కోసం డిఫెన్స్ రంగాన్ని ఎంచుకోవడం నిజంగా చాలా గ్రేట్ అని ఆర్మీ, నేవీ, ఎయిర్ ఫోర్స్ లో పనిచేయడమంటే దేశానికి సేవ చేయడమే, అంత గొప్ప అవకాశం కోసం ఎదురు చూస్తున్న మీరంతా నిజంగా దేశభక్తులే, విద్యార్థుల్లో దేశభక్తి, నైతిక విలువలు పెంచుతూ క్రమశిక్షణను అలవర్చుతూ అత్యున్నతంగా తీర్చిదిద్దుతున్న ఢిల్లీ డిఫెన్స్ అకాడమీ నిర్వాహకులకు హ్యాట్సాఫ్ చెబుతున్నానని తెలిపారు. నా దగ్గరున్న సమాచారం మేరకు... గత ఏడేళ్లలో ఈ అకాడమీ నుండి దాదాపు 2 వేల మంది విద్యార్థులు ఆర్మీ, నేవీ, ఎయిర్ ఫోర్స్ ఉద్యోగాలకు ఎంపికయ్యారంటే... ఆషామాషీ వ్యవహారం కాదాని ఎంతో నిబద్ధతతో, పట్టుదలతో శిక్షణనిస్తూ విద్యార్థులను తీర్చిదిద్దుతున్న ఢిల్లీ ఢిఫెన్స్ అకాడమీ నిర్వాహకులకు నా అభినందనలు అని తెలిపారు. టెన్త్, ఇంటర్మీడియట్ విద్యార్హతతోనే డిఫెన్స్ ఉద్యోగాలు సాధించాలనే తపనతో చిన్న వయసులోనే డిఫెన్స్ శిక్షణ అకాడమీలో చేరి పట్టుదలతో శ్రమిస్తున్న మీ అందరికీ అన్నగా ఆశీర్వదిస్తున్నానని దేశం కోసం సేవ చేయాలని మిమ్ముల్ని ఇక్కడికి పంపిన మీ తల్లిదండ్రులు నిజమైన దేశభక్తులు అని వారందరికీ హ్యాట్సాఫ్ అన్నారు. ఆర్మీలో పని చేయడం అంటే దేశానికి సేవ చేసే అవకాశం దొరకడమే అని ఈ అవకాశం అందరికీ లభించదన్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ 'అగ్నిపథ్' అనే ఒక గొప్ప పథకాన్ని ప్రవేశపెట్టారని అగ్నిపథ్ స్కీం రావడంతో పెద్ద ఎత్తున అగ్నివీరులుగా గుర్తించి నాలుగేళ్లపాటు శిక్షణ ఇస్తున్నాం, నాలుగేళ్ల తరువాత వంద మందిలో 25 శాతం మందిని సెలెక్ట్ చేసి ఆర్మీలో చేర్చుకుంటున్నామని మిగిలిన వాళ్లకు కార్పస్ ఫండ్ పేరిట 5 లక్షలతోపాటు కేంద్రం మరో 5 లక్షలు, మరో లక్ష వడ్డీ కలిపి మొత్తం 11 లక్షల రూపాయలకు నగదును కేంద్రం అందజేస్తుంది. భవిష్యత్తులో జరిగే ఆర్మీ రిక్రూట్ మెంట్ లో అగ్ని వీరులకు 10 శాతం రిజర్వేషన్ కోటాను ప్రకటించింది. 4 ఏళ్లపాటు ఉద్యోగం చేసే సమయంలో ఏదైనా జరిగితే 48 లక్షల రూపాయల ఇన్సూరెన్స్ వస్తుంది. విధి నిర్వహణలో చనిపోతే 44 లక్షల రూపాయల ఎక్స్ గ్రేషియా (నష్ట పరిహారాన్ని) కూడా చెల్లించడం జరుగుతుంది. ఈ సర్వీసులో అంగవైకల్యం కలిగితే కూడా పరిహారం అందజేస్తుందన్నారు. ఎంతో దూరద్రుష్టితో మోదీ ఈ స్కీంను ప్రవేశపెడితే ప్రతిపక్షాలు, కొందరు గిట్టని వారు కలిసి ఎంత రాద్ధాంతం చేశారో మీ అందరికీ తెలుసు అని కాంగ్రెస్, కమ్యూనిస్టు నేతలైతే మోదీ ప్రభుత్వంపై విషం చిమ్మారని మోదీ ప్రభుత్వం అసలు ఉద్యోగాలే భర్తీ చేయలేదని, ఉపాధి కల్పించలేదని దుష్ప్రచారం చేశారు.

# నాడు వెలవెల.. నేడు జలకళ..

- మిడ్ మానేరు ప్రాజెక్టులో 18 టిఎంసిలకు చేరిన నీరు
- ఎల్లంపల్లి నుంచి 3150 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో
- మూలవాగు నుండి 1228 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో
- అన్నపూర్ణ ప్రాజెక్టుకు 6400 క్యూసెక్కుల తరలింపు




రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి, ఆగస్టు 11 (జనంసాక్షి) : మొన్నటి వరకు ఎడారిని తలపించిన శ్రీ రాజరాజేశ్వర జలాశయం (మిడ్ మానేరు ప్రాజెక్టు)నేడు జలకలను సంతరించుకుంది. ప్రాజెక్టులోకి ఎల్లంపల్లి నీరు,మానేరు, మూలవాగు నుంచి వస్తున్న వరదతో సగానికి పైగా నిండింది. ప్రాజెక్టులో నీటి నిలువ పెరగడంతో ఇక్కడి నుంచి అనంతగిరి ప్రాజెక్టుకు నీటిని తరలిస్తున్నారు. ప్రాజెక్టులోకి నీరు చేరడంతో ఆయకట్టు రైతులకు సాగునీటి, జిల్లా తాగునీటి అవసరాలకు సమస్య తీరనుంది. రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినపల్లి మండలంలోని మాన్వాడ వద్ద 27.5 టిఎంసిల సామర్థ్యంతో మిడ్ మానేరు ప్రాజెక్టుని నిర్మించారు. తెలంగాణకు గుండెకాయ లాంటి మిడ్ మానేరు ప్రాజెక్టులో మొన్నటి వరకు నీటి నిలువ తగ్గడంతో ఆయకట్టు రైతులలో ఆందోళన నెలకొంది. వాటర్ హబ్ గా పేర్కొన్న మిడ్ మానేరు ప్రాజెక్టుకు ఎస్సారెస్పీ, కాలేశ్వరం, ఎల్లంపల్లి ,అప్పర్ మానేరు నుంచి ఇన్ ఫ్లో నీరే ఆధారం.ఇక్కడి నుంచి ఇదే సమయంలో ఎల్ఎండి, అన్నపూర్ణ ప్రాజెక్టు, వేములవాడ రాజన్న గుడి చెరువు,రైట్ ,లెఫ్ట్ కెనాల్ కు నీటిని విడుదల చేస్తుంటారు. మిడ్ మానేరు ప్రాజెక్టు నుంచి మిషన్ భగీరథ తాగునీటి అవసరాలకు రుద్రారంలోని ఇంటెక్ వెల్ ద్వారా నీరు వెళు




తుంది. మిడ్ మానేరు ప్రాజెక్టు నుంచి సుమారు రెండు లక్షల ఎకరాలు ఆయకట్టు ఉంది.

**ప్రాజెక్టులో 18 టీఎంసీలకు చేరిన నీరు**

ఎల్లంపల్లి ప్రాజెక్టులోకి భారీగా వరద నీరు వచ్చి చేరడంతో మిడ్ మానేరుకు ఎత్తిపోతలను ప్రారంభించారు. ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి నంది మేడారంలోని నంది హౌస్ రామడుగు మండలం లక్ష్మీపూర్ లోని గాయత్రి పంపు హౌస్ నుంచి మిడ్ మానేరు ప్రాజెక్టుకి నీటిని ఎత్తిపోస్తున్నారు.ఎల్లంపల్లి నుండి ప్రస్తుతం 3,150, మానేరు మూలవాగు నుంచి 1228 క్యూసెక్కుల నీరు ప్రాజెక్టు లోకి వస్తుంది. ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి ఇప్పటివరకు 13,196 టీఎంసీల నీరు రాగా మానేరు మూలవాగు నుండి 1.675 టీఎంసీల నీరు వచ్చి చేరింది. అనంతగిరి ప్రాజెక్టుకు 3 టీఎంసీల నీటిని విడిచిపెట్టారు. ఎస్సారెస్పీ లోకి నీరు వచ్చి చేరుతుండడంతో ప్రాజెక్ట్ నిండితే మిడ్ మానేరుకు వరద కాలువ ద్వారా నీరు రానుంది. ఎల్లంపల్లికి వరద కొనసాగితే పూర్తిస్థాయిలో నిండడానికి అవకాశం ఉంది.

# అంతరించే అంచున ఏనుగుల జాతి

***అత్యంత భారీ శరీరం, పొడవైన తొండం, తెల్లటి పదునైన జంట దంతాలు, నిర్మలమైన కదలికలు, పచ్చి శాకాహార జీవనం, మానవ జీవితాలతో అనుబంధాలను పెంపొందించుకోగలగడం లాంటి ప్రత్యేక లక్షణాలు ఏనుగులకే స్వంతం. భూమిపై సంచరించే జంతువుల్లో అత్యంత పెద్ద జంతువు గజ రాజు మాత్రమే. గజరాజులు తెలివి, జ్ఞాపకశక్తి, సహజీవనం, భావోద్వేగాలను ప్రకటించడం, సహానుభూతి ప్రకటనలు లాంటి పలు సుగుణాలను కలిగి ఉంటాయి.***



12 ఆగష్టు - ప్రపంచ ఏనుగు దినం

ఏనుగుకు పర్యాయ పదాలుగా కరి, గజము, దంతి, హస్తం లాంటి పేర్లు వాడుకలో ఉన్నాయి. ప్రాచీన కాలం నుంచి ఏనుగులు మానవ జీవితాలతో సంబంధాలను పెనవేసుకు న్నాయి. అడవుల్లో భారీ వృక్షాలను పడగొట్టడం, భారీ దుంగలను రవాణా చేయడం, యుద్ధ ఖైదీలను పాదాల కింద తొక్కించడం, వేట నిమిత్తం ఏనుగులపై వెళ్లడం, దేవాలయాల్లో ఊరేగింపుల్లో వాడడం, జంతు ప్రదర్శనశాలలు/సర్కస్‌లలో ప్రధాన ఆకర్షణగా నిలవడం, గజారోహణంలో వినియోగించ బడడం లాంటి విధులకు ఏనుగులను వినియోగించడం చూసాం లేదా తెలుసుకున్నాం. ఏనుగు తల కలిగిన వినాయకుడు, గజేంద్ర మోక్షంలో విష్ణుమూర్తి సుదర్శన చక్రంతో మొసలిని సంహరించి గజేంద్రుడుని కాపాడడం, క్షీరసాగర మథనంలో జనించిన ఇంద్రుడి వాహనంగా శ్వేత వర్ణ ఐరావతం, అష్టలక్ష్ముల్లో గజలక్ష్మి లాంటి అంశాలు హిందూ పురాణాల్లో ఏనుగు ప్రాశస్త్యాన్ని అభివర్ణిస్తున్నాయి.

**ఏనుగుల ప్రజాతులు, ఉపజాతులు:**

ప్రపంచవ్యాప్తంగా ఏనుగులు రెండు ప్రజాతులుగా ఆఫ్రికా, ఏసియా అనబడే రకాలుగా ఉన్నాయి. శతాబ్దం క్రితం 12 మిలియన్ల వరకు ఉన్న ఏనుగుల జనాభా నేడు 4 లక్షల వరకు పడిపోవడం విచారకరం. ప్రతి ఏట 20,000 వరకు చట్టవిరుధంగా చంపబడడం కొనసాగుతున్నది. ఆసియా ఏనుగులను శ్రీలంక, భారతదేశ, సుమత్రా ఏనుగులు అను మూడు ఉపజాతులుగా విభజించారు. భారతదేశ ఉపజాతి ఏనుగులు దాదాపు 36,000, శ్రీలంక ఉపజాతి ఏనుగులు 4,500, సుమత్రా జాతి ఏనుగులు దాదాపు 700 వరకు ఉన్నాయి. భారతదేశ ఉపజాతి ఏనుగులు భారతదేశంతో పాటు ఇండొనేషియాల్లో కనిపిస్తాయి. ఆసియా ఏనుగుల్లో అధిక సంఖ్యలో ఇవి ఉన్నాయి.

**గజరాజులను కాపాడుకోవడం మన కనీస కర్తవ్యం:**

జీవవైవిధ్య పరిరక్షణలో ప్రతి జంతువు మనుగడ తప్పనిసరి. అందమైన, ప్రశాంత భారీ ఆకారం కలిగిన ఏనుగుల జాతిని రక్షించుకోవడం, వాటి అటవీ ఆవాసాలను కాపాడడం, వాటి ప్రాధాన్యాన్ని ప్రచారం చేయడం, ఏనుగుల వేటగాళ్లను కటకటాల్లోకి తోయడం, సామాన్య జనాలకు/విద్యార్థులకు ఏనుగుల అవశ్యకతను వివరించడం లాంటి కార్యక్రమాలకు వేదికగా ప్రతి ఏట 12 ఆగష్టున "ప్రపంచ ఏనుగు దినం(వరల్డ్ ఎలిఫెంట్ డే)" నిర్వహించుట 2012 నుంచి ఆనవాయితీగా మారింది. 4,000 - 7,000 కేజీల బరువు కలిగిన ఏనుగులు వాటి తాగు నీటి వనరులు, నివాస ప్రాంతాల పట్ల అపారమైన జ్ఞాపకశక్తిని కలిగి ఉంటాయని నానుడి. ఏనుగులు అడవుల్లో గుంపులు గుంపులుగా జీవనం కొనసాగిస్తాయి. అక్రమార్జనకు ఏనుగులను వేటాడడం (దంతాలు, ఇతర శరీర భాగాలు), ఆవాసాలను ధ్వంసం చేయడం, మానవ ప్రమేయ అవాంఛనీయ కార్యాలు లాంటి పలు కారణాలతో ఏనుగుల మనుగడ ప్రశ్నార్థకం అవుతున్నది. ప్రపంచ ఏనుగుల దినం-2024 థీమ్‌గా "చారిత్రక ప్రాధాన్యం, ప్రాచీన ఆకర్షణీయ జంతువుగా ఆదరణ, పర్యావరణ పరిరక్షణకు తోడ్పడడం" అనే అంశాన్ని తీసుకొని ప్రచారం నిర్వహిస్తున్నారు. ప్రతి ఏట అక్రమార్జనపరులు వేల కొద్ది ఆఫ్రికన్ ఏనుగులను చంపుతున్నట్లు సమాచారం.

జనంసాక్షి

**భారత్‌లో గజరాజుల చరిత్ర:**

ప్రస్తుతం భారతదేశవ్యాప్తంగా 16 రాష్ట్రాల్లో 15,000 లోపు ఏనుగులు మాత్రమే ఉన్నట్లు అంచనా. ఆసియాలో దాదాపు 55 శాతం ఏనుగులు భారత్‌లో ఉన్నాయి. ప్రపంచ ఏనుగుల జనాభాలో 60 శాతం ఆసియాలో ఉన్నట్లు అంచనా. తమిళనాడు రాష్ట్ర అడవుల్లో దాదాపు 3000లకు పైగా గజరాజులు ఉన్నాయి. ఏనుగుల పరిరక్షణ యజ్ఞంలో వాటి ఆవాసాలను కాపాడడం, వాటి మనుగడకు సహకరించడం, వేటను నిరోధించడం, వన్యప్రాణ సంరక్షణ చట్టాలకు పదును పెట్టడం, సమాజ ప్రమేయ పరిరక్షణ చర్యలు తీసుకోవడం, ఏనుగుల ఆవాస అడవులను కాపాడడం లాంటి చర్యలు నిరంతరం తీసుకుంటూ ఉండాలి. ఇండియన్ ఎలిఫెంట్ అంతరించే ప్రమాదంలో ఉన్న జంతువుల జాబితాలో (ఎండేంజర్డ్ ఆనిమల్) చేర్చబడడం ప్రమాద హెచ్చరికగా తీసుకోవాలి. 2003లో నాగాలాండ్‌లో 'సింగ్‌ఫన్ ఎలిఫెంట్ రిజర్వ్' అనబడే ఏనుగుల అటవీ ప్రాంతాన్ని తీసుకువచ్చారు. దేశవ్యాప్తంగా సింగ్‌ఫన్, పెరియార్, దండెవలి, మయూర్‌బంజ్ లాంటి 32 ఏనుగుల సంరక్షణ అడవులు (ఎలిఫెంట్ రిజర్వ్‌లు) ఉన్నాయి.

అంతరించే జాతుల జాబితాలో చేర్చబడిన ఏనుగులను సత్వరమే బహుముఖీన పరిరక్షణ చర్యలతో కాపాడుకోకపోతే గజరాజులు చూడడానికి అందుబాటులో ఉండవు. ఏనుగుల జనాభా పూర్తిగా తగ్గితే జీవవైవిధ్యానికి విఘాతం కలిగి ప్రాణికోటి మనుగడపై దుష్ప్రభావాలకు కారణం అవుతుందని తెలుసుకొని ఏనుగుల జాతికి పువ్వుల్లో పెట్టి పోషించుకుందాం, మన మనుగడకు మనమే దీపం పడదాం.

**దా: బుర్ర మధుసూదన్ రెడ్డి**
**9949700037**

# ప్రేమ గల మనుషులే గుర్తుంటారు





**ఎండి.మునీర్**
సీనియర్ జర్నలిస్ట్, విశ్లేషకులు
9951865223

ప్రేమ గల మనుషులు కనిపిస్తలేరు. కరువైపోతున్నారు. స్వచ్ఛమైన మనిషి కనుమరుగు అయ్యే పరిస్థితి కనిపిస్తున్నది. సింగరేణి లో పాత బావులు మూత పడినప్పుడు, దశబ్దాలుగా అక్కడ బతుకు తెరువు కోసం కనిపించిన, వచ్చిన టీ,టిఫిన్, వారానికి ఒకసారి, బిర్యానీ, బగారా తినిపించే మల్లన్న, కావమ్మ, బషీర్ భాయ్, ఇమానియల్, నర్సమ్మ హెూటల్స్ కూడ బంద్ అయిపోతున్నాయి.

బొగ్గు బావుల బయట కనిపించిన చిన్న చిన్న హెూటల్లు మనిషి తనం ఉట్టిపడే హెూటల్ ల నిర్వాహకులు కనిపిస్తలేరు. ఆ ప్రాంతం మనిషి తనం ఎప్పుడో మాయంఅయిపోయింది. కనుమరు గైపోతున్నది..!!

**ఆ పాత తరం వెళ్ళిపోతుంది..**

ప్రేమగల పెద్దరికం కనుమరుగైపోతున్నది. ఆ ప్రేమ గల ప్రయాణం, ఆ మనిషి కనిపిస్తే అలింగనం చేసుకునే మనుషులు మాయం అయిపోతున్నారు. ఇక మొత్తంగా కేవలం జ్ఞాపకాలు మాత్రమే మిగిలే పరిస్థితి కాలేరులో కనిపిస్తున్నది. నా ప్రేమ పంచే ఆ కాలేరు వాడల కోసం నా కండ్లు నీళ్లు తీసుకునే పరిస్థితి ఉన్నది. ఆ వారం వారం సైటు పిల్లల హడావిడి, దావతులు, అలాయి, భాలాయి లు కనిపిస్తలేదు.ప్రతీ శనివారం పలారం ఉల్లో అని పిలిచే అమ్మలక్కలు, ఇంటి గేటు ముందుకు వచ్చి పలారం పంచిన రోజులు గుర్తుకు వస్తున్నాయి.ఏ రంజాన్ బీ నో, ఏ మల్లక్క నో, ఏ ఎలిబెత్తో పురిటి నొప్పులతో బస్తికి వచ్చిన సింగరేణి అంబులెన్సు లో ఎక్కి దవఖానకు వెళుతుంటే, సహాయంగా ఇంటికొక్కరు తోడుగా సకల కులస్తులు, మతస్తులు అంబులెన్సు లో దవఖానకు వెళ్లడం చూసిన




కండ్లు ఇప్పుడు ఆ ప్రేమ తగ్గుదు చూసి ఏడుస్తున్నాయి.

నా కార్మికవాడలో అది దసరా అయినా, దీపావళి అయినా, రంజాన్, బక్రీద్, పీరిల పండుగ అయినా, క్రిస్మస్ అయినా, అందరూ కలిసి చేసుకునే వేడుకలు ఇప్పుడు కనిపిస్తలేవు. ఇంటి ముందు గలుమ దాటకుండా టీవీ సీరియల్స్, సినిమాలే లోకంగా కనిస్తున్నది.అచ్చపు మనుషుల కాలేరు, ఇప్పుడు ఏ దిశలో పయనిస్తున్నదో, అంతు చిక్కని పరిస్థితి ఉన్నది.తోటి మనిషి పట్ల ప్రేమానురాగాలు తప్ప, విద్వేషం ఎరుగని కాలేరు లో ఇప్పుడు ప్రేమ కోసం, కొంత పలకరింపు కోసం రిటైర్డ్ జీవితాలు తపించి పోతున్నాయి. కొడుకులే కాదు, బిడ్డల దగ్గర కూడ, మనువల్లు, మనువరాళ్ల కోసం ఇంటి పని వంటపని,బడికి పిల్లల్ని తీసుకుని వెళ్లే, బడి నుంచి తీసుకుని వచ్చే పని చేస్తున్నారు.అందులోనే తృప్తి పడి పోతున్నారు.

విలువలతో కూడిన జీవితంను గడిపిన వారు, అదే విలువల్ని నిలబెట్టడం కోసం చేస్తున్న కృషి, కండ్ల ముందే విఫలం అవుతుంటే ఏమి చేయలేక నిస్సహాయంగా ఉండిపోతున్నారు. ఉన్న దాంట్లో తృప్తి పడిన జీవితం ఇప్పుడు ఉన్న తరం డబ్బు వెనక వెంపర్లాడడం, అందుకోసం నానా గడ్డి కరవడం ను చూడలేని పరిస్థితి ఉన్నది. తమ స్వంత రక్తం చేస్తున్న తప్పును ఎత్తి చూపే పరిస్థితి కూడ లేదు. ఎందుకంటే మానవత్వం ను వారు, అవుట్ డేటెడ్ అంటున్నారు. డబ్బే సర్వస్వం అంటున్నారు. ఒకప్పుడు నల్ల నేల అంటే నే మనిషితనం కు ప్రతీకగా ఉండేది. ఇప్పుడది మారుతున్నది. మనిషి గ్లోబరీకరించబడుతున్నాడు. ప్రేమ, అనురాగాలు కూడ అవుట్ సోర్సింగ్ అయిపోతున్నాయి. మనిషి అనేవాడు మలినం అయిపోతున్నాడు. మానవత్వం హుష్ కాకి అయిపోతున్నది. జారిపోతున్నాడు. దిగజారి పోతున్నాడు. విలువల కోసం బతికే వారు, ఇంకా ఎంతకాలం బతికి ఉంటారో తెలియదు. అందుకే ఉన్నంత కాలం ఓ మనుషుల్లారా.. మనుషులుగా బతికే ప్రయత్నం చేయండి. ఈ ప్రపంచం లో ఏమి మిగలదు. మిగిలేది, కొనసాగేది, ప్రేమ, ఆత్మీయత మాత్రమే..!

## ఆనందంగా జీవించు

వాదించి "మనుషులను"
వేధించి "మనసును"
ఎప్పటికీ గెలవలేము

గౌరవం, ప్రేమ,స్నేహం
పొందడం "కష్టం"!
పోగొట్టు కోవడం
చాలా "సులభం"!!

అందుకే...

వాదించే బదులు చర్చించు
వేధించే బదులు విభేదించు

సహనంతో ఉండు
సమస్యలు తగ్గుతాయి!
ప్రేమను పంచుతూ
ఉండు
రెట్టింపై పెరుగుతుంది

అందరి వాడిగా
ప్రవర్తించు
ఆనందంగా జీవించు !!

జనంసాక్షి

జగ్గయ్య.జి
9849525802

## ఎడబాటు

మన ఎడబాటును
కన్నీటినీ రాసిన
చేతులకు,
మనసుకు
ఈ అక్షరాలు ఎట్ల
దొరికినయో..!
ఏ జన్మల చేసిన పాపమో
ఏ కన్నీటికి కారణం కానీ
మనం
కన్నీళ్ళ పాలైతిమి...!
కలిసి నడిసిన కాళ్లకింది
గడ్డి ఉసురు తాకిందో

కడదాకా కాటిదాక
తోడన్న బంధం
కడ ముట్టక పాయే..!
జారుతున్న
ఏరులాంటి
ఎడబాటు ఘోషను
ఎంత అపుదమన్నా
గా దినాలు
మనం కలిసి బతికిన దినాలు
ఎద నిండా నిండి
ఎదను నింపుకొస్తున్నై..!

జారిపోతున్న ప్రతి
అక్షరాన్ని ఎరుకుంటున్నా
జ్ఞాపకాల మాల చేసి
ఎదమీద ఏసుకొని

జనంసాక్షి

ఎదురు చూస్తున్నా..!

తిరిగిన తొవ్వ
పలికిన పలుకులు
ఎన్నటికైన
ఏ పొద్దుకైన
యప్పికొచ్చి
మళ్లీ
అప్పటిలా కాకున్నా
మనసు తో మనసు కలిపి
గడిచిన కమ్మని
ఆ రోజులతో
మళ్లీ ఎదను తడుపుకోమా
అని..!

మచ్చూరు వెంకట్

# యువత ఒక దశ కాదు.. ఓ విప్లవానికి దిశ

***యువత రేపటి ప్రపంచానికి రూపశిల్పులు. సంకల్పం అభిరుచితో పర్వతాలనైనా కదిలించగలరు. యువత చేతిలో భవిష్యత్తు రూపొందించే శక్తి ఉంది. యువత యొక్క సామర్థ్యానికి అపరిమితమైన, అనంతమైన హద్దులు ఉండవు. ఒక దేశ పురోగతి, అభివృద్ధి ఆ దేశంలోని యువత సహకారంపై ఆధారపడి ఉంటుంది. సామాజిక, ఆర్థిక, రాజకీయ పరిస్థితిలో యువత పాత్ర కీలకం. అందువల్ల యువత అభివృద్ధికి వారి జీవితాలకు సంబంధించిన సమస్యలను అర్థం చేసుకోవడం చాలా ముఖ్యం. యువత సమస్యలను తెలుసుకుని వాటికి పరిష్కారాలు కనుగొనాలి. తద్వారా వారు సమాజం కోసం గొంతు పెంచగలరు.***

**అంతర్జాతీయ యువజన దినోత్సవ చరిత్ర:**

అంతర్జాతీయ యువజన దినోత్సవం ప్రతి సంవత్సరం ఆగస్టు 12 నాడు యువత మానసిక, సామాజిక అభివృద్ధి కోసం జరుపుకుంటారు. ఈ దినోత్సవం ద్వారా యువకులు తమ పనిని కార్యకలాపాలను ప్రపంచ స్థాయిలో ప్రదర్శించే అవకాశాన్ని పొందుతారు. ఐక్యరాజ్యసమితి 1985ని అంతర్జాతీయ యువజన సంవత్సరంగా ప్రకటించింది. ఆ తర్వాత 1995లో ఐక్యరాజ్యసమితి యువత కోసం ప్రపంచ కార్యక్రమాన్ని ప్రారంభించింది. 1998లో పోర్చుగల్‌లోని లిస్బన్‌లో జరిగిన ప్రపంచ యువజన సదస్సు యువత అభివృద్ధి, భాగస్వామ్య ప్రాముఖ్యతను నొక్కి చెప్పింది. ఆ తర్వాత 1999లో ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీ ఆగస్టు 12ని అంతర్జాతీయ యువజన దినోత్సవంగా ప్రకటించింది. ఈ సంవత్సరం థీమ్ " స్థిరమైన అభివృద్ధి కోసం యువత డిజిటల్ మార్గాలు " గా తీసుకోవడం జరిగింది.

**పెరుగుతున్న డిజిటల్ యువత:**

ఐక్యరాజ్యసమితి వరల్డ్ పాపులేషన్ ప్రాస్పెక్ట్స్ డేటా ప్రకారం ప్రపంచంలో 808 కోట్ల జనాభా ఉంది. గత సంవత్సరం కంటే 7.4 కోట్లు పెరిగింది. ఇది యేడాదికి 0.9 శాతం వృద్ధికి సమానం. ప్రపంచ వ్యాప్తంగా 2024 ప్రారంభంలో మొబైల్ ఫోన్ వినియోగదారుల సంఖ్య 561కోట్లకు చేరుకుంది. జీఎస్ఎంఎ ఇంటెలిజెన్స్ తాజా డేటా ఇప్పుడు ప్రపంచ మొత్తం జనాభాలో 69.4 శాతం మంది మొబైల్ ఉపయోగిస్తున్నారని వెల్లడించింది. ప్రపంచవ్యాప్తంగా మొత్తం13.8 కోట్లు గత యేదాది కంటే పెరిగారు. మొత్తం జనాభాలో 66 శాతం కంటే ఎక్కువ మంది ఇంటర్నెట్‌ని ఉపయోగిస్తున్నారు. తాజా డేటాతో ప్రపంచవ్యాప్తంగా మొత్తం వినియోగదారుల సంఖ్య 535 కోట్లగా ఉంది. ఇంటర్నెట్ వినియోగదారులు గత 12 నెలల్లో 1.8 శాతం పెరిగారు. 2023 ప్రారంభం నుండి 9.7 కోట్ల కొత్త వినియోగదారులు చేరారు. కెపియోస్ విశ్లేషణ ప్రకారం, క్రియాశీల సోషల్ మీడియా వినియోగదారు గుర్తింపులు 500 కోట్ల మార్కును అధిగమించాయి. తాజా వినియోగదారు సంఖ్య ప్రపంచ జనాభాలో 62.3 శాతానికి సమానం. ప్రపంచాన్ని

***డిజిటల్ చేరికను పెంపొందించుకోవాల్సిన తక్షణ అవసరం ఉన్నప్పటికీ యువత ఎక్కువగా "డిజిటల్ స్థానికులు"గా గుర్తించబడుతోంది. డిజిటల్ స్థానికులు అంటే డిజిటల్ టెక్నాలజీ ఉనికితో లేదా సమాచార యుగంలో పెరిగిన వ్యక్తి అని అర్థం. వీరు సాంకేతికతను సమాజ సమస్యల పరిష్కారాలను రూపొందించడానికి ఉపయోగిస్తున్నారు.***

**మార్చుతున్న డిజిటలైజేషన్:**

డిజిటలైజేషన్ మన ప్రపంచాన్ని మారుస్తోంది. స్థిరమైన అభివృద్ధిని వేగవంతం చేయడానికి అపూర్వమైన అవకాశాలను అందిస్తోంది. డిజిటలైజేషన్ మన ప్రపంచాన్ని మారుస్తోంది. స్థిరమైన అభివృద్ధిని వేగవంతం చేయడానికి అపూర్వమైన అవకాశాలను అందిస్తోంది. మొబైల్ పరికరాలు, సేవలు, కృత్రిమ మేధస్సు వంటి డిజిటల్ సాంకేతికతలు ఐక్యరాజ్యసమితి సుస్థిరాభివృద్ధి లక్ష్యాలు (యస్డిజి)ను ముందుకు తీసుకెళ్లడంలో కీలకపాత్ర పోషిస్తాయి. ఆర్థిక, సామాజిక, పర్యావరణ పరిమాణాలలో తీవ్ర ప్రభావంతో, డిజిటల్ టెక్నాలజీలు, డేటా అనేవి 169 యస్డిజి లక్ష్యాలలో కనీసం 70 శాతం లక్ష్యాన్ని చేరుకోడానికి దోహద పడతాయి. డిజిటల్ చేరికను పెంపొందించుకోవాల్సిన తక్షణ అవసరం ఉన్నప్పటికీ యువత ఎక్కువగా "డిజిటల్ స్థానికులు"గా గుర్తించబడుతోంది. డిజిటల్ స్థానికులు అంటే డిజిటల్ టెక్నాలజీ ఉనికితో లేదా సమాచార యుగంలో పెరిగిన వ్యక్తి అని అర్థం. వీరు సాంకేతికతను సమాజ సమస్యల వరిష్కారాలను




జనంసాక్షి

రూపొందించడానికి ఉపయోగిస్తున్నారు. ప్రపంచ వ్యాప్తంగా 2022లో 15 నుండి 24 ఏళ్ల మధ్య వయస్సున్న వారిలో 75 శాతం మంది ఇంటర్నెట్‌ని ఉపయోగిస్తున్నారు. ఇది తరాల అంతరం తగ్గుతుందనే సంకేతాలుకు నిదర్శనం. 2020లో యువత (71 శాతం), మిగిలిన జనాభా (57 శాతం) మధ్య డిజిటల్ అందుబాటు రేటు మధ్య వ్యత్యాసం కేవలం14 శాతం పాయింట్లు మాత్రమే ఉండడం ఇక్కడ గమనించాల్సిన విషయం. ప్రపంచంలోని అన్ని ప్రాంతాలలో ఈ వయస్సు ఉన్న వ్యక్తులు పెద్దవారు లేదా అంతకంటే తక్కువ వయస్సు గల వ్యక్తుల కంటే ఎక్కువగా కనెక్ట్ అయ్యారు. సాపేక్ష పరంగా అతిపెద్ద అంతరం తక్కువ ఆదాయ ఆర్థిక వ్యవస్థలలో గమనించబడింది. ఇక్కడ 39 శాతం మంది యువకులు ఇంటర్నెట్‌ను ఉపయోగిస్తున్నారు. మిగిలిన జనాభాలో 23 శాతం మాత్రమే ఉన్నారు. ఇతర వయో వర్గాల కంటే ఎక్కువ రేటుతో, డిజిటల్ స్వీకరణ, ఆవిష్కరణలలో యువత అగ్రగామిగా ఉన్నారు. అయినప్పటికీ అసమానతలు కొనసాగుతున్నాయి. ప్రత్యేకించి తక్కువ ఆదాయ దేశాలలో యువతుల మధ్య మగవారితో పోలిస్తే తరచుగా ఇంటర్నెట్, డిజిటల్ నైపుణ్యాలకు తక్కువ అందుబాటులో ఉంది. యస్డిజి సాధన కోసం 2030 గడువు సమీపిస్తున్నందున ప్రపంచ సమస్యలను పరిష్కరించడానికి డిజిటల్ ఆవిష్కరణలో యువకుల పాత్ర చాలా అవసరం. మొబైల్ పరికరాలు, సేవలు, కృత్రిమ మేధస్సు వంటి డిజిటల్ సాంకేతికతలు సస్టైనబుల్ డెవలప్‌మెంట్ గోల్స్ ముందుకు తీసుకెళ్లడంలో కీలకపాత్ర పోషిస్తాయి. యువత కొత్త సాంకేతికతలను స్వీకరించడంలో, ఆవిష్కరింప జేయడంలో ముందంజలో ఉంటారు. ప్రపంచ వ్యాప్తంగా డిజిటల్ ట్రెండ్‌లను రూపొందించే వినియోగదారులు మరియు డెవలపర్‌లగా అతిపెద్ద జనాభాను ఏర్పరుస్తారు. మొబైల్ పరికరాలు, డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌లు వంటి సాంకేతికతలు, కృత్రిమ మేధస్సు వంటి అభివృద్ధి చెందుతున్న ఆవిష్కరణలు పురోగతిలో కీలక పాత్ర పోషిస్తాయి. కృత్రిమ మేధస్సు వంటి అభివృద్ధి చెందుతున్న ఆవిష్కరణలు పురోగతిలో కీలక పాత్ర పోషిస్తాయి. ప్రతి డిజిటల్ ఇంటరాక్షన్ నుండి రూపొందించ బడిన డేటా డిజిటల్ పరివర్తనకు ప్రాథమికమైనది. ఇది 169 యస్డిజి.లక్ష్యాలలో కనీసం 70%కి దోహద పడుతుందని అంచనా వేయబడింది. డిజిటల్ పరివర్తన అనేది యస్డిజి సాధించడానికి ఉత్ప్రేరకాలుగా పనిచేస్తాయి. డిజిటల్ పరివర్తన అనేది వ్యాపారం యొక్క అన్ని రంగాలలో డిజిటల్ సాంకేతికతను ఏకీకృతం చేయడం. వ్యాపారాన్ని ఎలా ఆపరేట్ చేయాలి, కస్టమర్‌లకు విలువను అందించడం అనేది ఇందులో ప్రాథమికంగా ఉంటుంది. డిజిటల్ పరివర్తన సాధనాలు ఉత్పాదకత, రాబడి, సామర్థ్యం, కస్టమర్ అనుభవంతో పాటు మరింత వినియోగదారులకు మరింత నాణ్యమైన సేవలు అందించడానికి వ్యాపారాన్ని మార్చడంలో సహాయపడే సాఫ్ట్‌వేర్ సాంకేతికతలు. యస్డిజి సాధన సంవత్సరం 2030 గడువు సమీపిస్తున్నందున ప్రపంచ సవాళ్లను పరిష్కరించడానికి సాంకేతిక పరివర్తన శక్తిని పెంచడంలో యువత ముఖ్యమైన జనాభా సమూహం.



**జనక మోహన రావు దుంగ**
**ఫోన్ : 8247045230**

# అనంత విశ్వంలో మన విక్రమ్ ప్రకాశం



ఆగష్టు 12 విక్రమ్ సారాభాయ్ జయంతి

మన ప్రస్తుత ప్రధానమంత్రి నరేంద్రమోదీ మార్గ నిర్దేశం, చంద్రయాన్-3 స్ఫూర్తితో 2040 కల్లా చంద్రుడిపై కాలుమోపడమే మన లక్ష్యమని గతవారం ఓ అధికారిక కార్యక్రమంలో పాల్గొన్న ఇస్రో చైర్మన్ డాక్టర్ యస్.సోమనాథ్ మనందరి ఆత్మవిశ్వాసాన్ని అంతర్జాతీయ మీడియా వేదికగా ప్రకటించారు.మరి స్వాతంత్ర్య భారతపు అంతరిక్ష ప్రయాణం కొన్ని దశాబ్దాలుగా యావత్ ప్రపంచం చూస్తుండగానే ఎన్నో అవాంతరాలను ,అవమానాలను,అనుమానాలను,రాజకీయ నాటకీయ పరిణామాలను దాటుకుంటూ రాట్నాల నుంచి రాకెట్లుగా మారి....గత సంవత్సరం ఆగస్టు 23న చంద్రయాన్ -3 ప్రయోగంలో భాగంగా మన "విక్రమ్" ల్యాండర్ మన త్రివర్ణ పతాకపు గౌరవాన్ని చంద్రుని ఉపరితలంపైన సగర్వంగా నిలబెట్టింది.యావత్ భారతీయుల గుండెలన్నీ జనగణమన గీతంతో దద్దరిల్లిన క్షణాలు అవి.ఇంతకీ ఇస్రో ల్యాండర్ కు ఆ పేరు ఎందుకు పెట్టిందో తెలుసా..?

జనంసాక్షి

"స్వతంత్ర భారతం అభివృద్ధి భారతంగా ఎదిగి ఈ దేశంలో పేదరికం, అసమానతలు కనుమరుగవ్వాలంటే ఖచ్చితంగా శాస్త్ర సాంకేతిక రంగాల్లో మనం మన ప్రతిభను చాటాలి.అంతరిక్షంలో మనం సృష్టించుకున్న ఉపగ్రహాలతో మనం అద్భుతాలు చేయాలని జవహర్ లాల్ నెహ్రూ తో ఒప్పించి తన యావత్ జీవితాన్ని ఈదేశం అభివృద్ధి కోసం, గ్రామీణ ప్రజలకు సాంకేతికత అందించాలనే ఉద్దేశంతో బ్రతికిన అసాధారణ వ్యక్తి, విఖ్యాత భారతీయ భౌతిక శాస్త్రవేత్త,భారత అంతరిక్ష రంగం పితామహుడు పద్మవిభూషణ్ విక్రమ్ సారాభాయ్."ఆయన జ్ఞాపకార్థం,గౌరవార్థం ల్యాండర్ కు విక్రమ్ పేరు పెట్టి ఆయన కీర్తిని అవని నుంచి అనంత విశ్వం దాకా చూపించారు మన ఇస్రో శాస్త్రవేత్తలు.

1919 ఆగస్టు 12 నా అహ్మదాబాద్ లోని ఓ సంపన్న పారిశ్రామికవేత్త ల కుటుంబంలో విక్రమ్ సారాభాయ్ ఉదయించారు.ఆయన కుటుంబం అంతా గాంధీజీ, రవీంద్రనాథ్ ఠాగూర్, మోతీలాల్ నెహ్రూ వంటి వారితో సత్సంబంధాలు కలిగి మన దేశపు స్వాతంత్ర్య సంగ్రామంలో కీలక పాత్ర పోషించారు. భౌతిక శాస్త్రం లో మన తొలి ఆసియా నోబెల్ విజేత, విశ్వ విఖ్యాత భారతరత్న సి.వి.రామన్ పర్యవేక్షణలో బెంగుళూరులోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ లో కాస్మిక్ కిరణాలపై పరిశోధనలు చేసిన విక్రమ్,రెండవ ప్రపంచయుద్ధానంతరం కేంబ్రిడ్జి విశ్వవిద్యాలయం నుండి పి.హెచ్ డి పట్టా పొంది 1947 లో తిరిగి మనదేశానికి వచ్చారు.ఇక అప్పటినుండి పారిశ్రామికవేత్తగా రాణిస్తూనే మనదేశంలో శాస్త్ర సాంకేతిక రంగాల్లో అభివృద్ధికి, విఖ్యాత భారతీయ భౌతిక శాస్త్రవేత్త హెూమీ జె.బాబా తో కలిసి అవిశ్రాంతంగా,అకుంఠిత దీక్షతో,అనంత విశ్వమే హద్దుగా, మన దేశం చేసే అంతరిక్ష,అణ్వాస్త్ర ప్రయోగాల్లో ముఖ్యమైన వ్యక్తిగా నిలిచారు.భారతరత్న అబ్దుల్ కలాం వంటి వారిని మనందరికీ తన వారసత్వపు సంపదగా ఇచ్చి వెళ్ళారు.ఆయన స్ఫూర్తి కొన్ని తరాలకు అందించాలని మన నవయువతరంలో కొంతమంది ని గొప్ప శాస్త్ర వేత్తలుగా మార్చాలని ఆయన గౌరవార్థం కేరళ లోని తిరువనంతపురంలో విక్రమ్ సారాభాయ్ అంతరిక్ష కేంద్రం (వీఎస్ఎస్సీ)ను నెలకొల్పారు. ఇది ఇస్రోకు సంబంధించిన ప్రధాన కేంద్రం. ఈయన జీవిత చరిత్ర కు సంబంధించి అమృతా షా రచించిన విక్రమ్ సారాభాయ్ -ఎ లైఫ్ పుస్తకం ఆయన జీవితంలోని ఎన్నో ప్రముఖ సంఘటనలను వివరించింది.హెూమీ జె.బాబా మరియు విక్రమ్ జీవితాల ఆధారంగా సోని లైవ్ ఓటిటి ప్లాట్ ఫాం వేదికగా రాకెట్ బాయ్స్ పేరుతో రెండు భాగాలుగా హిందీలో విడుదలైన వెబ్ సిరీస్ మిలియన్ల వ్యూస్ తో యువతరాన్ని ఆకట్టుకోవడమే కాక దేశానికి ప్రేరణ ఇచ్చింది.వారి దేశభక్తిని ఆవిష్కరించింది.

ఒకప్పుడు రాకెట్ భాగాలను సైకిల్ పై మోసుకెళ్ళే స్థాయి నుంచి మనం ఒకేసారి వంద ఉపగ్రహాలను అంతరిక్షంలోకి తీసుకెళుతూ అంతర్జాతీయ స్థాయిలో అంతరిక్ష వ్యాపారం చేస్తూ రాకెట్లతో ఆర్థికంగా సంపాదించే స్థాయికి ఎదిగాం.అభివృద్ధి చెందిన దేశాలకు సైతం టెక్నాలజీ అందిస్తూ,శాస్త్రీయ సవాళ్లు విసురుతున్నామంటే ఇదంతా విక్రమ్ సారాభాయ్ దార్శనికత,ఆయన కృషి వల్లనే అని గట్టిగా చెప్పవచ్చు."శబ్దాల మధ్య కూడా సంగీతాన్ని వినగల్గిన వాడే అద్భుత విజయాలు సాధించగలడు"అంటూ జీవితాన్ని ఎంతో తాత్వికంగా చెప్పిన విక్రమ్ మార్గంలో మన ప్రయాణం కొనసాగి శాస్త్ర సాంకేతిక రంగాల్లో మనం అగ్రగామిగా నిలవాలి.కేంద్ర ప్రభుత్వం విక్రమ్ సారాభాయ్ కి భారతరత్న ప్రకటించి ఆయన స్ఫూర్తిని ఇంకా కొన్ని కాంతి సంవత్సరాల దూరం ప్రసరించేలా చూడాలి.



**ఫిజిక్స్ అరుణ్ కుమార్**
**నాగర్ కర్నూల్**
**9394749536**

# కోటి విలువైన బంగారం స్మగ్లింగ్

- బంగారాన్ని అక్రమ రవాణా చేస్తూ షూలో దాచిన వైనం
- ప్రయాణికున్ని అదుపులోకి తీసుకున్న అధికారులు
- బంగారం స్మగ్లింగ్ చేస్తున్నట్లు గుర్తించిన అధికారులు



**శంషాబాద్, ఆగష్టు 11 (జనంసాక్షి)**

కోటి రూపాయల పైచిలుకు విదేశీ బంగారాన్ని అక్రమ రవాణా చేస్తున్న శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో డిఆర్ఐ అధికారులు పట్టుకున్నారు. ఈ సంఘటన ఎయిర్ పోర్టులో ఆదివారం జరిగింది. డిఆర్ఐ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం విదేశాల నుంచి బంగారాన్ని అక్రమంగా తరలిస్తున్నారన్న సమాచారం మేరకు ఎయిర్పోర్టులో ఈ నెల 9వ తేదీన తనిఖీలు నిర్వహించారు. దుబాయ్ నుంచి శంషాబాద్ ఎయిర్పోర్ట్ కు ఒక ప్రయాణికుడు బంగారం స్మగ్లింగ్ చేస్తూ ఇకె – 528 విమానంలో తెల్లవారుజామున ఎయిర్ పోర్టుకు చేరుకున్నాడు. ముందస్తు సమాచారం ఉన్న డిఆర్ఐ అధికారులు ఎయిర్ పోర్టులో ఆ వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. అతనితో పాటు ఉన్న లగేజ్ ని క్షుణ్ణంగా తనిఖీ చేయగా, వెంట తెచ్చిన బ్యాగులో షూలను పరిశీలించారు. అందులో పొడవైన పసుపు రంగులో ఉన్న రెండు బంగారం కడ్డీలను, ఒక బంగారు చైన్ గుర్తించారు. సుమారు రూ. 1,00,06,909/– విలువ గల 1390.850 గ్రాముల బంగారాన్ని స్వాధీనం చేసుకొని నిందితున్ని అదుపులోకి తీసుకునీ దర్యాప్తు చేస్తున్నారు.

# అభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యం అవసరం

- పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్
- కార్పొరేటర్ చింతల అరుణ సురేందర్ యాదవ్‌తో కలిసి కమ్యూనిటీ హాల్ ప్రారంభించిన ఎంపీ



**ఎల్బీనగర్ ఆగస్టు 11 (జనం సాక్షి)**

కాలనీలో అభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యం ఎంతో అవసరమని మల్కాజ్గిరి పార్లమెంట్ సభ్యులు ప్రజల రాజేందర్ అన్నారు. ఆదివారం నాడు ఎల్బీనగర్ నియోజకవర్గం నాగోల్ డివిజన్ శ్రీసాయి నగర్ కాలనీ ఓనర్స్ అసోషియేషన్ ఆధ్వర్యంలో సొంత నిధులతో నిర్మించిన నూతన కమ్యూనిటీ హాల్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యులు ఈటెల రాజేందర్ ముఖ్యఅతిథిగా హాజరై నాగోల్ డివిజన్ కార్పొరేటర్ చింతల అరుణ–సురేందర్ యాదవ్‌తో కలసి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించినారు. అనంతరం కమ్యూనిటీ హాలు ఆవరణలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ..సాయినగర్ కాలనీ ఉన్నటువంటి డ్రైనేజీ సమస్య,రోడ్ల సమస్య త్రాగునీరు సమస్య కాలనీలో ఉన్నటువంటి సమస్యలు వీలైనంత తొందరగా పూర్తి అయ్యేవిధంగా చేస్తానని హామీ ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో బీజేపీ రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షులు సామ రంగారెడ్డి, మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నరసింహ రెడ్డి, కొత్తపేట కార్పొరేటర్ పవన్ కుమార్,శ్రీ సాయినగర్ కాలనీ అధ్యక్షులు మల్లారెడ్డి, ఉపాధ్యక్షులు మల్లప్ప,జనరల్ సెక్రటరీ యుగంధర్ రెడ్డి, ట్రెజరర్ కృష్ణారెడ్డి, బీజేపీ నాయకులు మహిళ నాయకులు కార్యకర్తలు కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

# క్రీడాకారులు విజయ స్ఫూర్తితో ఉండాలి




**మల్కాజిగిరి,ఆగస్టు11(జనంసాక్షి)**

క్రీడాకారులందరూ విజయం స్ఫూర్తితో ఉండాలని ఇంటర్నేషనల్ బ్యాడ్మింటన్ డబుల్స్ క్రీడాకారులు పుల్లెల గాయత్రి, ట్రీసా జాలి అన్నారు, ఆదివారం గచ్చిబౌలిలోని సాయి గోపీచంద్ బ్యాడ్మింటన్ అకాడమీ వేదికగా జరిగిన యూనిక్స్ సన్ రైస్ 10వ తెలంగాణ రాష్ట్ర సబ్ జూనియర్ అండర్ 13 బ్యాడ్మింటన్ ఛాంపియన్ షిప్‌లో రాష్ట్ర సెట్లర్స్ బాలిక సింగిల్స్ విభాగంలో హంసిని చదరం, డబుల్స్ లో విభాగంలో హంసిని చదరం, ప్రియంవద రావు, బాయిస్‌లో సింగిల్స్ విభాగంలో క్రిశవ్ పుప్పాల, డబుల్స్‌లో చిన్మయి, క్రిషవ్ లు విజేతలుగా నిలిచారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఐపీఎల్ గవర్నింగ్ కౌన్సిల్ మెంబర్, బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆఫ్ హైదరాబాద్ అధ్యక్షుడు చాముండేశ్వరి నాథ్, బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆఫ్ హైదరాబాద్ జనరల్ సెక్రెటరీ కానూరి వంశీధర్, బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆఫ్ హైదరాబాద్ మెంబర్లు బంగారు బాబు, ప్రశాంత్ చంద్ర, పిసిఎస్ రావు, శారదా, పివిఎల్. కుమార్, చంద్రశేఖర్, టోర్నమెంట్ రిఫరీ పాపయ్య శాస్త్రి హాజరయ్యారు. అనంతరం గెలిచిన క్రీడాకారులకు బహుమతులను ప్రధానం చేశారు.

# జిల్లా భూ సదస్సులు జయప్రదం చేయాలి

### వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు యు. బుగ్గప్ప



**తాండూరు అగస్టు 11 (జనంసాక్షి)**

అభివృద్ధి పేరుతో వివిధ నియోజకవర్గంలో రైతులు,పేదల భూములు లాక్కోవడాన్ని వెంటనే ఆపాలని, ధరణి పోర్టల్ తో బాధపడుతున్న రైతులు, పేదలభూ సమస్యలు పరిష్కరించాలని వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో కొడంగల్ పట్టణంలో రెడ్డి బసిరెడ్డి ఫంక్షన్ హాల్ లో 2024 ఆగష్టు13 న నిర్వహించబోయే జిల్లా భూ సదస్సులు జయప్రదం చెయ్యాలని తాండూర్ పట్టణంలో భూ సదస్సు కరపత్రం విడుదల చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు కే. శ్రీనివాస్ మాట్లాడుతూ ఫార్మ కంపెనీ పేరుతో హకింపేట్, లగచర్ల, పోలేపల్లి,పులిచర్ల తాండ,రోటిబండా తాండలో మొత్తం 1274 ఎకరాలు మరియు కొడంగల్ మండలం, ఎరాన్ పల్లి గ్రామంలో 74 ఎకరాలు మెడికల్, నర్సింగ్ కాలేజ్ నిర్మాణం పేరుతో పేదల భూములు సేకరించడం జరిగింది. కాని కొడంగల్ నియోజకవర్గంలో 1154 ఎకరాల ప్రభుత్వ సీలింగ్ భూమి అన్యక్రాంతమైంది. కానీ అధికార యంత్రాంగం అట్టి భూముల జోలికి పోకుండా పేదల,సన్నకారు,చిన్న కారు రైతులకు అన్యాయం చేస్తే ఊరుకునేది లేదు అని ప్రభుత్వాన్ని హెచ్చరించడం జరిగింది. పేదలు,రైతుల భూములను లాకుంటే భూములకు భూములు ఇవ్వాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గత పాలకుల విధానాలు ఇప్పుటి ప్రభుత్వం అవలంబిస్తుందన్నారు. దాంతో పాటు అనేక సంవత్సరాలుగా ప్రభుత్వ అసైన్డ్ భూములలో సాగులో ఉన్న సాగుదారులకు పట్టా పాస్ బుక్ లో ఇవ్వాలి. ధరణి పోర్టల్ వల్ల ఏర్పడిన భూ సమస్యలు అనేక పట్ట భూములు అధికారుల తప్పిదం వల్ల పి.ఓ.బి నిషేధిత జాబితాలో పడడం వల్ల అనేకమంది రైతులు తాసిల్దార్ కలెక్టర్ కార్యాలయాల చుట్టూ అనేక రోజుల నుంచి పరిష్కారం కావడం లేదు. ల్యాండ్ ఎక్సస్, సక్షేషన్, మ్యూషన్ వంటి అనేక భూ సమస్యలతో ప్రజలు బాధపడుతున్నారు. అట్టి భూ సమస్యలు పరిష్కరించాలని కొడంగల్ లో జిల్లా భూ సదస్సు నిర్వహించడం జరుగుతుంది. .ఈ భూ సదస్సులో పేదల భూ సమస్యల పరిష్కారం కొరకు భవిష్యత్తు ప్రణాళిక రూపొందించి పోరాటాలకు సన్నదం కావాలన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం తాండూర్ నాయకులు బి. చంద్రయ్య, ఎం. నర్సిములు, గోపాల్ లు పాల్గొన్నారు.

# తహసిల్దార్ల చేతివాటం

- పట్టేదారు లేకుండా అక్రమ రిజిష్ట్రేషన్లు..!
- లబోదిబోమంటున్న రైతులు
- జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన విచారణ పేరుతో కాలయాపన
- కోర్టులో చూసుకోండి తహసిల్దార్ల ఉచిత సలహా
- తమకు న్యాయం చేయాలని రైతుల మొర



**వికారాబాద్ జిల్లా బ్యూరో ఆగస్టు 11 (జనం సాక్షి):**

తహసిల్దార్ల చేతివాటానికి.. వైట్ కలర్ తోడైంది. ఏదన్న అయితే తాను చూసుకుంటామని ఖాకీ ల నుంచి భరోసా వచ్చింది. ఇంకేముంది అక్రమార్కులకు కొండంత బలమైంది .రైతులను నిండా ముంచడానికి పథక రచన చేశారు. పట్టేదారుకు తెలియకుండానే వారి భూములను అక్రమ రిజిస్ట్రేషన్ చేసుకుని జులుం చేస్తున్నారు. సంఘటన వికారాబాద్ జిల్లా మోమిన్ పేట మర్పల్లి తహసిల్దార్ కార్యాలయం పరిధిలో జరిగింది. మోమిన్ పేట మండలం దుర్గం చెరువు గ్రామానికి చెందిన కంకింటి రమేష్ 2015 సంవత్సరంలో కీర్తిశేషులు రామిరెడ్డి అనంతమ్మ దంపతుల దగ్గర సర్వే నంబర్ 175 /అ1. లో 6.50 లక్షలకు ఒక ఎకరం 14 గంటల భూమి కొనుగోలు చేశారు. అప్పట్లో రమేష్ వీరి దగ్గర రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. కానీ రమేష్ మైనర్ కావడంతో పట్టేదారు పాసుబుక్ రాలేదు. దీనిని సాకుగా తీసుకున్న అనంతమ్మ తోటి కోడలు పట్టేదారు లేకుండానే తన పేరు మీద భూమిని మార్చుకున్నారు. ఇందులో తహసిల్దార్ కీలక పాత్ర పోషించారు. పట్టేదారు లేకుండానే వారికి తెలియకుండానే అక్రమ రిజిస్ట్రేషన్ చేశారు. ఈ విషయం తెలియగానే భూమి కొనుగోలు చేసిన రమేష్ లబోదిబోమంటూ మోమిన్ పేట తాసిల్దార్‌కు ఫిర్యాదు చేశారు. ఈ విషయమై పరిశీలించిన తహసిల్దార్ ఇరువురు కోర్టులో తెలుసుకోవాలని ఉచిత సలహా ఇచ్చారు. దీంతో బాధితులు మోమిన్ పేట పోలీస్ స్టేషన్లో తమకు న్యాయం చేయాలని ఫిర్యాదు చేశారు. పట్టాదార్ తెలియకుండా అక్రమ రిజిస్ట్రేషన్ వెనుక కొందరు వైట్ కలర్ నాయకులు ఉన్నట్లు తెలుస్తుంది. ఇదే తరహాలో మర్పల్లి తాసిల్దార్ పరిధిలోని పట్లూరు గ్రామంలో జరిగింది. సర్వే నంబర్ 48 లో కీర్తిశేషులు అంతయ్య కుటుంబం 1955 నుంచి ధరణి పోర్టబుల్ వచ్చేంతవరకు రికార్డులో ఉన్నారు. తాసిల్దారుల ఆట ధరణి మాయతో అక్రమార్కులు వాళ్లకు తెలియకుండానే0.28గుంటల భూమిని అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. అలాగే సర్వే నంబర్ 45 లో ఒక ఎకరానికి పైబడి భూమి అక్రమ రిజిస్ట్రేషన్ జరిగింది. ఈ రెండు సర్వే నెంబర్ల భూములను ఒక్కరే రిజిస్ట్రేషన్ చేసుకోవడం గమనార్హం... ఈ విషయమై బాధితులు మర్పల్లి తహసిల్దార్ కు ఫిర్యాదు చేశారు ఆయన నుంచి స్పందన రాకపోవడంతో వికారాబాద్ జిల్లా కలెక్టర్ కు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్ విచారణకు ఆదేశించారు. కానీ మర్పల్లి తహసిల్దార్ కార్యాలయంలో విచారణ పేరుతో కాలయాపన జరుగుతుంది. అక్రమార్కులు తమ భూమిని ఇంకొకరికి రిజిస్ట్రేషన్ చేయకముందే వారి రిజిస్ట్రేషన్ రద్దుచేసి తమకు న్యాయం చేయాలని బాధితులు కోరుతున్నారు.

# చిట్టి చేతుల్లో మట్టి వినాయక బొమ్మలు



### ఛైర్మన్ భావన శ్రీనివాస్

**ఎల్బీనగర్ ఆగస్టు 11 (జనం సాక్షి)**

భవిష్యత్తు తరాలను దృష్టిలో పెట్టుకొని ప్రతి ఒక్కరూ మట్టి వినాయక ప్రతిమలను పూజించి స్వచ్ఛమైన నీటిలో నిమజ్జనం చేయాలని జాగృతి అభ్యుదయ సంఘం ఛైర్మన్ భావన శ్రీనివాస్ పిలుపునిచ్చారు. వినాయక చవితి పండుగ సందర్భంగా జలవనరుల కాలుష్యానికి కారణమౌతున్న రసాయన రంగుల ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాల స్థానంలో పర్యావరణ హితమైన/మన పూర్వికుల సంప్రదాయమైన మట్టి విగ్రహాలను పూజించి మంచి నీటిలోనే నిమజ్జనమూ చెయ్యాలంటూ గత 15 సం.లుగా జాగృతి అభ్యుదయ సంఘం ఆధ్వరైరంలో చేస్తున్న పలు ఆచరణాత్మక కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం నాడు బి.ఎన్.రెడ్డి డివిజన్ శ్రీ వివేకానంద విద్యా వికాస కేంద్రం వేదికగా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు చేతులతోనే మట్టి వినాయక ప్రతిమలను తయారు చేయడం నేర్పడంతో పాటు అవగాహన కల్పించారు ఛైర్మన్ భావన శ్రీనివాస్.శిక్షణా కార్యక్రమంలో పాల్గొన్న షుమారు 50మంది విద్యార్థులు ఎంతో ఆసక్తిగా వాళ్ళలో దాగిఉన్న సృజనాత్మకతను జోడించి అద్భుతంగా పలు రూపాల్లో మట్టి గణపతి విగ్రహాలు మలిచి నిర్వాహకులను అబ్బుర పరిచారు. ప్రతి ఒక్కరూ ఇంట్లో ఈ విషయాలు చర్చించి తల్లిదండ్రులతో పర్యావరణ జీవనశైలి వైపు అడుగులు వేయించాలని లైట్ ఆర్గనైజేషన్ అద్యక్షులు మరియు టి డబ్ల్యూ సి ఎక్స్ చైర్ పర్సన్ శ్యామలాదేవి పిలుపునిచ్చారు. విద్యార్థులందరూ మట్టిని దేవుడిగా చేద్దాం..భక్తిని పూజగా అర్పిద్దాం..అంటూ నినదిస్తూ ఉత్సాహంగా శిక్షణలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వందన, బాబూరావు, దారుణ్య, స్వాతి, సౌమ్య, శ్రీకాంత్, విద్యార్థులు పాల్గొన్నారు.



## దేవాలయాల అభివృద్ధిలో భాగస్వాములు కావాలి

**మల్కాజిగిరి,ఆగస్టు11(జనంసాక్షి)**

మానసిక ప్రశాంతతకు దేవాలయాలు దోహదపడతాయని మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు పేర్కొన్నారు ఆదివారం నేరేడ్ మెట్ డివిజన్ పరిధిలోని ఆర్కే పురం సంతోషి పురంలో నల్ల పోచమ్మ దేవాలయంలో విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు ఆయనకు శాలువాలతో సత్కరించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. దేవాలయాల అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు చెన్నారెడ్డి స్థానికులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



## రైలు ఢీకొని తండ్రి,ఇద్దరు కుతుర్ల మృతి

**మేడ్చల్ ఆగస్టు 11 (జనం సాక్షి)**

మేడ్చల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని గౌడవెల్లి గ్రామంలో దారుణ చోటు చేసుకుంది. ఆదివారం గౌడవెల్లి రైల్వే స్టేషన్ లో తండ్రి ఇద్దరు కుతురులను రైలు ఢీ కోట్టడంతో అక్కడికక్కడే ముగ్గురు మృతి చెందారు. మృతుడు మేడ్చల్ పట్టణంలోని రాఘవేంద్ర నగర్ కాలనీకి చెందిన కృష్ణ గౌడవెల్లిలో రైల్వే స్టేషన్ లో రైల్వే ట్రాక్ చెకింగ్‌గా పని చేస్తాడని స్థానికులు చెబుతున్నారు.ఆదివారం కావడంతో తన ఇద్దరు కూతుర్లను తీసుకొని పనికి వచ్చాడు కృష్ణ పనిచేస్తుండగా తన కూతురులు రైల్వే పట్టాలపై ఆడుకుంటున్న సమయంలో రైలు అటుగా రావడంతో గమనించిన కృష్ణ ఇద్దరు కూతుర్లను కాపాడబోయి ముగ్గురు మృతి చెందారు. మృతి చెందిన కూతుర్ల పేర్లు వర్షిత,వరిణిగా స్థానికులు చెప్తున్నారు.

# పార్మ కంపెనీ రైతులకు మద్దతుగా

# మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి



- పేదల భూములు లాక్కోవడం
- వెంటనే ఆపాలని ప్రభుత్వానికి డిమాండ్

**కొడంగల్ ఆగస్టు11(జనం సాక్షి):**

కొడంగల్ నియోజకవర్గంలోని దుద్యాల్ మండలంలో అభివృద్ధి పేరుతో రైతులు,పేదల భూములు లాక్కోవడాన్ని వెంటనే ఆపాలని పేదల భూములు తీసుకోకుండా ఏ ప్రాంతంలో ఎటువంటి నష్టం లేని కంపెనీలు పెట్టి యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేయడం జరిగింది. ఈ సందర్భంగా మాజీ గ్రంథాలయ చైర్మన్ శాసం రామకృష్ణ, మాజీ జెడ్పిటిసి కోట్ల మైపాల్, తెలంగాణ ఉద్యమకారుల ఐక్యవేదిక జిల్లా అధ్యక్షులు ఎరాన్ పల్లి శ్రీనివాస్, బిఆర్ఎస్ మండల అధ్యక్షులు కోట్ల యాదగిరి తాలూకా యూత్ వర్కింగ్ ప్రెసిడెంట్ మడిగే శ్రీనివాస్ మాట్లాడుతూ ఫార్మ కంపెనీ పేరుతో హకింపేట్–505, పోలేపల్లి–130ఎకరాలు, లగచర్ల, పులిచర్ల లలో తాండ, రోటిబండా తాండలో 643ఎకరాలు మొత్తం 1274 ఎకరాలు సేకరించడానికి ఇప్పటికే నోటిఫికేషన్ ప్రభుత్వం జారీ చేయడం జరిగింది. రైతులు, పేదల సమ్మతి లేకుండా బలవంతంగా భూ సేకరణ చేస్తే ఊరుకునేది లేదు అని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. గత ప్రభుత్వాలు ఈలాంటి రైతు,ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబించడం, ప్రజలకు ,రైతు,వ్యతిరేక విధానాలు ప్రభుత్వము అవలంభిస్తుంది.. ఇది సరైన పద్ధతి కాదని అన్నారు. కొడంగల్ నియోజకవర్గంలో 1154 ఎకరాల ప్రభుత్వ సీలింగ్ భూమి అన్యక్రాంతమైంది. కానీ అధికార యంత్రాంగం అట్టి భూముల జోలికి పోకుండా పేదల, సన్నకారు, చిన్న కారు రైతులకు అన్యాయం చేస్తున్నారు. దాంతో పాటు అనేక సంవత్సరాలుగా ప్రభుత్వ అసైన్డ్ భూములలో సాగులో ఉన్న సాగుదారులకు పట్టా పాస్ బుక్‌లో ఇవ్వాలి. ధరణి పోర్టల్ వల్ల ఏర్పడిన భూ సమస్యలు వెంటనే పరిష్కరించాలని భవిష్యత్తులో పేదల భూ సమస్యల పరిష్కారం కొరకు ప్రణాళిక రూపొందించి పోరాటాలకు సన్నదం కావడానికి ప్రణాళిక రూపొందిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ భీమ్‌లు, మధుసూదన్ యాదవ్, నరేష్ గౌడ్ ,మల్లేష్, నర్సిములు, బసప్ప, మణికంఠ గౌడ్, నారాయణ, వెంకటయ్య, శివకుమార్, గోపాల్ నాయక్ బుగ్గప్ప, ఎర్ర వెంకటయ్య, యాదయ్య, విశాల్, భూ బాధితులు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## గిరి ప్రదక్షిణలో ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే బీర్ల

**యాదాద్రి భువనగిరి జిల్లా బ్యూరో ఆగస్టు 11 (జనం సాక్షి)**

యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి గిరి ప్రదక్షిణలో ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య కుటుంబ సమేతంగా పాల్గొన్నారు. ముందుగా కొండ కింద రాజగోపురం పాదాల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రదక్షిణ ప్రారంభించారు కార్యక్రమంలో జిల్లా నలుమూలల నుంచి ముఖ్యంగా నియోజకవర్గ కేంద్రం ఆలేరు, యాదగిరిగుట్ట తదితర ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు ఎమ్మెల్యేతో ఆలయ ఈవో భాస్కరరావు వేద పండితులు ప్రముఖులు పాల్గొన్నారు. స్వాతి నక్షత్రం సందర్భంగా ముందుగా పాదాల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి జై భోలో లక్ష్మీనరసింహస్వామి అంటూ,భజనలు చేస్తూ,యధా ఋషి వద్ద నమస్కరించి ఈ గిరిప్రదక్షిణ కొనసాగించారు






## సమాన హక్కులు, సంపాద కలిగిన సమాజంకై కృషి చేద్దాం

### సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ జిల్లా కార్యదర్శి బి.రాము

**నారాయణపేట జిల్లా బ్యూరో(జనం సాక్షి):**

నేటిపెట్టుబడుదారి సమాజంలో మనుషులందరికీ సమాన హక్కులు,సమాన సంపద ఉండదని పాలకవర్గాలు అలా ఉండనీయవని సమాన సంపద, సమాన హక్కులు, శ్రమకు తగ్గ ఫలితం అందే సమ సమాజానికై మనమందరం పోరాటం చేయాలని సిపిఐ (ఎంఎల్) మాస్ లైన్ జిల్లా కార్యదర్శి బి.రాము అన్నారు. ఆదివారం సిపిఐ(ఎంఎల్) మాస్ లైన్ నారాయణపేట డివిజన్ రాజకీయ శిక్షణ తరగతులు నారాయణపేట మండలంలోని, కోటకొండ గ్రామంలో నిర్వహించారు. ఈ క్లాసులకు సిపిఐ (ఎంఎల్)మాస్ లైన్ డివిజన్ కార్యదర్శి కె.కాశీనాథ్ ప్రారంభ ఉపన్యాసం చేయగా చారిత్రక భౌతిక వాదం అనే క్లాసును బిసమాజంలో విద్య, వైద్య, అధికారం సంపద అని అందరికీ దక్కాలంటే చైతన్యవంతమైన మాస్ లైన్ పార్టీ ఆధ్వర్యంలో దోపిడీ వ్యవస్థను కూల్చడం కోసం ప్రజలు ఏకం కావాలన్నారు. ఈ క్లాసులకు పార్టీ మండల కార్యదర్శి బి.నరసింహ అధ్యక్షత వహించారు. ఈ క్లాసులలో పార్టీ జిల్లా నాయకులు యాదగిరి, కాలేశ్వర్, విజయలక్ష్మి, బి. రాము, డివిజన్ నాయకులు కె.నర్సింలు, ప్రశాంత్, హాజీమలగ్, నారాయణ, సాయికుమార్, అంజి, ఏ.నరసింహ, బాలకృష్ణ, రాములు వీరితోపాటు పార్టీ ప్రతినిధులు పాల్గొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
సోమవారం
12 ఆగస్టు 2024

# అనుమతులు నిల్..అక్రమాలు ఫుల్

- పచ్చని గ్రామంలో మొదలైన అక్రమ నిర్మాణం
- అక్రమ నిర్మాణాలకు అడ్డాగా మారిన రామేశ్వరం బండ
- చోద్యం చూస్తున్న అధికారులు






పటాన్ చేరు రూరల్ ఆగస్టు 11 (జనం సాక్షి)

సంగారెడ్డి జిల్లా పటాన్ చేరు మండలంలోని పలు గ్రామాల్లో అక్రమ కట్టడాలు, నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన భవనాలతో ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి పడుతుంది. పలుసార్లు అక్రమ కట్టడాలపై దృష్టి పెట్టాలని, నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన వారిపై కఠినంగా వ్యవహరించాలని చెబుతున్న ఉన్నతాధికారుల మాటలు వట్టి నీటి మాటలుగానే అవుతున్నాయి. పటాన్ చేరు మండలం లోని రామేశ్వరం బండ గ్రామంలోని ఓ వెంచర్ లో నిబంధనలకు విరుద్ధంగా అక్రమ భవన నిర్మాణం జరుగుతున్న అధికారుల చూపు మాత్రం ఆ వైపు పడటం లేదు. నాలా కన్వర్షన్ లేకుండా, పంచాయితీ అనుమతులు లేకుండా ఇంటి నిర్మాణం జరుగుతున్న స్థానిక అధికారులు ఎలాంటి నోటీసులు జారీ చేయకపోవడం పలు అనుమానాలకు తావిస్తుంది. ఎలాంటి అనుమతులు లేకుండా భవన నిర్మాణం జరిగిన అధికారులు పట్టించుకోకపోవడం పై ముడుపులు చెల్లిస్తే ఎక్కడైనా అనుమతులు లేకుండానే నిర్మాణాలు చేసుకోవచ్చు అనే చర్చ ఆయా గ్రామాల్లో జోరుగా వినిపిస్తుంది. అక్రమ నిర్మాణం గురించి పంచాయితీ కార్యదర్శి భవానిని వివరణ కోరగా నోటీసులు జారీ చేశామని తెలిపారు. ప్రభుత్వం ఆన్‌లైన్ విధానాన్ని ప్రవేశపెట్టినా క్షేత్రస్థాయిలో విధులు నిర్వర్తించే అధికారులు చేతివాటం ప్రదర్శిస్తూ అక్రమ నిర్మాణాలను ప్రోత్సహిస్తున్నారనే ఆరోపణలు జోరుగా వినిపిస్తున్నాయి. ఉన్నతాధికారులు పరిశీలించి చర్యలు తీసుకోకపోవడంతో నిబంధనలు పాటించకుండా గ్రామాల్లో ఎక్కడ పడితే అక్కడ భవన నిర్మాణాలు యథేచ్ఛగా నిర్మిస్తారని విమర్శలు వినిపిస్తున్నాయి. కొన్ని చోట్ల మాజీ ప్రజా ప్రతినిధులు అక్రమ కట్టడాలను ప్రోత్సహిస్తున్నారనే ఆరోపణలొస్తున్నాయి .ఇప్పటికైనా టాస్క్‌ఫోర్స్, సంబంధిత అధికారులు స్పందించి గ్రామాల్లోని అక్రమ నిర్మాణాలకు అడ్డుకట్ట వేసి తగు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

## మున్సిపాలిటీ అభివృద్ధికి కృషి చేస్తా

### మున్సిపల్ చైర్మన్ ఆనంద్ కుమార్ గౌడ్

మహబూబ్ నగర్ ఆగస్టు 11 (జనం సాక్షి)



మహబూబ్ నగర్ మున్సిపాలిటీ అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తానని మున్సిపల్ చైర్మన్ ఆనంద్ కుమార్ గౌడ్ అన్నారు. ఆదివారం మహబూబ్ నగర్ మున్సిపాలిటీ పరిధిలోని 4, 5వ వార్డులలోని వినాయక్ నగర్, జయశంకర్ కాలనీలలో కౌన్సిలర్ వనజ వెంకటయ్య , స్థానిక కాంగ్రెస్ నాయకులతో కలిసి పర్యటించారు . వినాయక నగర్ నూతన కమాన్‌ను, 9 వ వార్డు పాలకొండ లోని శ్రీ దత్త కాలనీలో తాగునీరు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని గమనించి వారి దాహార్తిని తీర్చేందుకు నూతనంగా మిషన్ భగీరథ కొత్త పైప్ లైన్ ను ఏర్పాటు చేసి మంచినీటి సరఫరాను ఆయన ప్రారంభించారు. అనంతరం చైర్మన్ పలు కాలనీలలో పర్యటించి కాలనీవాసులను అడిగి సమస్యలను తెలుసుకున్నారు. కురుస్తున్న వర్షాలకు రోడ్లపై నిలిచి ఉన్న నీటిని పరిశీలించి, రోడ్లపై నీరు నిల్వ ఉండకుండా త్వరలో అన్ని చర్యలు తీసుకుంటామని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు పాలకొండ శీను, రమేష్, మూసా శీను, ప్రభాకర్, స్థానిక నాయకులు రామస్వామి, తిరుపతయ్య, పురుషోత్తం, వెంకటేష్‌లతో పాటు కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

## ఆక్రమాలకు తావు లేకుండా సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

### ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి

వనపర్తి, ఆగస్టు 11 (జనంసాక్షి):



పేదలకు వైద్య ఖర్చుల కోసం అందించే సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అక్రమాలకు తావు లేకుండా పంపిణీ చేస్తున్నాని స్థానిక ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి అన్నారు. వనపర్తి మండల పరిధిలోని సవాయిగూడెం గ్రామంలో పలు వురు లబ్దిదారులకు ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ప్రభుత్వంలో సీఎంఆర్ఎఫ్, కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులు మంజూరీ చేయించడానికి మధ్య దళారీలు లంచాలు తీసుకునే వారని, కాని ఇందిరమ్మ రాజ్యంలో అలాంటి అక్రమాలకు ,అవినీతికి చోటు లేదన్నారు. దరఖాస్తుదారులు ఎవరికీ లంచాలు ఇవ్వాల్సిన అవసరం లేదని, నేరుగా తన క్యాంపు ఆఫీసులో అందజేయాలని కోరారు. మంజూరైన చెక్కులను ఇంటింటికి వచ్చి తాను స్వయంగా అందజేస్తానని అన్నారు. ప్రజలు ఎవరు కూడా దళారుల మాటలు నమ్మి మోసపోకూడదని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఆర్థిక పరిస్థితులు బాగోలేక ఇబ్బందులు ఎదుర్కొని ప్రైవేట్ ఆసుపత్రులలో చికిత్స చేయించుకున్న నిరుపేదలకు ముఖ్యమంత్రి సహాయనిధి కోసం దరఖాస్తు చేసుకున్న ప్రతి లబ్ధిదారునికి కాంగ్రెస్ ప్రభుత్వంలో ఆర్థిక సహాయం అందుతుందని అన్నారు. సమయానుకూలంగా తాను అందుబాటులో లేకుంటే ఈ సహాయాన్ని కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు లబ్ధిదారులకు ఇంటి వద్దకు వెళ్లి చెక్కులను అందించాలని సూచించారు. కాగా కొత్త ప్రభుత్వం ఏర్పడిన తర్వాత వనపర్తి అసెంబ్లీ నియోజకవర్గంలో ఇప్పటి దాకా రూ. 1,07,83,500 ల విలువ గల చెక్కులను 525 లబ్ధిదారులకు మంది పంపిణీ చేసినట్లు కాంగ్రెస్ వర్గాలు తెలిపాయి. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కిచ్చారెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## సైబర్ నేరగాళ్ల చేతిలో మోసపోవద్దు

### జిల్లా ఎస్పీ యోగేష్ గౌతమ్

నారాయణపేట జిల్లా బ్యూరో(జనం సాక్షి):



సైబర్ నేరగాళ్ల నుండి ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సైబర్ నేరగాళ్లు చూపే మోసపూరిత ఆశలకు గురికారాదని జిల్లా ఎస్పీ యోగేష్ గౌతమ్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతము అనేక రకాలుగా సైబర్ నేరగాళ్లు ప్రజలను మోసం చేయడం జరుగుతుందని అధిక లాభాల కోసం ఆశపడి ఆన్లైన్లో పెట్టుబడి పెట్టకండి ఎవరో చెప్పింది విని లేదా సోషల్ మీడియాలో యాడ్స్ చూసి మోసపోకండి, మీరు పెట్టుబడి పెట్టండి మరియు మీ బంధుమిత్రులతో పెట్టుబడి పెట్టించి అదిక లాభాలు పొందండి అంటూ ఆశ చూపించే చైన్ ఇన్వెస్ట్మెంట్ మోసపూరితమైనదని గ్రహించాలని అన్నారు. ఎవరైనా కొత్త వ్యక్తులు మీకు క్యూఆర్ కోడ్ పంపించి దాన్ని స్కాన్ చేస్తే మీకు డబ్బులు వస్తాయని చెప్తే నమ్మకండన్నారు.అ ది సైబర్ మోసం అని గ్రహించాలన్నారు. ఆన్లైన్ లోన్స్ గురించి లోన్స్ యాప్లను మీ ఫోన్‌లో డౌన్లోడ్ చేసినప్పుడు మీ ఫోన్లో ఉన్న అన్ని ఫోన్ నెంబర్లు ఫోటోలు మరియు మీ వ్యక్తిగత వివరాలు యాప్ వారు మీ అనుమతి లేకుండా తీసుకుంటారనీ తెలిపారు.తర్వాత మీరు తీసుకున్న లోన్ తిరిగి కట్టిన ఎక్కువ డబ్బులు కట్టమని ఆ వివరాలతో వేధింపులకు గురి చేస్తారన్నారు.అందుకు గాను తస్మాత్ జాగ్రత్త అని ఆన్లైన్ లోన్ ఆప్స్ ద్వారా లోన్స్ తీసుకోరాదని సూచించారు. సైబర్ నేరాలపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని పోలీసులకు ఆదేశాలు ఇవ్వడం జరిగింది అని ఎస్పీ తెలిపారు. ప్రజలు మీరు జాగ్రత్తగా ఉండండి తోటి వారిని సైబర్ నేరాల బారిన పడకుండా వారికి అవగాహన కల్పించండి అని ఎస్పీ కోరారు.

## ముదిరాజ్ సామాజిక వర్గ బలోపేతానికి కృషి



### చించోలిలో నీలం మధుకు కర్ణాటక కోలీ సమాజ్ ఘన సత్కారం

సంగారెడ్డి ప్రతినిధి, ఆగస్టు11(జనం సాక్షి)

జాతీయస్థాయిలో కోలీ (ముదిరాజ్) సమాజ్ బలోపేతానికి కృషి చేస్తానని మెదక్ పార్లమెంట్ కంటెస్టెడ్ కాంగ్రెస్ పార్టీ క్యాండిడేట్ నీలం మధు ముదిరాజ్ అన్నారు. ఆదివారం కర్ణాటకలోని చించొలి నియోజక వర్గంలో ఆయన పర్యటించారు. చించోలి పట్టణ కేంద్రం లోని కోలీ సమాజ్ భవనంలో కోలి సభ్యులు ఏర్పాటు చేసిన ఆత్మీయ సన్మాన కార్యక్రమానికి స్థానిక ఇంచార్జ్ మరియు కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు సుభాష్ రాథోడ్‌తో కలిసి హాజరయ్యారు. ఈ సంధర్భంగా చించొలి కోలీ సమాజ్ ఆధ్వర్యంలో నీలం మధు ను ఘనంగా సత్కరించారు. చించొలిలో నిర్మించిన కోలీ సమాజ్ భవనానికి నీలం మధు సంపూర్ణ సహకారం అందిస్తా అన్నారు. అనంతరం నీలం మధు మాట్లాడుతూ దక్షిణ భారతదేశంలో రెండు కోట్లకు పైగా దేశ జనాభాలో 6% పైగా ఉన్న కోలీ సమాజ్ ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. అందరం కలిసి కట్టుగా ముందుకు సాగి మన జాతి ఐక్యతకు కృషి చేద్దామని పిలుపునిచ్చారు. మనమంతా ఐక్యమత్యంగా కలిసి ఉన్నప్పుడే రాజకీయంగా అవకాశాలు వస్తాయని స్పష్టం చేశారు. మన జాతి రాజకీయంగా ఎదిగేతేనే మన జాతికి న్యాయం చేసుకునే అవకాశం వస్తుందన్నారు. కాంగ్రెస్ పార్టీ అన్ని వర్గాల ప్రజలకు సామాజిక న్యాయం అందించే దిశగా పని చేస్తుందన్నారు. కర్ణాటకలోని ముఖ్యమంత్రి సిద్ధరామయ్య సారథ్యంలో ఇక్కడ ప్రభుత్వం మత్స్యకారుల ఆర్థిక అభివృద్ధికి కృషి చేస్తున్నారని కొనియాడారు. అదేవిధంగా తెలంగాణలో సైతం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో ముదిరాజులకు గుర్తింపు దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు, స్థానిక ఇంచార్జ్ సుభాష్ రాథోడ్, కోలి సమాజ్ రాష్ట్ర కార్యదర్శి లక్మన్ ఆవంటి, నియోజకవర్గ కాంగ్రెస్ యూత్ ప్రెసిడెంట్ సురేష్ బంట, నియోజకవర్గ కౌలి సమాజ్ ప్రెసిడెంట్ అనిల్ జమేదార్, రాములు షాదీపూర్, టౌన్ పంచాయత్ నెంబర్ అబ్దుల్ భాషిత్, జనార్ధన్, అనంద్ టైగర్, జాయిప్ప, గాలి శ్రీనివాస్, వెంకట్ రెడ్డి, స్థానిక నాయకులు,తదితరులు, పాల్గొన్నారు.

## ప్రజల జీవితాలనుండె పాటలు పుడుతాయి

- ప్రతి గాయకుడు నిత్యవిద్యార్థిగా చైతన్యం కావాలని
- ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్

నాగర్ కర్నూల్ జిల్లా బ్యూరో,ఆగస్ట్ 11 (జనంసాక్షి):



జీవితాలనుండే పాటపుడుతుందని మానవత్వం, సామాజిక దృక్పథం, సిద్ధాంతం పాట లక్షణాలని, పాట రాయాలనుకునేవారు వీటిని ఆచరించాలని ప్రముఖ కవి గాయకుడు శాసనమండలి సభ్యులు దేశపతి శ్రీనివాస్ కోరారు. ఆదివారం నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలోని సింగిల్ విండో సమావేశం హాల్ లో నెలపొడుపు సాహిత్య సాంస్కృతిక వేదిక మరియు తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సంయుక్తంగా నిర్వహించిన సభకు కల్వకోల్ మద్దిలేటి అధ్యక్షత వహించారు. పాట నిర్మాణంపై జరిగిన వర్క్ షాపులో ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్ మాట్లాడుతూ పని పాటలనుండే శ్రమైక జీవితం నుండే పాటలు వస్తాయని ప్రజల జీవితాలతో పాటలు రచయితలు మమైకం కావాలని కోరారు. పల్లెల్లోనే ఎక్కువగా పాటలు వస్తాయని ప్రదానంగా కూలీలు రైతులు శ్రామికులు మహిళలు పలుకుబడులు పుడుతాయని అందుకు నిదర్శనం ప్రజాయుద్ధనౌక గద్దరన్ననే ఆయన పాటలను ఉదాహరణ పూర్వకంగా పాటలు పాడుతూ ఆయన పాటించిన ప్రమాణాలను సిద్ధాంతాన్ని జీవితాన్ని దేశపతి వివరించారు. పాలమూరు మట్టిబిడ్డ పురుషోత్తం అంటూ పౌరహక్కులకు ప్రాణం పోసిన నేతంటూ..వట్టికోట ఆళ్వారు స్వామి గూడ ఆంజన్న ప్రజాయుద్ధనౌక గద్దరన్నా వందనాలు అంటూ అమరులపై ప్రజాగీతాలాపించారు. ఒక పాట రాయాలంటే వెయ్యి పాటలను వినాలని,ఆత్మలను పలికించే భాష కావాలని,కవి గాయకుల రక్తంలోనే శృతి జీర్ణం కావాలని మానవీయ స్పందన కావాలన్నారు. దాశరథి, గోరటివెంకన్న పాల్కూర్కి సోమన్న, పోతన, తెలంగాణ కవులు సుద్దాల హన్మంత్ మల్లావఝుల సదాశివుడు అనుసరించిన బాణీలను వారి కవిత్వాన్ని వివరిస్తూ పాడుతూ సభను రక్తికట్టించారు. ప్రతి గాయకుడు నిత్యవిద్యార్థిగా చైతన్యం కావాలని అధ్యయనం పరిశీలన మహానుభావుల చరిత్రలను చదువాలని కోరారు. విశిష్ట అతిథిగా హాజరైన డాక్టర్ పసునూరి రవీందర్ మాట్లాడుతూ జానపద బాణీలు తెలంగాణ సాయుధపోరాటం కారంచేడు చుండూరు, పదిరికుప్పం వేంపేట తెలంగాణ మలిదశ ఉద్యమం, ప్రజానాట్యమండలి జననాట్యమండలి ఆయా కాలాలలో వచ్చిన ఉద్యమాలలోని కవులు, గాయకులు పాడిన పాటలను వివరిస్తూ వీటిని ప్రతిగాయకుడు అధ్యయనం చేయాలన్నారు. ఈ సందర్భంగా దేశపతి శ్రీనివాస్ పసునూరి రవీందర్ లను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రఖ్యాత రంగస్థల కళాకారులు డి.రాములు, కవి సామాజిక ఉద్యమ కారులు ఎదిరెపల్లి కాశన్న,జయప్రకాష్,నెలపొడుపు సాహిత్య సాంస్కృతిక వేదిక అధ్యక్షులు వనపట్ల సుబ్బయ్య, ప్రధాన కార్యదర్శి పి వహీద్ ఖాన్ ,గౌరవ అద్యక్షులు కందికొండ మోహన్,నీరటి బాలిశ్వర్, ఇద్రీస్ ,గౌస్ పాష, విజయకాంత్, దేవదానం, గడ్డంపల్లి భూపాల్ రెడ్డి, దేవరపాక ప్రభాకర్,జక్కా గోపాల్ ,దేవరపాగ కృష్ణయ్య ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.



## పోరాటాల ఫలితమే స్వేచ్ఛ స్వాతంత్ర్యం

### బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బంగ్లా లక్ష్మీకాంత్ రెడ్డి

మక్తల్ ఆగస్టు 11 (జనంసాక్షి)

పోరాటాల ఫలితమే స్వేచ్ఛ స్వాతంత్ర్యమని బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బంగ్లా లక్ష్మీకాంత్ రెడ్డి అన్నారు. నర్వ మండలంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బంగ్లా లక్ష్మి కాంత్ రెడ్డి ఆధ్వర్యంలో హర్-ఘర్-తిరంగా కార్యక్రమం నిర్వహించారు. అందులో బాగంగా ఆదివారం స్వాతంత్ర సమరయోధుల విగ్రహాలను శుభ్రపరచి పూల మాలలతో ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్వాతంత్ర సమరయోధులు చేసిన పోరాటాల ఫలితంగా నేడు మనము అనుభవిస్తున్న స్వేచ్ఛ స్వాతంత్ర్యని అన్నారు. రిటైర్డు ఆర్మీ సైనికులకు వారి త్యాగాలకు గుర్తుగా పాతర్చేడ్ గ్రామానికి చెందిన ఆర్మీ హన్మంతు, నర్వ గ్రామానికి చెందిన ఆర్మీ చెన్నప్ప, ఆరె రఘుని శాలువాలు పూలమాలలతో సన్మానించారు. ఈ కార్యక్రమం లో పి ఎస్ సి ఎస్ మాజీ చైర్మన్ గవినోళ్ళ లక్ష్మారెడ్డి, నర్వ గ్రామ మాజీ సర్పంచ్ వేంకటేశ్వర్ రావు, బీజేపీ నర్వ మండల కన్వీనర్ కుర్వ సత్యం, బిజెవైఎం జిల్లా ఉపాధ్యక్షుడు వావిళ్ళ రవి కుమార్ రెడ్డి, ఎంయస్పి జిల్లా అధ్యక్షుడు గుడిసె వెంకటన్న, బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి వెంకటేష్, నరేందర్, విజయ్ రాం, అజిత్ తదితరులు పాల్గొన్నారు.

## ఆయిల్ పామ్ సాగుకు ప్రభుత్వాల చేయూత

### పెట్టుబడికి సాయం, పరికరాలకు సబ్సిడీ

వనపర్తి, ఆగస్టు 11 (జనంసాక్షి):



రైతులను సాంప్రదాయ పంటల సాగు నుంచి వాణిజ్య పంటల సాగు వైపు మరలించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకుంటున్నాయి. అంతేకాక మార్కెట్‌లో మంచి డిమాండ్ వున్న పంటలను సాగు చేయాలని రైతులకు సూచిస్తున్నాయి. దీనిలో భాగంగా పామాయిల్‌కు ఉన్న డిమాండ్ గుర్తించిన ప్రభుత్వం. ఆయిల్ పామ్ సాగు దిశగా రైతులను ప్రోత్సాహిస్తోంది. ఇందుకోసం పామ్ ఆయిల్ సాగుచేసే రైతులకు కేంద్రంతో పాటు తెలంగాణ ప్రభుత్వం భారీగా సబ్సిడీలు అందిస్తోందని వనపర్తి జిల్లా వ్యవసాయాధికారి, మైక్రో ఇరిగేషన్ అధికారులు వెల్లడించారు. ఆయిల్ పామ్ తోటల పెంపకం పట్ల రైతులకు అవగాహనా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, పలు ప్రాంతాల్లో సాగు చేస్తున్న వ్యవసాయ క్షేత్రాలకు తీసుకెళ్ళిఆయిల్ పామ్ చెట్ల పెంపకాన్ని ప్రత్యక్షంగా చూపిస్తున్నామని అధికారులు తెలిపారు.

#### ఎకరాకు రూ.50 వేలకు పైగా సబ్సిడీ

ఒక ఎకరా ఆయిల్ పామ్ సాగుకు 50-57 మొక్కలు అవసరం అవుతాయి. ఇందుకోసం రూ.11,600 ఖర్చు అవుతుంది. ఈ మొత్తాన్ని ప్రభుత్వమే భరిస్తుంది. మొక్కలు నాటిన నాలుగేళ్లకు పంట దిగుబడి వస్తుంది. అప్పటివరకు రైతులు ఆర్థిక ఇబ్బందులు పడకుండా ఉండేలా చూడటం కోసం ప్రభుత్వం పంట నిర్వహణకై ఏడాదికి రూ.4,200 ఆర్థికసాయం చేస్తుంది. ఇలా నాలుగేళ్లకు రూ.16,800 అందజేస్తుంది. డ్రిప్ కోసం ఎకరాకు 22,518 రూపాయలు సబ్సిడీ అందిస్తోంది. ఇలా మొత్తంగా ఆయిల్ పామ్ సాగుచేసే రైతులకు నాలుగేళ్లకు గాను ఎకరాకు రూ.50,000 పైగా సబ్సిడీ పొందవచ్చు.ఆయిల్ ఫామ్ సాగుతో 30ఏళ్ల వరకు నిరంతరం ఆదాయం పొందవచ్చు. ప్రస్తుతం మార్కెట్‌లో ఆయిల్ ఫామ్ ధరలను బట్టి ఎకరాకు రెండు లక్షల వరకు ఆదాయం లభిస్తుంది. ఈ పంటకు పెద్దగా నీటి అవసరం లేదు.. కాబట్టి నీటిఎద్దడి ఉన్న ప్రాంతాల్లో కూడా సాగు చేయవచ్చు.ఆయిల్ పాము సాగు చేయాలనుకునే రైతులకు ప్రభుత్వమే మొక్కలను ఉచితంగా అందిస్తోంది. అలాగే ఎస్సీ, ఎస్టీ రైతులకు ఉచితంగా, బీసీలకు 90 శాతం సబ్సిడీపై బిందుసేద్యం పరికరాలను కూడా అందజేస్తుంది.

#### సబ్సిడీ కోసం దరఖాస్తు విధానం

పామ్ ఆయిల్ సాగు చేయాలనుకునే రైతులు ముందుగా ఈ సమాచారాన్ని వ్యవసాయ అధికారులకు తెలియజేయాల్సి వుంటుంది. సబ్సిడి కోసం మొబైల్ లోనే దరఖాస్తు చేసుకోవచ్చు. గూగుల్‌లో ఎంఐపీ రిజిస్ట్రేషన్ అని టైప్ చేయగానే తెలంగాణ ప్రభుత్వ పోర్టల్ కనిపిస్తుంది. దానిపై క్లిక్ చేయగానే రిజిస్ట్రేషన్‌కు సంబంధించిన పేజీ ఓపెన్ అవుతుంది. ఇక్కడకు వెళ్లి రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. ఇందుకోసం ఆధార్, భూమి పాస్ బుక్, క్యాస్ట్ సర్టిఫికెట్ సబ్మిట్ చేయాలి. ఆ తర్వాత అధికారులు రైతులు ఇచ్చిన వివరాలను ధ్రువీకరించి సబ్సీడీ అందజేస్తారు.

## రైతుల ప్రయోజనాల దృష్ట్యా కాలువల్లోకి నీటిని విడుదల చేయాలి

### ఇరిగేషన్ అధికారులను కోరిన మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు

సిద్ధిపేట ప్రతినిధి ఆగష్టు 11 జనం సాక్షి)

సిద్ధిపేట ఇరిగేషన్ ఎస్ఈ బస్వరాజ్, ఈఈ గోపాల కృష్ణతో హరీష్ రావు ఆదివారం ఉదయం ఫోన్‌లో మాట్లాడుతూ సిద్దిపేట నియోజకవర్గంలోని రంగనాయక సాగర్‌లో ఇటీవల మిడ్ మానేరు ద్వారా నీటి పంపింగ్ జరిగింది. రిజర్వాయర్ లోని నీటిని కాలువలకు వదిలేందుకు ప్రణాళికలు సిద్ధం చేసి నీటిని విడుదల చేయాలనీ మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు ఇరిగేషన్ అధికారులను కోరారు. ప్రస్తుతం రంగనాయక సాగర్‌లో 2,3 టిఎంసీ నీరు ఉంది. 3టి ఎంసిల పూర్తి సామర్థ్యం నీటిని నింపాలని అలాగే రిజర్వాయర్‌ల నుండి కాలువలకు నీటిని విడుదల చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని కోరారు. అదేవిదంగా కెనాల్స్‌లలో మట్టి, పిచ్చి గడ్డి తుంగ పెరుక పోయిందని వెంటనే తొలగించాలని, త్వరితగతిన కాలువల్లోకి నీటిని విడుదల చేసి రైతంగానికి పంటల సాగుకు నీరందించాలని అధికారులను కోరారు.

## పల్లె పాలన పడకేయించారు

### బిజెపి జిల్లా లీగల్ సెల్ కన్వీనర్ నందు

నారాయణపేట జిల్లా బ్యూరో(జనం సాక్షి):

ప్రభుత్వం పల్లె పాలన ను గాలికొదిలి ప్రగతిని పడకేయించారని నారాయణపేట జిల్లా బిజెపి లీగల్ సెల్ కన్వీనర్ నందు నామాజీ ఒక ప్రకటనలో విమర్శించారు.ఆకాశంలో మేడలు కడుతూ ప్రజలను మభ్యపెదుతున్నదని పేర్కొన్నారు.పల్లెల్లో ప్రజా ప్రతినిదుల్ పాల ముగిసి 9 నెలలు గడుస్తన్నా పంచాయితీ ఎన్నికలు నిర్వహించక పోవడం శోచనీయమని అన్నారు. ఇంచార్జిలు,అధికారుల పాలనలో ప్రజలు అనేక సమస్యలతో సతమతం అవుతున్నారనీ అన్నారు.గ్రామాల్లో కురుస్తున్న వర్షాలకు పారిశుద్ధ్యం లోపించి దోమలు పెరిగిపోయి ప్రజలు వివిధ వ్యాధుల బారిన పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.ప్రజలను పట్టించుకునే నాథుడు కరువయ్యాడనీ విమర్శించారు. గ్రామాల్లో లోపించిన పారిశుద్ధ్యం, విధి దీపాలు, తాగునీటి సమస్యలు పరిష్కరించి ప్రజల ఇబ్బందులు తీర్చాలన్నారు. ప్రజలకు ప్రజా ప్రతినిదుల పాలన అందించేందుకు వెంటనే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు.

## నేడు పేటకు చేరుకోనున్న రాజీవ్ గాంధీ సద్భావన యాత్ర

నారాయణపేట జిల్లా బ్యూరో(జనం సాక్షి):

రాజీవ్ గాంధీ 33వ జ్యోతి సద్భావన యాత్ర ఈ నెల 12న నారాయణపేట చేరుకుంటుందని మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ఆర్ .సదాశివ రెడ్డి తెలిపారు. రాయచూర్‌లో మొదలై సద్భావన యాత్ర మక్తల్ మీదుగా నారాయణపేట మండలం సింగారం చౌరస్తా దగ్గర నారాయణపేట నియోజకవర్గంలోకి ప్రవేశిస్తుందన్నారు..సింగారం నుంచి జలాల్ పూర్ మీదుగా కర్ణాటక రాష్ట్రంలోకి ప్రవేశిస్తుందనీ తెలిపారు.ఈ ర్యాలీలో ఎమ్మెల్యే చిట్టెం పర్ణిక రెడ్డి, మాజీ డిసిసి అధ్యక్షులు కుంభం శివకుమార్ రెడ్డి పాల్గొంటారని తెలిపారు. ఈ సందర్భంగా నిర్వహించే మోటార్ సైకిల్ ర్యాలీ లో ప్రతి మండలం నుంచి భారీ ఎత్తున కార్యకర్తలు పాల్గొనీ విజయవంతం చేయాలని కోరారు.



# మహిళా స్వరాజ్యం

సోమవారం
12.08.2024

జనంసాక్షి
www.janamsakshi.org



# అడుగడుగునా తిరుగుబాటు

– గీతా రామస్వామి



మా తల్లిదండ్రులు మృదు స్వభావులు. వాళ్లెన్నడూ మాపై చెయ్యెత్తింది లేదు, పల్లెత్తు మాటన్నది లేదు. ఇతరుల పట్ల.. ఇరుగుపొరుగు కావొచ్చు, ఇతర కులాలకు చెందిన పనివారు కావొచ్చు.. ఎవరి పట్లా వాళ్లు తెలిసి నిర్దయగా ప్రవర్తించింది లేదు. అయితే బ్రాహ్మణులుగా తాము ఇతరులందరికంటే అధికులమన్న భావన మాత్రం వారిలో ఉండేది.మా ఇంట్లో మడీ మైల నియమాలన్నీ చాలా కఠినంగా పాటించే వాళ్లు. బయట తిననిచ్చే వాళ్లు కాదు. తినే పదార్థాలు వేటినీ ఎడమ చేత్తో ముట్టకూడదు‘ వడ్డించేప్పుడు కూడా. ఇక వండిన గిన్నెలు, పదార్థాల్లాంటివి ముట్టుకుంటే.. వెంటనే ఆ చేత్తో నెయ్యి, పెరుగు వంటి కొన్ని పదార్థాలను తాకటం నిషిద్ధం. చాలాకాలం మా ఇంట్లో ఉల్లిపాయలనేవే వుండేవి కావు. ఇక వెల్లుల్లినైతే నేను కాలేజీలో అడుగుపెట్టేంత వరకూ చూడను కూడా లేదు. పనిమనుషుల్ని ఇంట్లో అడుగుపెట్టనిచ్చేవాళ్లు కాదు. గిన్నెలు కడగటం, బట్టలు ఉతకడం లాంటి పనులన్నీ వాళ్లు ఇంటి బయట వున్న నల్లా దగ్గరే చేయాలి. ఇక ఇంటి లోపలి పనులన్నీ అమ్మా, మేమే చేసుకునేవాళ్లం. అయితే నాన్నకు తరచూ బదిలీలు అవుతూ చాలాకాలం తమిళనాడుకు వెలుపలే గడిపాం కాబట్టి ఈ కఠినమైన నియమాల్లో మేం కొన్నింటినైనా తప్పించుకోగలిగామనే చెప్పాలి. ఎక్కడకు వెళ్లినా మేం బ్రాహ్మలు మాత్రమే ఉండే అగ్రహారాల్లో కాకుండా అందరి మధ్యా, ‘సెక్యులర్’ ఇళ్లలోనే ఉండేవాళ్లం కాబట్టి ఇరుగు పొరుగున ఇతర కులాలవారూ వుండేవారు. బాగా చిన్నతనం అంటే నాకు బొంబాయే గుర్తుకొస్తుంది. అక్కడ మేం ఫ్లోరా ఫౌంటెన్ ఎదురుగా, పెద్ద ‘పి అండ్ టి’ బిల్డింగ్‌లో వుండేవాళ్లం. (అదిప్పుడు లేదు, కూల్చేశారు). మా ఇల్లు నాలుగో అంతస్తులో వుంటే, నాన్న ఆఫీసు రెండో అంతస్తులో వుండేది. చెక్క మెట్లు. వాటి మీద పైకీ, కిందకీ పరుగుపెడుతుంటే వచ్చే చప్పుడు మాకు చాలా ఇష్టం. నా స్కూలు జీవితం అక్కడి జీసెస్ అండ్ మేరీ కాన్వెంట్‌తో మొదలైంది. అక్కడి నుంచి మద్రాస్‌కు తిరిగొచ్చాక మమ్మల్నందర్నీ శాంథోమ్‌లోని రోజరీ మెట్రిక్యులేషన్ స్కూల్లో చేర్పించారు. అప్పటికి నేను నాలుగో తరగతికి వచ్చాను. అక్కడ నాకు జెస్సీ డిసౌజా, మేరీ యాన్, షాలినీ కురుప్, హష్మి, శీలా రాణి మంచి స్నేహితులయ్యారు. అలా నాకు తొమ్మిదేళ్లప్పటి నుంచి పదిహేనేళ్లు వచ్చే వరకూ కూడా మేం మద్రాసులోనే వున్నాం.పదేళ్లున్నప్పుడు అనుకుంటా.. నాకు మొదటిసారి బ్రాహ్మణ స్త్రీలు ఎదుర్కొంటుండే వివక్ష, దాని పట్ల వాళ్ల మనసుల్లో పేరుకుపోయిన తీవ్రమైన నిరసనల గురించి తెలిసింది. అమ్మ మాకు తరచుగా‘ తిరువనంతపురంలో వాళ్ల అన్నయ్య తనని బడికి వెళ్లనీయకుండా ఎలా అడ్డుపడ్డాడో చెబుతుండేది. ఆయన తనకున్న ఒకే ఒక్క మంచి బట్టల జతని చించేసి స్కూలుకు పోనివ్వకుండా చేశాడని చాలా యాష్టపడేది. బహుశా తను ఆ విషయాన్ని తరచూ చెప్పటం వెనక ఆంతర్యం‘ ఆనాడు తనకు నిరాకరించిన అవకాశం ఇప్పుడు మాకు దక్కుతోందనీ, మా కాళ్ల మీద మేం బలంగా నిలబడాలని ప్రత్యేకంగా గుర్తు చేయటమే కావొచ్చు. స్త్రీగా బతకటమంటే కష్టాల కొలిమిలో ఉండటమేననీ, ఆ కష్టాలను కొంతైనా తప్పించుకోవాలంటే చదువు ఒక్కటే మార్గం అని మా మనసుల్లో బాగా నాటుకుపోయేలా చేసిందామె. తను చెబుతున్న విషయాలు చిన్నపిల్లగా నా మనసు మీద ఎంతటి బలమైన ముద్ర వేస్తున్నాయో ఆమెకు తెలీదు. ఆమె కథను నేను మళ్లీమళ్లీ చెప్పించుకుని ఆసక్తిగా వినేదాన్ని. చిన్నపిల్లగా అమ్మ పడిన ఆ కష్టాలు నన్ను చాలా కలచివేసేవి, నేనెప్పుడూ అలాంటి పరిస్థితుల్లో చిక్కుకోకూడదని గట్టిగా అనుకునేదాన్ని. ఒక విధంగా అమ్మే నాకు తెలిసిన మొట్టమొదటి ఫెమినిస్టు!అయితే మమ్మల్ని పెంచిన తీరు చాలా విషయాల్లో పరస్పర విరుద్ధంగా వుండేది. ఒకవైపు ఇంట్లో తిండి, మడీ, మైల, బట్టలు, ప్రవర్తన, సంస్కృతి వంటి విషయాల్లో కఠినమైన సాంప్రదాయిక కట్టుబాట్లు పాటించేవారు. మరోవైపు మమ్మల్ని ఇంగ్లీష్ స్కూళ్లకు పంపించేవారు, చిత్రంగా పాశ్చాత్య తరహా ఆసక్తులు, అభిరుచులవైపు బలంగా ప్రోత్సహిస్తుండేవాళ్లు కూడా. ఇంగ్లిష్ సినిమాలు చూడమని, ఇంగ్లిష్ పుస్తకాలు చదవమని, ఇంగ్లిష్ పాటలు వినమని చెప్పేవాళ్లు. బహుశా, అవి మా చదువులకూ, ఉద్యోగ భవిష్యత్తుకూ తోడ్పడతాయన్నది వారి ఉద్దేశం కావచ్చు. అలాగే మా క్రైస్తవ స్నేహితురాళ్లని ఇంట్లోకి రానిచ్చే వాళ్లు. మేం వాళ్ల ఇళ్లకు వెళ్లేందుకు అనుమతించేవారు. మా అక్కచెల్లెళ్లు ఐదుగురికీ కర్ణాటక సంగీతం నేర్పించారు. రోజూ ఉదయం ఐదు గంటలకు మేం ఎమ్మెస్ సుబ్బులక్ష్మి వెంకటేశ్వర సుప్రభాతం వింటూనే నిద్ర లేచేవాళ్లం. ప్రతి సంవత్సరం మద్రాసులో డిసెంబరు‘జనవరి నెలల్లో ఉత్సాహభరితంగా జరిగే మార్గళి (మార్గశిర) సంగీత కచేరీలకు మా అందరినీ తీసుకెళ్లేవారు.నేను నాలుగేళ్ల వయసు నుంచే కథల పుస్తకాలు చదవటం మొదలుపెట్టాను. చదవడానికి ఇంట్లో ఏమీ దొరకనప్పుడు చివరికి టెలిఫోన్ డైరెక్టరీ, అట్లాస్, రైల్వే టైంటేబుల్ వంటి వాటిని కూడా వదిలిపెట్టే దాన్ని కాదు. పైగా వాటిని గంటల తరబడి ఇష్టంగా తిరగేసేదాన్ని. అవి నా చుట్టూ వున్న వాస్తవ పరిస్థితులకు దూరంగా ఎక్కడో ఊహాలోకంలోకి తీసుకెళ్లేవి. వాటిలో కనిపించే చిత్ర విచిత్రమైన కొత్తకొత్త పేర్లు, ఎక్కడో సుదూర ప్రాంతాలు, నదులూ, పర్వత సానువుల చుట్టూ కథలుకథలుగా నా ఊహా విహారం ఆరంభమయ్యేది. ఇంట్లో కూర్చునే అద్భుతమైన రైలు ప్రయాణాల్లో దేశమంతా చుట్టిరావటం పూర్తయిపోయేది. నేనొక నిరంతర పాఠకురాలిని. చేతిలో పుస్తకం లేకపోతే మనసును ఆందోళన ముప్పిరిగొనేది. ఈనిడ్ బ్లైటన్ మొదలుకుని రిచ్మల్ క్రాంప్టన్ రాసిన విలియం బుక్స్ సిరీస్ మొత్తం, ఆ తర్వాత ఎ.ఎ.మిల్నే, సి.ఎస్.లూయిస్‌ల రమణీయమైన పుస్తకాలన్నీ చదివేశాను. టాల్‌స్టాయ్, డాఫ్నె డు మారియర్, చార్ల్స్ డికెన్స్, జేన్ ఆస్టిన్, సోమర్‌సెట్ మామ్, థామస్ హార్డీ వంటి వారిని చదువుకుంటూ టీనేజీలోకి అడుగుపెట్టాను. వీరిలో చాలామంది రచనలు తర్వాత మా పాఠ్యపుస్తకాల్లోనూ తారసపడేవి. చదవటమన్నది నా ప్రపంచాన్ని విస్తరించింది. ముఖ్యంగా కొత్త అవకాశాలు, వినూత్న ఆలోచనల గురించి మా కుటుంబం నాకు అందించలేకపోయిన అవగాహనను ఈ పుస్తకాలే సమకూర్చి పెట్టాయి. మరికాస్త పరిశీలనాత్మకమైన రచనలను.. అంటే హెమింగ్వే, స్టైన్ బెక్, అలాగే నాన్‌ఫిక్షన్‌లో ఇ.హెచ్.కార్, గార్డన్ చైల్డ్ వంటి వారి పుస్తకాలను చదవటమన్నది కాలేజీలో చేరిన తర్వాతగానీ మొదలవలేదు. ప్రతి దానికీ విశ్లేషణాత్మక వివరణలుండే ఒక హేతుబద్ధమైన,ఉదార ప్రపంచాన్ని నాకు పుస్తకాలే పరిచయం చేశాయి.యుక్తవయసు తొలినాళ్లలో సరికొత్త పద్ధతిలో ఆలోచించడం నేర్పింది సైన్స్! సంప్రదాయాలనీ, మూఢనమ్మకాలనీ ప్రశ్నించడం మొదలుపెట్టిన ఆ సమయంలో నాకు జీవ శాస్త్రం, భౌతిక శాస్త్రాలు గొప్ప సాంత్వననీ, కొత్త సమర్థనలనీ యిచ్చాయి. ఓ నిశ్శబ్ద తిరుగుబాటుకు, ఆ సమయంలో నేను కాస్త గట్టిగా నిలదొక్కుకునేందుకు సైన్స్ ఓ బలమైన పునాదినిచ్చింది. ఆ రోజుల్లో స్కూల్లో మా మీద బలమైన ప్రభావం చూపిన సైన్స్ టీచర్లు ఎవరూ ఉన్నట్లు గుర్తు లేదుగానీ పాఠ్యపుస్తకాలే ఎంతో విప్లవాత్మకంగా వుండేవి. జీవశాస్త్ర పాఠాల్లో‘ మన శరీర నిర్మాణంతో పాటు రుతుక్రమం లేదా బహిష్టు అంటే ఏమిటో స్పష్టమైన వివరణలున్నాయి. బహిష్టు అనేది బిడ్డ పుట్టుకతో ముడిపడిన ప్రకృతి సహజమైన జీవ ప్రక్రియ అని నేను పాఠ్యపుస్తకాల ద్వారానే తెలుసుకున్నాను. ఆహార పదార్థాలు కుళ్లి పాడైపోతున్నాయంటే అది వాటిలో ఉండే సూక్ష్మక్రిముల వల్లనే తప్ప బహిష్టయిన స్త్రీ ముట్టుకున్నందువల్ల కాదని అర్థం చేసుకున్నాను. గర్భధారణ, బిడ్డ పుట్టుక అనేవి స్త్రీ పురుషుల లైంగిక కలయిక వల్ల జరుగుతాయిగానీ.. ఒక స్త్రీ మరో పురుషుడితో మాట్లాడినంత మాత్రాన కాదని తెలుసుకున్నాను. అలాగే భూ పరిభ్రమణం, సూర్యుడి ప్రకాశం, వరదలు ముంచెత్తటం వంటివి ప్రకృతి సహజ పరిణామాల వల్ల సంభవిస్తున్నాయే తప్ప ఏవో రాతి విగ్రహాల మహత్యం వల్ల కాదని గ్రహించాను. ప్రకృతికి సంబంధించిన ఈ విజ్ఞానమంతా కూడా నా సామాజిక జీవనంతో సంబంధం ఉన్నదేనన్న విషయాన్ని స్పష్టంగా గుర్తించాను. ఇక భౌతికశాస్త్ర పాఠ్యపుస్తకాలు‘ మహిమలూ, మాయల మంత్రాల భావనలను పక్కకునెట్టి అసలు ఈ భౌతిక ప్రపంచం ఏ సూత్రాలపై ఆధారపడి నడుస్తోందో వివరించాయి. చరిత్ర పుస్తకాలు ఐరోపాలో విజ్ఞాన వికాసం, జ్ఞానాభివృద్ధి పలా జరిగిందో, అందుకు జరిగిన పెను యుద్ధాలేమిటో కళ్లకు కట్టాయి. అంటే ప్రజలు గతంలో కూడా ఇలాంటి యుద్ధాలు చేశారు, గెలిచారన్న మాట! మానసికంగా నాకు పెద్ద సాంత్వననిచ్చిన అంశం అది.చాలా విషయాలను తర్కబద్ధంగా వివరించవచ్చనీ, ఏవో అభూతమైన వాటి గురించి భయపడాల్సిన పని లేదని తెలుసుకోవటం నాకు గొప్ప ఆశ్చర్యాన్ని కలిగించింది. నా శరీరంలో రకరకాల మార్పులు చోటుచేసుకుంటూ, సరిగ్గా నేను ఇంట్లో ‘మడీ‘మైల’ పేరుతో రకరకాల బ్రాహ్మణీయ విధి నిషేధాలను ఎదుర్కోవాల్సి వస్తున్న సమయంలోనే.. స్కూల్లో సైన్స్‌తో పరిచయం పెరగటం ఆరంభమైంది. నాలో పొంగుకొస్తున్న హేతుబద్ధ, ఉద్వేగభరిత భావనలన్నీ కలగలిసిపోయి.. ఇంట్లో పాటించే మూఢనమ్మకాలపై బలంగా విరుచుకుపడటం, కొద్దికొద్దిగా తిరగబడటం మొదలైంది. నాకు బహిష్టు అంటే ఏమిటో తెలియని రోజుల్లోనే నేను రజస్వల అయ్యాను. మా కుటుంబం బహిష్టు నిషేధాలన్నింటినీ తూచా తప్పకుండా పాటించేది. మా అక్కయ్యలు బహిష్టు అయినప్పుడు దూరంగా కూర్చునేవాళ్లు. ఇంట్లో ఏవీ ముట్టుకోకూడదు. వేరే గదుల్లోకి వెళ్లకూడదు. అన్నం కూడా దూరంగా ఓ మూలగా పెట్టేవారు. వాళ్లు అందరికీ దూరంగా పడుకునేవారు. మూడో రోజు తర్వాత వాళ్లకు స్నానం చేయించటం, వాళ్లు ముట్టుకున్న ప్రతి వస్తువునూ శుద్ధి చెయ్యటం.. అదంతా పెద్ద ప్రహసనం! ఇతరత్రా పనికిమాలిన ఆచారాల్లా ఇది కూడా అర్థంపర్థం లేనిదేనని నేను కొట్టిపారేస్తుండే దాన్ని. నాకు పదమూడేళ్ల వయసున్నప్పుడు ఓ రోజు స్కూల్లో.. నా యూనిఫాం వెనకాల రక్తం మరక వుందంటూ స్నేహితురాళ్లు ముసిముసిగా నవ్వటం మొదలుపెట్టారు. ‘నేను ఎక్కడ కూర్చున్నానబ్బా.. మరక అంటుకోవటానికి.. ‘ అనుకుంటూ అదేమీ పట్టనట్టే నేను హాయిగా గ్రౌండ్‌లో ఆడుకుంటూ వుండిపోయాను. ఇంతలో ఎవరో వెళ్లి మా పెద్దక్కకి ఈ విషయం చెప్పారు. ఆమె పరుగుత్తుకుంటూ వచ్చి, గుసగుసలాడుతున్నట్టు గొంతు బాగా తగ్గించి ‘పదా.. ఇంటికి వెళ్దాం!’ అంది. చూస్తుంటే అక్క బాగా కలవరపడిపోతున్నట్లుంది. నేనేమో తాపీగా ‘ఎందుకేమిటి?’ అనడిగాను. వణికిపోతున్న గొంతుతో ‘వెంటనే వెళ్లాలి, పద’ అంది నా చెవిలో. ఇక మేం ఇల్లు చేరగానే ఆమె ఏడుపు ఆపుకోలేకపోయింది. ‘ఇది యూనిఫాం మీద రక్తం మరకతో అందరి ముందూ తిరిగింది. స్కూల్లో అందరికీ తెలిసిపోయింది’ అంటూ బోరుమంది. ‘అయితే ఏంటే! మీది ఆడపిల్లల స్కూలే కదా. అందరికీ పీరియడ్స్ వస్తూనే వుంటాయి కదా!’ అంది అమ్మ. ‘కానీ వీటి గురించి ఎవరికీ తెలియకూడదు. ఎవ్వరూ ఇలా చెయ్యరు. నేనింక స్కూల్‌కి వెళ్లలేను..’ అంటూ అక్క అవమానభారంతో కుంగిపోతున్న దానిలా వెక్కిళ్లు పెట్టి మరీ ఏడ్వటం మొదలుపెట్టింది. బహిష్టులు నాకేం పెద్ద చికాకు కలిగించలేదుకానీ.. కొత్తగా మొదలైన ఈ ఆంక్షలు మాత్రం చిర్రెత్తించాయి. నేను నెలసరి పీరియడ్స్ గురించి చదివాను, అవెందుకు వస్తాయో శాస్త్రీయంగా అర్థం చేసుకున్నాను. దీని గురించి మా క్లాసులో మిగతా పిల్లల దగ్గర ప్రస్తావించినప్పుడు బ్రాహ్మణేతర ఇళ్లల్లో దీన్నో పండగలా చేస్తారని తెలిసింది! తమ బిడ్డ పెద్దదయ్యిందని వాళ్ల తల్లిదండ్రులు సంతోషంగా, గర్వపడతారట. ఇక్కడేమో మా అక్కయ్య ‘అందరికీ తెలిసిపోయిందని’ తెగ బాధపడిపోతోంది. ఇక అమ్మకేమో.. పెళ్లి చేసి పంపాల్సిన పిల్లల జాబితాలో మరో కూతురూ చేరిందని కొత్త దిగులు మొదలైంది.

మా ఇంట్లో మొత్తం ఆరుగురం ఆడవాళ్లం. నెలసరి వచ్చినప్పుడల్లా ఒక్కొక్కరూ మూడేసి రోజుల చొప్పున దూరంగా కూర్చోవాలి. అయితే మమ్మల్ని విడిగా వుంచేందుకు‘ తిరువనంతపురంలో, హరిపాడ్‌లో మా పూర్వీకుల ఇళ్లల్లో వున్నట్టు బొంబాయిలో గానీ, మద్రాస్‌లో గానీ ప్రత్యేక గదులూ, ఔట్‌హౌస్‌ల్లాంటివేం ఉండేవి కాదు. అయినా నెలసరి రోజుల్లో మేం ఇంట్లో ఒక్కటంటే ఒక్క వస్తువును కూడా ముట్టుకోకుండా మూలనే ఉండిపోయేవాళ్లం. పొరపాట్న ఏ పచ్చడినో, కూరనో తాకామంటే అది మైలపడిపోయిందని, దాన్ని పారెయ్యాల్సిందేనని భావించేవాళ్లు. బహిష్టు రోజుల్లో మేం పూజగదిలో కాలు పెడితే కళ్లు పోతాయని చెప్పేవాళ్లు. కానీ నేను మాత్రం తెలిసీతెలియని ఆ నవయవ్వనోత్సాహంలో వద్దన్న పనులన్నీ చేసేదాన్ని. కావాలని పచ్చళ్లనూ, కూరలనూ ముట్టుకుని.. భోజనంచేసే సమయానికి అవేమైనా పాడైపోయాయా అని చూసేదాన్ని. పూజ గదిలోకి వెళ్లి దేవుళ్ల విగ్రహాలను తాకి.. నా కళ్లకేమైనా అవుతోందా, గుడ్డిదాన్నైపోతున్నానా అని కొద్ది రోజుల పాటు పరీక్షించుకునేదాన్ని. కానీ ఎప్పుడూ అలాంటివేం జరగలేదు. మూడు రోజులు పూర్తవగానే మా బట్టలు, దుప్పట్ల వంటివన్నీ తడిపి ఉతికేసేవారు. మేం తలస్నానం చేసేవాళ్లం. దాంతో సంప్రదాయబద్ధంగా మా మైల ముగిసిపోయేది. కానీ ఒక్కోసారి మాకు ఐదు రోజులపాటు రుతుస్రావం అవుతూనే వుండేది. నిజానికి అదే నేనీ చాదస్తాన్ని తీవ్రంగా వ్యతిరేకించేలా చేసింది. ‘అమ్మా నా కింకా రక్తస్రావం అవుతూనేవుంది. మరి మైల తొలగిపోయి, నేను పరిశుద్ధం ఎలా అవుతాను?’ అని అడిగేదాన్ని. వెంటనే అమ్మ ‘ష్ ష్.. మాట్లాడకు. ఆచార ప్రకారం మూడు రోజులూ అయిపోయాయి’ అనేది. ‘దీనర్థం మన ఆచారాల్లో నిజం లేదనే కదా అమ్మా’ అంటే ‘ఇది మన సంప్రదాయం, అంతే’ అని నోరు మూయించేది. నాకు ఆ సమాధానం ఏ కోశానా సంతృప్తినిచ్చేది కాదు. బ్రాహ్మణీయ ఆచారాలు, సంప్రదాయాలతో నా గొడవ ఇక్కడి నుంచే మొదలైంది. బహిష్టు సమయంలో ముట్టుకున్నప్పటికీ ‘దేవుడు నన్ను గుడ్డిదాన్ని చేయలేదంటే కచ్చితంగా దేవుడు లేనట్టే కదా?’ అనే దాన్ని. ప్రతి ఒక్క దాన్నీ ప్రశ్నించటం నేర్చుకున్నాను. తరచూ నేనిలాంటి ప్రశ్నలు వేస్తుంటే అమ్మ విసుక్కునేది, ‘నాకు తెలియదు. పెద్దవాళ్లు ఎందుకు చెప్పారో, ఏంటో.. పాటిస్తున్నాం..’ అనేది. దీనికి నేను ‘మరి నా పుస్తకాల్లో అలా రాసి ఉందేంటి’ అని ఎదురు ప్రశ్నించే దాన్ని.మేం కింద కూచుని భోజనాలు చేసేవాళ్లం. చాలా బ్రాహ్మణ ఇళ్లల్లో పళ్లెం చుట్టూ అవీఇవీ పోసినా చికాకుపడరు. చీకేసిన ములగకాయ ముక్కలు, కరివేపాకులు, మామిడి తొక్కలు, మిరపకాయల్లాంటివన్నీ పళ్లెం లేదా విస్తరాకు చుట్టూ పడేస్తుంటారు. వాటిని మా ఇంట్లో చేతులతో ఎత్తి, తర్వాత ఆ ప్రదేశమంతా బట్టతో తుడిచేవారు. అది చూస్తేనే నాకు చికాకుగా ఉండేది‘ ఆ ఎంగిలి చెత్తను చీపురుతో ఊడవొచ్చుగా? అందుకే నా వంతు వచ్చినప్పుడల్లా నేను చీపురు తీసుకుని ఊడ్వబోతుంటే.. చప్పున మా అక్కయ్యలు వచ్చి నా చేతుల్లోంచి చీపురు లాగేసుకుని ఆ పని వాళ్లు చేసేవారు. నాలా వాళ్లెప్పుడూ ఎదురు ప్రశ్నలు వేసే వాళ్లు కాదు.నాన్నతో పెద్దగా వాదించేదాన్ని కాదుగానీ? అమ్మను మాత్రం చాలా విషయాల్లో నా ప్రశ్నల పరంపరతో వేధించుకు తినేదాన్ని. నాన్న మరీ అంత కఠినంగా ఉండేవారేం కాదు, కాకపోతే ఆయనా పితృస్వామ్య వ్యవస్థలో భాగంగానే ప్రవర్తించేవారు. ఇంట్లో ఆయన చెప్పిందే వేదం, ఆయన అన్నదే ఫైనల్. నేను ఏదన్నా వాదిస్తుంటే అమ్మ.. పురాణ ఉదాహరణలో, ఇతర కుటుంబాల్లో జరిగిన భయంకర సంఘటనల గురించో చెప్పి నన్ను ఏదో రకంగా ఒప్పించటానికి తంటాలు పడుతుండేది. కానీ నాన్న మాత్రం చిన్నగా నవ్వుతూనే‘ శాసనం చేసేసేవాళ్లు. నేను ప్రతి విషయం మీదా వాదిస్తుంటే అమ్మ రోజులో చాలాసార్లు తల కొట్టుకుని.. దీన్నెవరో మార్చేశారంటూ మథన పడేది. “నువ్వసలు ఎవరి పిల్లవే?” అంటూండేది. ఇంట్లో మిగతా వాళ్లతో పోలిస్తే నేనేమో కొంచెం నల్లగా ఉండేదాన్ని. ఈ నల్ల పిల్లని పెళ్లి చేసుకోవటానికి ఎవరు ముందుకొస్తారే అని అమ్మ పైకే అంటూండేది. ఈ నస వినీవినీ నాలో నేను అసలు పెళ్లే చేసుకోకూడదన్న నిర్ణయానికి వచ్చేశాను. ఏదో రకంగా సర్దుకుపోవటం కంటే పెద్దయిన తర్వాత నా బతుకు నేను, వీలైతే ఇంతకంటే మెరుగ్గానే బతకాలనీ; సంప్రదాయికంగా అందంగా ఎర్రగా బుర్రగా కనబడేవాళ్లకు దూరంగా ఉండాలని నిర్ణయానికొచ్చాను.అమ్మతో తరచూ విభేదించిన అంశాల్లో లోదుస్తుల గొడవ ఒకటి. మేమందరం చేత్తో కుట్టిన బాడీలు, అండర్ పాంట్స్, వెస్ట్ వంటి లోదుస్తులనే ధరించేవాళ్లం. వీటిని ఇంట్లో మేమే కుట్టుకునేవాళ్లం. ఈ రకం బాడీలను.. ఆధునిక జాకెట్ల ఫ్యాషన్ వచ్చేంత వరకూ కూడా ఎక్కువగా గ్రామీణ ప్రాంత స్త్రీలు ధరిస్తుండే వాళ్లు. ఒకే గుడ్డ ముక్కతో కుట్టిన వీటిని రొమ్ముల కింద గట్టిగా ముడివేసుకోవాలి.ట్యూషన్లు చెప్పడం మొదలుపెట్టాను. బడికి బస్సులో కాకుండా నడిచి వెళ్లేదాన్ని. ఇతరులకు బట్టలు కూడా కుట్టేదాన్ని. అలా నా తిరుగుబాటు విజయవంతమైందో లేదో.. ఇంట్లో అక్కయ్యలందరూ కూడా బ్రాలు వేసుకోవడం మొదలుపెట్టారు. నానా కష్టాలూ పడి, నేను తిరుగుబాటు చేస్తున్నప్పుడు ఇంట్లో ఒక్కళ్లు కూడా నాకు మద్దతుగా నిలబడలేదు కానీ ఫలితాన్ని మాత్రం అంతా పంచుకున్నారు. తర్వాత్తర్వాత‘ మా అక్కల కాన్పుల కోసం 1970లలో అమెరికా వెళ్లి రావటం మొదలుపెట్టాక‘ అమ్మ కూడా ఆ పాతరకం బాడీలను వదిలేసి బ్రాసరీలు ధరించడం మొదలుపెట్టింది.ఆ యుక్త వయసులో తరచూ స్కూళ్లు మారటం నా ఆలోచనలను మరింత పదునుదేల్చింది. నేను కేవలం బాలికల కోసమే క్రైస్తవ నన్స్ నిర్వహించే, చాలా నిశ్శబ్దంగా నడిచిపోతుండే రోజరీ మెట్రిక్యులేషన్ స్కూల్ నుంచి.. మద్రాస్ రాయపేటలో

మిగతా రేపటి సంచికలో..



# కేంద్రమంత్రి బండిపై వ్యాఖ్యలు సరికాదు

- దద్దమ్మ ఎవరో.. దమ్మున్న నాయకుడు ఎవరో కరీంనగర్ ప్రజలకు తెలుసు
- బండి సంజయ్ కార్పొరేటర్ నుండి కేంద్రమంత్రి స్థాయికి ప్రజా ఆశీస్సులతో ఎదిగిండు
- ఆయన అభివృద్ధి కోసం, ప్రజల సమస్యల పరిష్కారం కోసం కొట్లాడే ఫైటర్
- రాజేందర్‌రావువ్యాఖ్యలపై బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు సింగిరెడ్డి కృష్ణారెడ్డి ఫైర్

**కరీంనగర్(జనంసాక్షి):** కరీంనగర్ జిల్లా పార్లమెంట్ సభ్యులు, కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ పై అభ్యంతరకర వ్యాఖ్యలు చేసిన కాంగ్రెస్ నాయకుడు వేలిచాల రాజేందర్ రావు తన వ్యాఖ్యలను వెనుకకు తీసుకోవాలని బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు సింగిరెడ్డి కృష్ణారెడ్డి డిమాండ్ చేశారు. మల్యాల మండల కేంద్రంలోని ఒక ఫంక్షన్ హాల్ లో బిజెపి మండల శాఖ అధ్యక్షుడు నేరెళ్ల శ్రవణ్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన బిజెపి ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో జరుగుతున్నటువంటి అభివృద్ధి పనుల పైన కనీస అవగాహన లేని కాంగ్రెస్ నాయకులు వెలిచాల రాజేందర్ రావు ఇప్పటికే పురోగతిలో ఉన్న పనులను కూడా మంజూరు చేయాలంటూ మాట్లాడడం విడ్డూరమన్నారు. మనోహరాబాద్ నుంచి సిద్దిపేటకు రైల్వే లైన్ పూర్తయి ప్యాసింజర్ , గూడ్స్ రైలు నడుస్తున్నాయని సిద్దిపేట నుంచి సిరిసిల్ల కరీంనగర్ వరకు ఉన్న 75 కిలోమీటర్ల రైల్వే లైన్ కు ఎర్త్ వర్క్ శరవేగంగా నడుస్తున్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం 250 ఎకరాల భూమి, రైల్వే పనులకు తన వాటా ధనాన్ని చెల్లించాల్సి ఉందని రాష్ట్ర ప్రభుత్వం భూమి ఇచ్చినట్లయితే 18 నెలల్లో సికింద్రాబాద్ నుంచి కరీంనగర్ కు రైలు కూత వేపిస్తామని ఆయన చాలెంజ్ చేశారు.కొండగట్టు పుణ్యక్షేత్రానికి ఇప్పటికే రైల్వే లైన్ ఉన్నదని జగిత్యాల నుంచి కొండగట్టు మీదుగా నాలుగు వరసల జాతీయ రహదారి కూడా మంజూరై భూసేకరణ , టెండర్లు జరుగుతున్న విషయం రాజేందర్ రావు కి తెలియకపోవడం శోచనీయమని ఆయన ఎద్దేవా చేశారు.60 సంవత్సరాలుగా దేశాన్ని, రాష్ట్రాన్ని పరిపాలించిన కాంగ్రెస్ పార్టీ నాయకులు తమ హయాంలో మనోహరాబాద్ కొత్తపల్లి రైల్వే లైన్ పూర్తి చేయలేదని, కొండగట్టుకు జాతీయ రహదారి నిర్మించ లేకపోయారని కాంగ్రెస్ పార్టీ 60 సంవత్సరాల్లో చేయలేని పనిని కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ ఆరు సంవత్సరాల్లో చేసి చూపించారని దద్దమ్మ ఎవరో దమ్మున్న నాయకుడు ఎవరో రాజేందర్ రావు ఆత్మ విమర్శ చేసుకోవాలన్నారు. 30 సంవత్సరాలుగా వరుసగా ప్రజాప్రతినిధిగా అర్బన్ బ్యాంక్ డైరెక్టర్ గా, కౌన్సిలర్ గా, కార్పొరేటర్ గా రెండుసార్లు, ఎంపీగా నిరంతరాయంగా గెలుస్తున్న బండి సంజయ్ కుమార్ దమ్మున్న నాయకుడని ఏ పార్టీకి గుర్తు పైన నిలబడ్డప్పటికీ ప్రతిసారి ఓడిపోయిన వ్యక్తి వెలిశాల రాజేందర్ రావు అని ఆయన దుయ్యబట్టారు. జూదశాలలు , పానశాలలు క్లబ్బులు, పబ్బులు నడిపిన రాజేందర్ రావు కి నియోజకవర్గ విషయాలపై కనీస అవగాహన లేదని రుజువు చేసుకున్నారని, 6000 కోట్లతో జగిత్యాల నుంచి ఖమ్మం వరకు జాతీయ రహదారి నెంబర్ 5 6 3, 6500 కోట్లతో రామగుండం ఎరువుల కర్మాగారం, 1100 కోట్ల విలువైన హసన్పర్తి కరీంనగర్ రైల్వే లైన్ నిర్మాణం కొరకు ఫైనల్ లొకేషన్స్ సర్వే కరీంనగర్ స్మార్ట్ సిటీ కోసం ఏటా 100 కోట్లు, వందల కోట్ల కేంద్ర ప్రభుత్వ నిధులతో ప్రధానమంత్రి సడక్ యోజన , మండల కేంద్రం నుంచి మండల కేంద్రానికి డబుల్ రోడ్ల నిర్మాణం కు నిధులు అత్యధికంగా మంజూరు చేయించిన ఘనత బండి సంజయ్ కుమార్ దని ఆయన ఈ సందర్భంగా గుర్తు చేశారు. నూతనంగా మాల్కజ్ గిరి నుంచి భద్రాద్రి రామయ్య పాదాల చెంతకు రైల్వే లైన్ మంజూరు చేపిస్తే ఉడుక్కొని బండి సంజయ్ కుమార్ పై ఆరోపణలు చేయడం తగదన్నారు. ఈ సమావేశంలో బిజెపి నాయకులు గుండె వెంకటేష్ , మల్యాల మండల బిజెపి నేతలు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఓసిపి.5లో పాత మిషనరీ తొలగించి కొత్త వాటిని తెప్పించండి

- బేస్ వర్క్ షాప్ కు షెడ్ నిర్మించి సౌకర్యాలు కల్పించాలి
- రక్షణ చర్యలు చేపట్టకుండా యాజమాన్యం బొగ్గు ఉత్పత్తి తీయాలనుకోవడం సరైంది కాదు
- సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ అధనపు ప్రధాన కార్యదర్శి మిర్యాల రంగయ్య



గోదావరిఖని,జనంసాక్షి: సింగరేణి లో రక్షణ చర్యలు చేపట్టకుండా యాజమాన్యం బొగ్గు ఉత్పత్తి చేయాలని ఆదేశాలు జారీ చేయడం సరైంది కాదని, దీని వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని, ప్రమాదాలు జరుగకుండా యాజమాన్యం మెరుగైన రక్షణ చర్యలు తీసుకోవాలని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటియుసి) అదనపు ప్రధాన కార్యదర్శి మిర్యాల రంగయ్య పేర్కొన్నారు. ఆదివారం సింగరేణి ఆర్జీ వన్ ఏరియా లోని ఓసిపి 5 లో జరిగిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ సింగరేణి లో గత మూడు సంవత్సరాలుగా రక్షణ పై యాజమాన్యం సమావేశం నిర్వహించకపోవడం వల్ల కార్మికులు పలు సమస్యలను ఎదుర్కొంటున్నారని ఆయన తెలిపారు. ఓసిపి 5 లో నడిచే మిషనరీ అంతా కాలం చెల్లిందని, తరచూ రిపేరులతో వాటిని నడిపె ఆపరేటర్లు బ్రేక్ డౌన్ వల్ల అనేక ఇబ్బందులు పడుతున్నారని, బొగ్గు ఉత్పత్తి కి నష్టం జరుగుతుందని ఆయన అన్నారు. పాత వాటి స్థానంలో కొత్త మిషనరీ తెప్పించాలని ఆయన డిమాండ్ చేశారు. ఓసిపి 5 లో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యల్ని యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం చేస్తామని ఆయన అన్నారు. ఏఐటియుసి ప్రాజెక్టు కార్యదర్శి గుర్రం ప్రభుదాస్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఏఐటియుసి ఆర్జీ వన్ బ్రాంచి కార్యదర్శి ఆరెల్లి పోషం, బ్రాంచి ఉపాధ్యక్షులు మాదన మహేష్, నాయకులు గండి ప్రసాద్, చంద తిరుపతి, రాయుడు శ్రీనివాస్, ఎ. రాజిరెడ్డి, సోమ నర్సయ్య, భక్తి శ్రీనివాస్ తో పాటు తదితరులు పాల్గొన్నారు.

# ఖనిలో సెంట్రల్ లైబ్రరీ ఏర్పాటు చేయాలి

**గోదావరిఖని, జనం సాక్షి:**
రామగుండం నగరపాలక సంస్థ పరిధిలోని 50 డివిజన్లో ప్రజలకు ఇబ్బందులు కలగకుండా అభివృద్ధి పనులు చేపట్టాలని..వర్షాకాలం కావడంతో రోగాల బారిన పడకుండా మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేయాల ని ఐక్య స్వచ్ఛంద సంఘాలు కోరారు. రామగుండం నియోజకవర్గం ఐక్య స్వచ్ఛంద సంస్థల వేదిక ఆధ్వర్యంలో మార్కండేయ కాలనీలోని పల్లెర్ల రమేష్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ముఖ్యఅతిథిగా ఐక్య స్వచ్ఛంద సంస్థల వేదిక అధ్యక్షులు మంచి కట్ల దయాకర్ గారు హాజరై మాట్లాడుతూ రామగుండం నగర పాలక సంస్థలు అనేకమైనటువంటి సమస్యలున్న ప్పటికీ అవి నెరవేర్చడంలో సంబంధించిన అధికారులు విఫలమవుతున్నారని వారు అన్నారు. రామగుండం నియోజకవర్గంలో అనేకమంది నిరుద్యోగులు వివిధ ఉద్యోగ ఉపాధి అవకాశాల కోసం కోచింగ్ సెంటర్లలో శిక్షణ తీసుకుంటున్నారు అందులో చాలామంది పేద మధ్యతరగతి కుటుంబాలకు చెందినవారు ఉన్నారు అప్పులు చేసి వివిధ ఉద్యోగాల కోసం పుస్తకాలతో కోచింగ్ సెంటర్లలో స్టీలు పడుతున్నారు. మన కార్పొరేషన్ పరిధిలోనే నిరుద్యోగుల కోసం మరియు విద్యార్థుల కోసం సెంట్రల్ లైబ్రరీ ఏర్పాటు చేయాలని కార్పొరేషన్ పరిధిలో ఉన్న ప్రతి ఒక్కరు తమ ఇంటి పన్ను లో లైబ్రరీ సెస్ కు ఎనిమిది శాతం పన్ను చెల్లిస్తున్నారని కావున దానిలో భాగంగా ఈ ప్రాంతంలో నిరుద్యోగుల కోసం సెంట్రల్ లైబ్రరీ ఏర్పాటు చేయాలని మద్దెల దినేష్ పేర్కొన్నారు.మద్దెల దినేష్ మాట్లాడుతూ అదేవిధంగా వర్షాకాలం రావడంతో 50 డివిజన్లో ఎక్కడి చెత్త అక్కడే పేర్కొని ప్రజలు నానా రకాలుగా ఇబ్బందులు పడుతున్నారని రోడ్లమీద గల్లీలలో పిల్లలు స్కూల్కు వెళ్తున్న, మహిళలు ఉద్యోగాలకు వెళ్తున్న, ఇతర పనుల మీద బయటికి వెళ్తే ఎక్కడ చూసినా కుక్కల బెడద ఉంటున్నప్పటికీ ప్రజలు బయటికి వెళ్దామంటే భయభ్రాంతులకు గురవుతున్నారని వాటిని నిర్మూలించాల్సిన అవసరం మున్సిపల్ కార్పొరేషన్ సంబంధించిన అధికారులపై ఉందన్నారు.అదేవిధంగా అన్ని డివిజన్లో రోడ్లు మొత్తం పూర్తిగా చెడిపోయి నడవనికే ఇబ్బందికరంగా ఉన్నదని అలాగే నూతన రోడ్లు వేయాలనిచెత్తాచెదారంతో నిండిపోయి పందులు స్వైర విహారం చేస్తున్న నగరపాలక సంస్థ పట్టించుకోకపోవడం బాధాకరమని గోలివాడ చంద్రకళ గారు ఆవేదన వ్యక్తం చేశారు.అదేవిధంగా వర్షాకాలం రావడంతో చిన్నాచితక పనులు చేసుకుంటున్న పూరి గుడిసెల్లో ఉంటున్న వారికి ప్రభుత్వం అండగా నిలవాల్సి ఉందని వారికి మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేయాలని వివిధ స్వచ్ఛంద సంస్థల నిర్వాహకులు పేర్కొన్నారు.ప్రభుత్వ పాఠశాలలు హాస్టల్లో శిథిలావస్థకు చేరుకొని అనేక రకాలుగా విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వాటిని సందర్శించి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తమని సుద్దాల అనూరాజ్ అన్నారు. .వివిధ స్వచ్ఛంద సంస్థల నిర్వాహకులు నసీమా, శ్రీదేవి, శిరీష, సుజాత, సరిత, మందల రామ దేవి తో పాటు తదితరులు పాల్గొన్నారు

# ఎస్సైగా బాధ్యతలు చేపట్టిన నరేష్



ముత్తారం జనంసాక్షి /ముత్తారం మండల ఎస్ఐ గా విధులు నిర్వహించిన మధుసుధన్ రావు మంచిర్యాలకు ఎస్ ఐ గా బదిలీ కాగా వారి స్థానంలో రామగుండం కమిషనరేట్లో విధులు నిర్వహించిన గోపతి నరేష్ బదిలీపై ముత్తారం వచ్చిన ఎస్ ఐ ఆదివారం రోజున బాధ్యతలు స్వీకరించారు. వారికి పోలీస్ సిబ్బంది కలసి ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం నూతన బాధితులు చెప్పట్టిన ఎస్ ఐ మాట్లాడుతూ మండలంలోని ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు.

# సీతారామ ప్రాజెక్టు రెండవ పంప్‌హౌస్ ట్రయల్ రన్

• సీతారామ ఎత్తిపోతల పథకం పంప్ హౌస్ ట్రయల్ రన్ ప్రారంభించిన మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి మంత్రి పొంగులేటి





**భద్రాద్రి కొత్తగూడెం బ్యూరో జూలై (10) జనంసాక్షి :** సీతారామ ఎత్తిపోతల పథకం లో భాగంగా ములకలపల్లి మండలం పూసగూడెంలో నిర్మించిన రెండవ పంప్ హౌస్ ట్రయల్ రన్ కార్యక్రమాన్ని రాష్ట్ర నీటిపారుదల శాఖ మరియు పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి, వ్యవసాయ, సహకార, చేనేత శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రెవెన్యూ, హౌసింగ్, సమాచారం, పౌరసరఫరాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్, ఎస్పీ రోహిత్ రాజ్ తో కలిసి నిర్వహించారు. బటన్ నొక్కి పంప్ హౌస్ ట్రయల్ రన్ ప్రారంభించారు. అనంతరం జరిగిన పత్రిక సమావేశంలో మాట్లాడుతూ ఉమ్మడి ఖమ్మం జిల్లాకు ఎట్టి పరిస్థితుల్లో గోదావరి జలాలను ఉపయోగించాలని ఉద్దేశంతో 2017 న ఈ ప్రాజెక్టుకు శంకుస్థాపన నిర్వహించామని తెలిపారు. మొదటి ఐదు సంవత్సరాలు పనులు బాగానే నడిచిన తరువాత ఐదు సంవత్సరాలు నత్త నడకన సాగాయని వివరించారు ఈ పథకంలో భాగంగా కొత్తూరు, ఆర్కే రంగాపురం, పూసుగుడెం వద్ద మూడు పంప్ హౌస్ ల ద్వారా గోదావరి జలాలను 104 కిలోమీటర్ల వరకు తీసుకువెళ్ల గలిగినట్లు చెప్పారు. ఈ ప్రాజెక్టులో భాగంగా 9.8 కిలోమీటర్ల మేర మారెళ్ళ పాడు వద్ద ఎత్తిపోతల పథకం ద్వారా తుమ్మల చెరువుకి పనులు జరుగుతున్నాయని పేర్కొన్నారు.కొంత భూసేకరణ, కెనాల్ పనులు పూర్తి చేస్తే అశ్వాపురం మండలంలో 15 వేల ఎకరాల భూమి సాగులోకి వస్తుందని తెలిపారు. 74వ కిలోమీటర్ వద్ద 38 వేల ఎకరాల కు సాగునీరు అందించే అవకాశం ఉందని, దీనికి కూడా భూసేకరణ పూర్తి చేస్తే ఈ ఏడాది సీజన్ కల్లా పూర్తిగా సాగులోకి వస్తుందని తెలిపారు.. 74 కిలోమీటర్ల నుంచి 98వ కిలోమీటర్ వరకు రెండవ ప్యాకేజీ లో 34 వేల ఎకరాలు సాగులోకి వస్తుందని 380 కోట్లు ఖర్చు చేసేందుకు నిర్ణయం తీసుకోవడం జరుగుతుందని అన్నారు.దీనికిగాను త్వరగా భూసేకరణ ,టెండర్లు పూర్తి చేయడం ద్వారా పైభాగానికి సాగునీరు ఇచ్చే అవకాశం ఉందని ,102 కిలోమీటర్ల వద్ద రాజీవ్ లింకు కెనాల్‌కు ముఖ్యమంత్రి , ఇరిగేషన్ మంత్రి మంజూరు చేయడం జరిగిందని పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టు పూర్తి చేయడం ద్వారా తక్కువ ఖర్చుతో లక్ష ఇరవై వేల ఎకరాల పైన మీడియం ప్రాజెక్ట్ లైన వైరా లంకసాగర్ నాగార్జునసాగర్ ఆయకట్టులకు నీరు అందించే అవకాశం ఉందని వివరించారు పినపాక, అశ్వరావుపేట, సత్తుపల్లి, మధిర, వైరా,పాలేరు మరియు ఖమ్మం నియోజకవర్గం లోని ఒక మండలం ఈ ప్రాంతాలన్నింటికీ ఈ ప్రాజెక్టు ద్వారా లబ్ధి చేకూరుతుందని వివరించారు.ఉమ్మడి ఖమ్మం జిల్లాలో భద్రాచలం , ఇల్లందు నియోజకవర్గాలకు కూడా సాగునీరు అందేలా చూడాల్సిన అవసరం ఉందని అన్నారు. సీతారామ ప్రాజెక్టు డిస్ట్రిబ్యూటరీ , భూసేకరణ పనులు వీలైనంత త్వరగా పూర్తి చేసి వచ్చే సీజన్ కల్లా సాగునీరు అందించాలని నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డిని కోరారు. ఈ కార్యక్రమంలో డిసిఎంఎస్ చైర్మన్ కొత్వల శ్రీనివాస్, రాష్ట్ర నీటిపారుదల అభివృద్ధి సంస్థ చైర్మన్ మువ్వా విజయ్ బాబు, రాహుల్ బొజ్జ ఐఏఎస్ నీ టిపారుదుల శాఖ సెక్రెటరీ, ప్రశాంత్ జీవన్ పాటిల్ స్పెషల్ సెక్రటరీ నీటిపారుదల శాఖ, ఇంజనీరింగ్ ఇన్ చీఫ్ అనిల్ కుమార్,చీఫ్ ఇంజనీర్ విజయభాస్కర్, ఎస్పీ కొత్తగూడెం ఎస్ శ్రీనివాస్ రెడ్డి, ఎస్పీ భద్రాచలం వెంకటేశ్వర్ రెడ్డి,ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌సురేష్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## ఉర్దూ మీడియం పాఠశాల విద్యార్థినీలకు అకామత్ ఖానా కమిటీ నోట్ బుక్స్ పంపిణీ

పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గుమ్ముల మోహన్ రెడ్డి



**నల్గొండటౌన్, ఆగష్టు 11(జనంసాక్షి)** ఉర్దూ మీడియం పాఠశాల విద్యార్థినీలు మంచి విద్యను అభ్యసించి ఉన్నత స్థాయికి ఎదగాలని నల్లగొండ పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గుమ్ముల మోహన్ రెడ్డి అన్నారు.నల్లగొండ జిల్లా కేంద్రంలోని మాన్యం చెల్కలో గల బహదూర్ ఖాన్ కమ్యూనిటీ హాల్లో అఖమట్ ఖానా కమిటీ ఆధ్వర్యంలో సుమారు 170 మంది ఉర్దూ మీడియం స్కూల్ నిరుపేద విద్యార్థులకు ఆదివారం ఉచితంగా నోట్ బుక్స్ పంపిణీ కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గుమ్మల మోహన్ రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని విద్యార్థినీలకు నోటుబుక్స్ పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బహదూర్ ఖాన్ అఖమాట్ ఖానా కమిటీ వారు నిర్వహించిన ఈ కార్యక్రమం ఎంతోమంది నిరుపేద విద్యార్థులకు చేయూత అందించినట్టు అవుతుందని అన్నారు. కోమటిరెడ్డి ప్రతీక్ రెడ్డి ట్రస్టు ద్వారా బహదూర్ ఖాన్ ఆధ్వర్యంలో రాబోవు రోజుల్లో కులమతాలకు అతీతంగా తక్కువ ఫీజులతో బహదూర్ ఖాన్ స్కూల్ స్థాపించడానికి మంత్రి కోమటిరెడ్డి తో చర్చించి ప్రభుత్వ స్థలం వచ్చే విధంగా కృషి చేస్తామని తెలిపారు.ఎంబిబిఎస్,ఐఐటి గవర్నమెంట్ సీటు పొందిన విద్యార్థులకు ప్రతీక్ రెడ్డి ఫౌండేషన్ ద్వారా పూర్తి ఫీజులు చెల్లించే విధంగా సహకరిస్తానని పేర్కొన్నారు. విద్యార్థులు మంచి విద్యను అభ్యసించి ఉన్నత స్థాయికి ఎదగాలని, రాబోయే తరాలకి ఆదర్శంగా ఉండాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో బహదూరా?న్ కమిటీ ప్రెసిడెంట్ మొహమ్మద్ ఝూహేద్ హుస్సేన్, సెక్రెటరీ డాక్టర్ ముంతాజ్ ఖురేషి, ట్రెజరర్ మొహమ్మద్ కలీం, జాయింట్ సెక్రటరీ షఫి నవాస్ ఖాన్, మాజీ ప్రెసిడెంట్ షాహిద్ అహ్మద్, ఈసి మెంబర్ మౌజామ్ హుస్సేన్, ఎంఎం వాసిక్ ,నుసురత్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

## రోటరీ' సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి..

• వైద్యశిబిరం ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే పాయం..



**బూర్గంపహాడ్ ఆగష్టు 11 (జనంసాక్షి) :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, బూర్గంపహాడ్ మండలం సారపాక ఐటీసీ అనుబంధ రోటరీక్లబ్ ఆఫ్ ఇన్ భద్ర, రోటరాక్ట్ క్లబ్లు సంయుక్తంగా చేస్తున్న సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పినపాక శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు అన్నారు. ఆదివారం తాళ్లగొమ్మూరు, కోయగూడెం ప్రజలకు వైద్యసేవలు అందించాలని క్లబ్ల ఆధ్వర్యంలో రైతువేదికలో ఏర్పాటు చేసిన వైద్యశిబిరాన్ని శాసనసభ్యులు పాయం ప్రారంభించారు. తొలుత శిబిరంలో వైద్యచికిత్సలు చేయించుకున్న వారికి ఆయన మందులు పంపిణీ చేశారు. అనంతరం ఎమ్మెల్యే పాయం మాట్లాడుతూ రోటరీక్లబ్లు చేస్తున్న సేవలు మరింత విస్తరించాలని, తద్వారా ప్రజలందరికీ న్యాయం జరుగుతుందన్నారు. శిబిరంలో 305 మందికి ఐటీసీ వైద్యులు విజయ్ కుమార్, నిఖిల్, అమృతలు వైద్యపరీక్షలు చేయగా ఐటీసీ, రోటరీక్లబ్ బాధ్యులు వారికి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సొసైటీ మాజీ చైర్మన్ పోతిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, ఉప సర్పంచ్ పోతి రెడ్డి వెంకటేశ్వరరెడ్డి, ఐటీసీ హెచ్‌ఆర్ హెడ్ శ్యామ్ కిరణ్, అడ్మిన్ మేనేజర్ చెంగ్రలావు, రోటరీక్లబ్ ఆఫ్ ఇన్ భద్ర అధ్యక్ష,కార్యదర్శులు డీవీఎం. నాయుడు, సాయిరామ్, రోటరాక్ట్ అధ్యక్ష, కార్యదర్శులు అరవిందన్, చైతన్య, ఈవో మహేష్, కార్యదర్శి తలగాని మురళిలతో పాటు రోటరీక్లబ్ ఆఫ్ ఇన్ భద్ర, రోటరాక్ట్ సభ్యులు రంజిత్, దేవిడ్ అలీవర్, శివశంకర్, రామకృష్ణ, ప్రవీణ్, విష్ణుప్రియ, హరిణి, హేమ, అలేఖ్య, చరణ్, మణికంఠ, ఉమ, ఢిల్లేశ్వరరావు, దీప్తి, ఐటీసీ కాంట్రాక్టర్లు సత్యనారాయణ, భాస్కరరావు, తిరుపతి ఏసోబు, బసప్ప రమేష్, వీర్రాజు, యాకూబ్, శ్రీకాంత్రెడ్డిలు తదితరులు పాల్గొన్నారు.



## ట్రాక్టర్ లో తరలిస్తున్న గంజాయి పట్టివేత

**భద్రాచలం, ఆగస్టు 11( జనంసాక్షి) :** శనివారం రాత్రి భద్రాచలం గోదావరి వంతెన వద్ద గంజాయి తరలిస్తున్న ట్రాక్టర్ ని గుర్తించి కేసు నమోదు చేసినట్లు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రొహిబిషన్ %ం% ఎక్సైజ్ అధికారి ఎస్. జానయ్య విలేకరుల సమావేశంలో తెలిపారు. ట్రాక్టర్ లో 155 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ట్రాక్టర్ నెంబర్ ఆర్.బి.టి 23113 ఇంజిన్ అని అన్నారు. ఈ సమావేశంలో భద్రాద్రి కొత్తగూడెం అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ పి.కరమ్ చంద్, భద్రాచలం ఎక్సైజ్ సి ఐ.రహీమున్నీసా బేగం, భద్రాచలం ఎక్సైజ్ ఎస్.ఐ అల్లూరి సీతారామరాజు సిబ్బంది అలీం, వీరబాబు, బాబు, నాగేశ్వరరావు, లలిత తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా కేంద్రంలో భద్రత పరిశీలించిన సెక్యూరిటీ సిబ్బంది



**సూర్యాపేట ప్రతినిధి (జనంసాక్షి):** స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు సందర్భంగా జిల్లా పోలీసు భద్రత చర్యలు చేపట్టిన సందర్భంగా ఎస్పి సన్ ప్రీత్ సింగ్ ఆదేశాల మేరకు వేడుకలు నిర్వహించనున్న నేపథ్యంలో జిల్లా కేంద్రంలో సెక్యూరిటీ సిబ్బంది భద్రత తనిఖీలు చేశారు. సెక్యూరిటీ సిబ్బంది పోలీస్ డాగ్ తో జిల్లా కేంద్రంలో తనిఖీలు నిర్వహించారు.హైటెక్ బస్టాండ్, కొత్త బస్టాండ్, ఫ్లై ఓవర్, పాత బస్టాండ్, పరేడ్ గ్రౌండ్ కు వచ్చే రోడ్డు మార్గాలను, పాత భవనాలు, రద్దీ ప్రదేశాలు తనిఖీ చేశారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు హాజరవుతున్న ముఖ్య అతథులు, విద్యార్థులు, పౌరులు, ప్రజాప్రతినిధులు, అధికారుల రక్షణలో భాగంగా తనిఖీలు నిర్వహించినట్లు సెక్యూరిటీ సిబ్బంది తెలిపారు.

## కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయాలి

సిపిఎం పార్టీ మండల కార్యదర్శి కందగట్ల అనంత ప్రకాష్..



**పాలక వీడు( జనంసాక్షి):** కాంగ్రెస్ పార్టీ పదేపదే బిఆర్ఎస్ ప్రభుత్వ అవినీతిని ప్రశ్నిస్తుంది తప్ప వాటిపై చర్యలకు ఆదేశాలు ఎందుకు ఇవ్వటం లేదని సిపిఎం పార్టీ పాలకవీడు మండల కార్యదర్శి కందగట్ల అనంత ప్రకాష్ ప్రశ్నించారు.మండల కేంద్రంలో పార్టీ మండల కమిటీ సభ్యులతో కలిసి ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు ఇచ్చినటువంటి వాగ్దానాలన్నిటిని అమలు చేయాలని,కాంగ్రెస్ పార్టీ రేవంత్ రెడ్డి ఎన్నికల ముందు ఆరు గ్యారెంటీలతోపాటు అనేక రకాలైనటువంటి హామీలను ప్రజలకు ఇచ్చారని వాటిని అమలు చేయాలని 57 సంవత్సరాల లోపు ఉన్న మహిళలకు 2500 ఇస్తామని,నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి,అదేవిధంగా వితంతు వృద్ధాప్య పెన్షన్ 4000 ఇస్తామని,ఇందిరమ్మ ఇండ్లు ఇస్తామని చెప్పారు ఎప్పటి లోపు ఇస్తారు,కేవలం ఒకటి రెండు హామీలు అమలు చేసి మిగతా హామీల విషయంలో కమిటీల పేరుతో కాలయాపన చేస్తూ కెసిఆర్ కుటుంబం యొక్క అవినీతిని బూచిగా చూపిస్తూ వాటిపై ఎంక్వయిరీ చేయకుండా పదేపదే వల్లే వేస్తూ ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కాలయాపన చేయటం తగదని ఆయన అన్నారు.కేసీఆర్ తన కుటుంబం యొక్క అవినీతిపై విచారణ ఆదేశిస్తూ ఇచ్చిన హామీల అమలుపై శ్రద్ధ వహించి అమలు చేయాలని ఆయన కోరారు.ధరణి పోర్టల్ ద్వారా అనేక అవకతవకలు జరిగాయని దానివల్ల రైతాంగానికి తీవ్ర నష్టం జరిగిందని మీరు కూడా దాన్ని దృష్టిలో పెట్టుకుని ధరణి సమస్యలు పరిష్కరిస్తామని చెప్పారని ఇప్పటివరకు అనేకమంది ఆశతో ఎదురు చూశారన్నారు మీరు అధికారులకు వచ్చిన తర్వాత సుమారు 8 నెలల పాటు ఎలాంటి రైతుల సమస్యలు పరిష్కారం కాలేదని ఆయన వాపోయారు.ధరణి పోర్టల్ రద్దుచేస్తూ భూమాత తీసుకొస్తామని చెప్పారని ఎప్పటి వరకు తీసుకొస్తారు ఒక టైం బాండ్ లేకుండా ప్రజలను అయోమయానికి గురి చేస్తున్నారని,తెల్ల రేషన్ కార్డుల విషయంలో అర్హులైన వాళ్లందరికీ ఇస్తామని ప్రకటించారు ఇప్పటికీ ఆ ప్రక్రియ ప్రారంభించలేదు గత పది సంవత్సరాలుగా కేసీఆర్ ప్రభుత్వం కొత్తగా పెళ్లయిన వాళ్ళ పేర్లు గాని ఈ మధ్యకాలంలో పుట్టినా కొడుకుల బిడ్డల పేర్లు గాని నమోదుకు అవకాశం లేదని తక్షణమే వారికి అవకాశం కల్పించి నూతన రేషన్ కార్డులు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు.ఈ సమావేశంలో మాజీ జెడ్పిటిసి ముషం నరసింహ,పిఎసిఎస్ వైస్ చైర్మన్ పగడాల మట్టేష్,మాజీ ఎంపీటీసీ దొంగల వెంకటయ్య, మాజీ సర్పంచ్ గుర్రం ధన మూర్తి,మండల కమిటీ నాయకులు దిద్దకుంట్ల పురుషోత్తం రెడ్డి, తురికొండ వెంకటేశ్వర్లు, ఎర్రెడ్ల మల్లారెడ్డి,మాతంగి ఏసురత్నం, ఆర్లపూడి వీరభద్రం,వడ్డే సైదయ్య,నన్నెపంగా రమేష్,తదితరులు పాల్గొన్నారు.

## పంచాయతీ కార్మికులకు కనీస వేతనం అమలు చేయాలి


నేడు జరిగే జిల్లా వ్యాప్త సమ్మెను జయప్రదం చేయండి



**భద్రాచలం ఆగస్టు 11 (జనంసాక్షి):** గ్రామపంచాయతీ కార్మికులు అనేక సంవత్సరాలుగా ఎన్నో , పోరాటాలు, ఆందోళనలు చేసిన వారి సమస్యలు పరిష్కారం కావడం లేదని అందులో భాగంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వ్యాప్తంగా నేడు జరిగే ఒకరోజు సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఏజె రమేష్ పిలుపు ఇచ్చినారు. ఈ సందర్భంగా జరిగిన జనరల్ బాడీని ఉద్దేశించి మాట్లాడుతూ, గ్రామపంచాయతీ కార్మికులు అనేక సంవత్సరాలుగా తమను పర్మినెంట్ చేయాలని కనీస వేతనం 26,000 ఇవ్వాలని పిఆర్సి పరిధిలోకి తీసుకురావాలని కోరడం జరిగింది. అర్హులైన వారిని కార్యదర్శులుగా నియమించాలని జీవో 51ని సవరించాలని, విధి నిర్వహణలో చనిపోయిన కార్మికులకు 10 లక్షల నష్ట పరిహారం ఇవ్వాలని వారి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని ప్రభుత్వాల దృష్టికి తీసుకు వెళ్లినప్పటికీ ఫలితం లేదన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఎంబీ, నర్సారెడ్డి పాల్గొనగా కాపుల రవి అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో గ్రామపంచాయతీ యూనియన్ నాయకులు శ్రీనివాస్, సాయి, చెన్నకేశవులు, ప్రేమ్, వర రాజు,విజయ, అనసూయ ఆదినారాయణ ,మనోజ్ రెడ్డి మరియు వందలాదిమంది కార్మికులు పాల్గొన్నారు.

## వాతావరణ సంరక్షణకు అందరూ మొక్కలు నాటాలి

ప్రజా ప్రతినిధులు, అధికారులు కలిసినప్పుడే అభివృద్ధి సాధ్యమవుతుంది : జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి



**నల్గొండటౌన్, ఆగష్టు 11(జనంసాక్షి)** పరిశ్రమలతో అభివృద్ధి వస్తుందని , అదే సమయంలో అభివృద్ధితోపాటు, వాతావరణ సమతుల్యం అవసరమని, ఇందుకోసం ప్రతి ఒక్కరు విరివిగా మొక్కలు నాటాలని జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం అయన నల్గొండ జిల్లా, మిర్యాలగూడ పట్టణం, అవంతిపురం ఈద్గా వద్ద స్థానిక శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి తో కలిసి వనమహోత్సవం కింద మొక్కలు నాటారు. వనమహోత్సవం కింద పెద్ద ఎత్తున (2500) మొక్కలు నాటడం సంతోషమని కలెక్టర్ అన్నారు. మిర్యాలగూడ లాంటి ప్రాంతంలో పరిశ్రమలు ఎక్కువగా ఉన్నాయని ,పరిశ్రమల వల్లనే అభివృద్ధి సాధ్యమవుతుందని, అయితే పరిశ్రమల వల్ల వాతావరణ కాలుష్యం కాకుండా పెద్ద ఎత్తున మొక్కలు నాటాల్సిన అవసరం ఉందని అన్నారు. స్థానిక శాసనసభ్యులు నియోజకవర్గం లో వనమహోత్సవం కింద పెద్ద ఎత్తున మొక్కలు నాటడంతో పాటు, స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో విరివిగా పాల్గొనడం పట్ల కృతజ్ఞతలు తెలిపారు. ప్రజాప్రతినిధులు, అధికారులు కలిసి పనిచేస్తేనే అభివృద్ధి సాధ్యమవుతుందని చెప్పారు. మిర్యాలగూడలో రైస్ మిల్లర్లు ఎక్కువగా ఉన్నందువలన వారు సైతం మొక్కలు నాటే కార్యక్రమంలో భాగస్వాములు కావాలన్నారు. మొక్కలు నాటడంతో పాటు, మొక్కల సంరక్షణ పై ప్రజా ప్రతినిధులు, అధికారులు దృష్టి సారించాలని , ఉపాధి హామీ పథకం కింద 3 సంవత్సరాల వరకు మొక్కలు నాటి సంరక్షించే అవకాశం ఉందని, ఇందుకు వాచర్లను నియమించుకోవాలని, అంతేకాక సంరక్షణ బాధ్యతలను సైతం మూడేళ్ల వరకు వారే చూస్తారని తెలిపారు. అధికారులు సైతం మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని కోరారు. అన్ని గ్రామ పంచాయతీలలో నీటి ట్యాంకర్లు ఉన్నందున వాటిని వినియోగించు కోవాలని ,ఎట్టి పరిస్థితులలో మొక్కలు చనిపోకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.స్థానిక శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి మాట్లాడుతూ మిర్యాలగూడ ప్రాంతంలో పరిశ్రమలు ఎక్కువగా ఉన్నాయని, దీన్ని దృష్టిలో ఉంచుకుని తాము పెద్ద ఎత్తున మొక్కలు నాటేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఇందులో భాగంగా 2500 మొక్కలు నాటుతున్నట్లు ఆయన వెల్లడించారు. స్వచ్ఛదానం పచ్చదనం కింద సైతం పెద్ద ఎత్తున మొక్కలు నాటామని వనమహోత్సవంలో మిర్యాలగూడ పట్టణంతోపాటు ,నియోజకవర్గంలో మొక్కలు నాటుతున్నట్లు ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా ఎస్.ఆర్ రెసిడెన్సి ప్రారంభోత్సవం

పాల్గొన్న ఎమ్మెల్యే వెంకటరావు

**భద్రాచలం, ఆగస్టు 11 (జనం సాక్షి) :** పట్టణంలోని అంబేద్కర్ సెంటర్, ఎన్.ఆర్. మెడికల్ షాప్ ప్రక్కన,ఆదివారం నూతనంగా ఎస్.ఆర్ రెసిడెన్సీని ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకటరావు పాల్గొని రిబ్బన్ కట్ చేశారు. పట్టణ సీఐ సంజీవరావు, ట్రాఫిక్ ఎస్ఐ మధు ప్రసాద్, టౌన్.ఎస్ఐ విజయలక్ష్మి ప్రారంభోత్సవంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వెంకటరావుకి ఎస్.ఆర్ రెసిడెన్సి వారు శాలువతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో పట్టణ ప్రముఖులు భోగాల శ్రీనివాస్ రెడ్డి, మానే రామకృష్ణ, సరేళ్ళ నరేష్, వెంకటరెడ్డి, సునీల్, ఎండి జిందా తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ మారుతి సూపర్ మార్కెట్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే

• వినియోగదారులకు నాణ్యమైన సేవలు అందించాలి..

• మహా నగరాలకు దీటుగా సూపర్ మార్కెట్లో నాణ్యమైన సరుకులు

• దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్..



**దేవరకొండ,ఆగష్టు 11(జనంసాక్షి):** దేవరకొండ పట్టణంలో ముదిగొండ చౌరస్తా వద్ద ఏర్పాటుచేసిన శ్రీ మారుతి సూపర్ మార్కెట్ ను ఆదివారం శాసన సభ్యులు నేనావత్ బాలు నాయక్ ప్రారంభించారు.ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి బాలు నాయక్ మాట్లాడుతూ దేవరకొండ పట్టణం మహానగరాలకు దీటుగా అభివృద్ధి చెందుతుందని, పట్టణంలో సూపర్ మార్కెట్ ఏర్పాటు కావడం శుభ పరిమాణం అన్నారు. వినియోగదారులు దూరప్రాంతాలకు వెళ్లి,రవాణా ఖర్చులు చేసి ఇబ్బందులు పడే కంటే మన పట్టణంలోని మహానగరాలకు దీటుగా సూపర్ మార్కెట్లో అన్ని రకాల నాణ్యమైన సరుకులు లభించడం సంతోషకరమన్నారు.సూపర్ మార్కెట్లో మెరుగైన సేవలు అందించినప్పుడే అందరి మన్ననలు పొందవచ్చు అని అన్నారు. సూపర్ మార్కెట్ కు వచ్చే వినియోగదారులకు ఆకట్టుకునే విధంగా నాణ్యమైన సరుకులను అందించాలని కోరారు.ప్రతి ఒక్కరు ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని అన్నారు. ఇతరులపై ఆధారపడకుండా స్వయం ఉపాధి అవకాశాలు కల్పించుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో నల్లగొండ పార్లమెంట్ కోఆర్డినేటర్ సిరాజ్ నాని మాధవరెడ్డి ఎంపీపీ భవాని పవన్ కుమార్ మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ముక్కామల్ల వెంకటయ్య , యువజన కాంగ్రెస్ నాయకులు రాజు తదితరులు పాల్గొన్నారు.

# రూ.5,681 పెరిగిన హైదరాబాద్ రియల్టీ మార్కెట్



హైదరాబాద్, ఆగస్టు 11 (జనంసాక్షి) : దేశంలోని అగ్రగామి రియల్టీ మార్కెట్లలో హైదరాబాద్ ఒకటిగా కొనసాగుతోంది. ప్రపంచ ప్రసిద్ధ కంపెనీలు సైతం తమ పెట్టుబడులను నగరానికి తరలిస్తున్న వేళ ఇక్కడి ప్రాపర్టీల ధరలు భారీగా పెరుగుతున్నట్లు నివేదికలు చెబుతున్నాయి. భారతదేశంలో అత్యంత ఖరీదైన రెసిడెన్షియల్ మార్కెట్లలో హైదరాబాద్ రెండో స్థానంలో ఉందని నైట్ ఫ్రాంక్ ఇండియా తన తాజా అఫర్డబిలిటీ ఇండెక్స్ నివేదికలో వెల్లడించింది. ఈ క్రమంలో ఈఎంఐ ఆదాయ నిష్పత్తి 30 శాతం వద్ద 2024 ఆర్థిక సంవత్సరంలో నిలిచింది. దేశంలోని మొదటి ఎనిమిది నగరాల్లో అహ్మదాబాద్ అత్యంత సరసమైన గృహాల మార్కెట్‌గా తొలిస్థానంలో 21 శాతం నిష్పత్తితో కొనసాగుతోంది. గడచిన కొన్ని సంవత్సరాలుగా హైదరాబాద్ అఫర్డబిలిటీ సూచిక గణనీయమైన మార్పులను చూసింది. 2010లో ఈ నిష్పత్తి 47 శాతంగా ఉండేది. గృహ కొనుగోలుదారుల డిమాండ్, విక్రయాల ఊపును నిలబెట్టడానికి స్థిరమైన అఫర్డబిలిటీ అవసరమని నైట్ ఫ్రాంక్ ఇండియా ఛైర్మన్, ఎండీ శిశిర్ బైజాల్ పేర్కొన్నారు. ఇది దేశానికి కీలకమైన ఆర్థిక చోదకంగా పని చేస్తుందని అన్నారు. ఆదాయ స్థాయిలు పెరగడంతో పాటు ఆర్థిక వృద్ధి బలపడడం తుది వినియోగదారుల ఆర్థిక విశ్వాసం గణనీయంగా బలపడుతుందని చెప్పారు. ఈ క్రమంలో 2025 ఆర్థిక సంవత్సరానికి రిజర్వు బ్యాంక్ భారత జీడీపీ వృద్ధి రేటు ఆరోగ్యకరంగా 7.2 శాతం వద్ద ఉంటుందని అంచనాలతో పాటు స్థిరమైన వడ్డీ రేటు దృష్టాంతంలో, ఆదాయం అఫర్డబిలిటీ స్థాయిలు 2024లో గృహ కొనుగోలుదారుల డిమాండ్‌కు మద్దతునిస్తాయని అభిప్రాయపడ్డారు. హైదరాబాద్ రియల్టీ ధరల పెరుగుదలను గమనిస్తే.. 2010లో నగరంలో చదరపు అడుగు వెయిటెడ్ సగటు ధర రూ.2,728గా ఉందని, 2019లో రూ.4,500కి పెరిగినట్లు నివేదిక హైలైట్ చేసింది. ఇవి 2024 మొదటి అర్ధభాగం నాటికి ధరలు క్రమంగా రూ.5,681కి పెరిగినట్లు నివేదించింది.

# విపణి

## హిండెన్‌బర్గ్ ఆరోపణలు నిరాధారం

- సెబీ ఛైర్ పర్సన్ మాధాబీ పురిబుచ్




న్యూఢిల్లీ, ఆగస్టు 11 (జనంసాక్షి) : భారత్ స్టాక్ మార్కెట్ల నియంత్రణ సంస్థ 'సెబీ', సెబీ ఛైర్ పర్సన్ వ్యక్తిత్వాన్ని దెబ్బ తీసేందుకే అమెరికా కేంద్రంగా పనిచేస్తున్న షార్ట్ సెల్లర్ 'హిండెన్ బర్గ్ రీసెర్చ్' ఆరోపణలు చేసిందని సెబీ ఛైర్ పర్సన్ మాధాబీ పురీ బుచ్, ఆమె భర్త ధావల్ బుచి పేర్కొన్నారు. హిండెన్ బర్గ్ రీసెర్చ్ శనివారం తమపై చేసిన ఆరోపణలకు ఆదివారం మాధాబీ పురీ బుచ్ దంపతులు వివరణాత్మక ప్రకటన చేశారు. 'సెబీ విశ్వసనీయతను, సెబీ ఛైర్ పర్సన్ వ్యక్తిత్వాన్ని దెబ్బ తీసేందుకు వారు ఆరోపణలు చేశారు' అని ఆ ప్రకటన పేర్కొంది.

అదానీ గ్రూప్ అనుబంధ ఆఫ్ షోర్ కంపెనీల్లో మాధాబి పురీ బుచి పెట్టుబడులు ఉన్నందు వల్లే ఆ సంస్థకు వ్యతిరేకంగా చర్యలు తీసుకునేందుకు సెబీ ఛైర్ పర్సన్ అయిష్టత చూపుతున్నారని హిండెన్ బర్గ్ శనివారం పేర్కొన్న సంగతి తెలిసిందే. దీనిపై స్పందించిన బుచ్ దంపతులు.. హిండెన్ బర్గ్ ఆరోపణలు నిరాధారం అని పేర్కొన్నారు. మాధాబీ పురీ బుచ్.. సెబీ ఛైర్ పర్సన్ గా పని చేస్తుండగా, బ్లాక్ స్టోన్ సీనియర్ సలహాదారుగా ధావల్ బుచ్ పని చేస్తున్నారు.

2017లో సెబీ పూర్తికాల సభ్యురాలిగా చేరడానికి రెండేండ్ల ముందే ఐఐఎఫ్ఎల్ వెల్త్ మేనేజ్మెంట్ ప్రమోట్ చేసిన సింగపూర్ సంస్థలో తమ పెట్టుబడులు పెట్టామని బుచ్ దంపతులు తెలిపారు. తమ బాల్య స్నేహితుడు అనిల్ అహుజా సలహా మేరకే రెండు ఫండ్ సంస్థల్లో పెట్టుబడులు పెట్టాలని నిర్ణయించుకున్నట్లు బుచ్ దంపతులు తమ ప్రకటనలో వెల్లడించారు. అప్పుడు మారిషస్ కేంద్రంగా పని చేస్తున్న ఐపీఈ ప్లస్ ఫండ్ వ్యవస్థాపకుడు- చీఫ్ ఇన్వెస్ట్‌మెంట్ ఆఫీసర్ గా అనిల్ అహుజా ఉన్నారని హిండెన్ బర్గ్ పేర్కొంది.

అదానీ పవర్ (2007-08)లో 3ఐ ఇన్వెస్ట్ ఫండ్ నామినీగా కూడా అనిల్ అహుజా ఉన్నారని హిండెన్ బర్గ్ గుర్తు చేసింది. 2017 జూన్ నాటికి తొమ్మిదేండ్ల పాటు అదానీ ఎంటర్ ప్రైజెస్ డైరెక్టర్ గానూ అనిల్ అహుజా పని చేశారని హిండెన్ బర్గ్ తెలిపింది. అదానీ గ్రూప్ సంస్థలపై గతంలో చేసిన ఆరోపణలకు సమాధానం ఇవ్వాలని తాము జారీ చేసిన నోటీసుకు స్పందించకుండా సెబీ విశ్వసనీయతపైనా దాడి చేయడంతోపాటు తమ వ్యక్తిత్వాన్ని హిండెన్ బర్గ్ దెబ్బ తీస్తున్నదని బుచ్ దంపతులు పేర్కొన్నారు.

| నెక్ గుడ్ల ధరలు | ఫామ్‌గేట్ | డజన్ |
|---|---|---|
| హైదరాబాద్ | ₹ 407 | ₹ 49 |
| వరంగల్ | ₹ 407 | ₹49 |

**బంగారం ధరలు** (10 గ్రాములు)

| | | |
|---|---|---|
| హైదరాబాద్ | ₹70,310 (24 క్యారెట్లు) | ₹64,450 (22 క్యారెట్లు) |
| చెన్నై | ₹64,450 (22 క్యారెట్లు) | ₹70,310 (24 క్యారెట్లు) |

**వెండి ధరలు (కేజీ)**
హైదరాబాద్
₹ 88,100

## యూఎస్ మార్కెట్ నుంచి విదేశీ ఇన్వెస్టర్లు వెనక్కి

- రూ.13,400 కోట్లు ఉపసంహరించుకున్న వైనం



హైదరాబాద్, ఆగస్టు 11 (జనంసాక్షి) : రెండు నెలలుగా దేశీయ స్టాక్ మార్కెట్లలో పెట్టుబడులు పెట్టిన విదేశీ ఇన్వెస్టర్లు ఆగస్టులో నిధులు ఉపసంహరించుకున్నారు. ఈ నెలలో ఇప్పటి వరకూ దేశీయ స్టాక్ మార్కెట్లలో ఇన్వెస్టర్లు రూ.13,400 కోట్ల పైచిలుకు వాటాలను విక్రయించారు. జపాన్ కరెన్సీ 'యెన్' క్యారీ ట్రేడ్ తోపాటు ఈ ఏడాది అమెరికాలో మాంద్యం ముప్పు పొంచి ఉందన్న భయాల మధ్య విదేశీ పోర్ట్ ఫోలియో ఇన్వెస్టర్లు (ఎఫ్‌పీఐ).. దేశీయ స్టాక్ మార్కెట్లలో వాటాలు విక్రయిస్తున్నారు. ఈ ఏడాది ఇప్పటి వరకూ ఎఫ్?పీఐలు రూ.22,134 కోట్ల విలువైన వాటాలు కొనుగోలు చేశారు.

ఒకవేళ దేశీయ స్టాక్ మార్కెట్లలో వృద్ధి కొనసాగినట్లయితే ఎఫ్‌పీఐలు మరింతగా తమ వాటాలను విక్రయించే అవకాశం ఉందని జియోజిత్ ఫైనాన్సియల్ సర్వీసెస్ చీఫ్ ఇన్‌వెస్ట్‌మెంట్ స్ట్రాటజిస్ట్ వీకే విజయకుమార్ తెలిపారు. విదేశీ మార్కెట్లో పరిస్థితిని బట్టి ఎఫ్ పీఐల కదలికలు ఉంటాయన్నారు. దేశీయ స్టాక్ మార్కెట్ల నుంచి వచ్చిన సమాచారం మేరకు ఈ నెల తొమ్మిదో తేదీ వరకూ ఎఫ్‌పీఐలు రూ.13,431 కోట్ల విలువైన షేర్లు ఉపసంహరించుకున్నారు.

దేశీయంగా సంస్కరణలు కొనసాగుతాయన్న అంచనాలు, ఊహించినదానికన్నా మెరుగ్గా కార్పొరేట్ సంస్థల ఆర్థిక ఫలితాలు ఉండటంతోపాటు సుస్థిరంగా భారత్ వృద్ధిరేటు సాగుతుందన్న అంచనాల మధ్య జూలైలో రూ.32,365 కోట్ల విలువైన షేర్లు కొనుగోలు చేశారు. అంతకుముందు జాతీయ స్థాయిలో రాజకీయ సుస్థిరత నెలకొనడంతో మార్కెట్లు పుంజుకోవడంతో జూన్ నెలలో ఎఫ్ పీఐలు రూ.26,565 కోట్ల విలువైన షేర్లు కొనుగోలు చేశారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఏప్రిల్ లో రూ.8,700 కోట్లు, మేలో రూ.25,586 కోట్ల విలువైన షేర్లను ఎఫ్ పీఐలు ఉపసంహరించుకున్నారు.

# జాతీయం అంతర్జాతీయం

## బంగ్లా చీఫ్ జస్టిస్ రాజీనామా..

- నిరసనకారుల ముట్టడితో నిమిషాల్లో పదవికి గుడ్ బై
- పదవి నుంచి తప్పుకున్న బంగ్లా బ్యాంక్ గవర్నర్



ఢాకా, ఆగస్టు 11 (జనంసాక్షి) : బంగ్లాదేశ్‌లో ఉద్రిక్తతలు, సంక్షోభ పరిస్థితులు కొనసాగుతున్నాయి. మాజీ ప్రధానమంత్రి షేక్ హసీనా రాజీనామాకు ఒత్తిడి చేసి విజయవంతమైన నిరసనకారులు మిగతా ప్రధాన పదవుల్లో ఉన్న వారిని లక్ష్యంగా చేసుకున్నారు. శనివారం ఉదయం వందలాది మంది నిరసనకారులు, విద్యార్థులు, న్యాయవాదులు సుప్రీంకోర్టు ప్రాంగణంలోకి చేరారు. గంట సేపట్లో ప్రధాన న్యాయమూర్తి రాజీనామా చేయాలని, లేకపోతే న్యాయమూర్తుల ఇండ్లను ముట్టడిస్తామని హెచ్చరించారు. దీంతో తప్పని పరిస్థితుల్లో బంగ్లాదేశ్ చీఫ్ జస్టిస్ ఒబైదుల్ హసన్ తన పదవికి రాజీనామా సమర్పించారు. న్యాయమూర్తుల భద్రత దృష్ట్యా తాను రాజీనామా చేసినట్టు ఆయన ప్రకటించారు. హసన్ రాజీనామా తమకు అందిందని పార్లమెంటరీ వ్యవహారాల సలహాదారు ఆసిఫ్ నజ్రుల్ ఫేస్‌బుక్‌లో ప్రకటించారు. ఒబైదుల్ హసన్ తర్వాత మరో ఐదుగురు న్యాయమూర్తులు సైతం రాజీనామా చేశారు. కాగా, సుప్రీంకోర్టు ఫుల్ మీటింగ్ నిర్వహించేందుకు ప్రధాన న్యాయమూర్తి సిద్ధమయ్యారని, తాత్కాలిక ప్రభుత్వం చట్టవిరుద్ధమని ఆయన ప్రకటించాలని అనుకున్నారని నిరసనకారులు ఆరోపించారు. మరోవైపు, బంగ్లాదేశ్ సెంట్రల్ బ్యాంక్ గవర్నర్ అబ్దుల్ రౌఫ్ తాలుక్‌దర్ కూడా తన పదవికి రాజీనామా చేశారు. ఇటీవల ఆయన రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ నిరసనకారులు బ్యాంకు ప్రాంగణంలో ఆందోళన చేశారు. ఢాకా యూనివర్సిటీ వీసీ మక్సూద్ కమల్, ఎస్‌యూఎస్‌టీ వీసీ ఫరీదుద్దిన్ అహ్మద్ సైతం రాజీనామా చేశారు.

## ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీకి ఒక్క సీటు కూడా రాదు

- ఢిల్లీ మంత్రి, ఆప్ నేత సౌరభ్ భరద్వాజ్



న్యూఢిల్లీ, ఆగస్టు 11 (జనంసాక్షి) : త్వరలో జరగనున్న ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీకి ఒక్క సీటు కూడా రాదని ఢిల్లీ మంత్రి, ఆప్ నేత సౌరభ్ భరద్వాజ్ అన్నారు. ఎక్సైజ్ పాలసీ కేసులో ఢిల్లీ మాజీ డిప్యూటీ సీఎం మనీష్ సిసోడియాకు కోర్టు బెయిల్ మంజూరు చేసిన అనంతరం పార్టీ శ్రేణులు, ఢిల్లీ ప్రజలు సంతోషంగా ఉన్నారని చెప్పారు. మనీష్ సిసోడియా నివాసంలో ఆదివారం పార్టీ నేతలతో కీలక భేటీ జరిగిందని తెలిపారు. ఈ సమావేశంలో రానున్న ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి పలు అంశాలపై చర్చించామని మంత్రి వెల్లడించారు. ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ కూడా త్వరలోనే జైలు నుంచి బయటకు వస్తారని సౌరభ్ భరద్వాజ్ ధీమా వ్యక్తం చేశారు. కాగా, ఢిల్లీ ఎక్సైజ్ పాలసీ కేసులో ఆప్ నేత మనీష్ సిసోడియాకు సుప్రీంకోర్టు బెయిల్ మంజూరు చేయడాన్ని అంతకుముందు ఆ పార్టీ ఎంపీ సందీప్ పాఠక్ స్వాగతించారు. ఇది ఘన విజయమని, ఈ విజయం కేవలం తమదే కాదని, దేశ ప్రజాస్వామ్య వ్యవస్థ సాధించిన విజయమని ఆయన పేర్కొన్నారు. సర్వోన్నత న్యాయస్థానం మనీష్ సిసోడియాకు బెయిల్ మంజూరు చేస్తూ వెలువరించిన తీర్పు చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించదగినదని చెప్పారు. ఈ తరహా నియంతృత్వ పోకడలు చెల్లవని, వ్యవస్థలను గుప్పిట్లో పెట్టుకుని ఎంతోకాలం సాగించలేరనేందుకు కోర్టు తీర్పు చెంపపెట్టు వంటిదని అన్నారు.

## రిజర్వేషన్, రాజ్యాంగం, కుల నిర్మూలనకు ఆరెస్సెస్ వ్యతిరేకం

- కాంగ్రెస్ ఎంపీ మాణిక్యం ఠాగూర్

న్యూఢిల్లీ, ఆగస్టు 11 (జనంసాక్షి) : కుల వ్యవస్థ సోపాన క్రమం కొనసాగాలని ఆరెస్సెస్ కోరుకుంటుందని కాంగ్రెస్ ఎంపీ మాణిక్యం ఠాగూర్ అన్నారు. అగ్ర కులాల వారు ముందువరసలో ఓబీసీలు, ఎస్సీలు దిగువ స్థాయిలో ఉండే వ్యవస్థను ఆరెస్సెస్ అనుసరిస్తుందని చెప్పారు. పార్లమెంట్‌లో బీజేపీ ఎంపీ అనురాగ్ ఠాకూర్ ఇదే తీరులో మాట్లాడారని పేర్కొన్నారు. కుల వ్యవస్థ కొనసాగాలన్నదే కాషాయ పాలకుల విధానమని స్పష్టం చేశారు. న్యాయపరమైన ప్రక్రియతో కుల వ్యవస్థను పెకిలించివేయాలని ఆకాంక్షించే క్రమంలోనే తాము కుల గణనను కోరుతున్నామని చెప్పారు. అప్పుడే నిజమైన వివక్షను పరిష్కరించడం సాధ్యమవుతుందని అన్నారు. రిజర్వేషన్, రాజ్యాంగం, కుల నిర్మూలనకు ఆరెస్సెస్ వ్యతిరేకమని ఆయన పేర్కొన్నారు.

కుల వ్యవస్థ వేళ్లూనుకునేందుకు రాజ్యాంగంలో మార్పులను ఆరెస్సెస్ కోరుకుంటున్నదని అన్నారు. భారత్ ఏకమత రాజ్యంగా ఉండాలని ఆరెస్సెస్ ఆకాంక్ష అని చెప్పారు. ఈ రకమైన ఆరెస్సెస్ ఆలోచనా ధోరణి మహాత్మా గాంధీ, బాబాసాహెబ్ అంబేద్కర్‌ల ఆశయాలకు విరుద్ధమని మాణిక్యం ఠాగూర్ వివరించారు. ఆరెస్సెస్ విధానాలను కాషాయ పాలకులు అనుసరిస్తున్నారని ఆయన మండిపడ్డారు.

## వరదలకు కొట్టుకుపోయిన తుంగభద్ర డ్యామ్ గేట్



బెంగళూరు, ఆగస్టు 11 (జనంసాక్షి) : కర్ణాటక రాష్ట్రం పరిధిలో ఉన్న తుంగభద్ర డ్యామ్ గేట్ వరద ఉధృతికి కొట్టుకుపోయింది. రాత్రి హొస్పేట వద్ద చైన్ లింక్ తెగడంతో 19వ గేట్ కొట్టుకుపోయినట్లు అధికారులు నిర్ధారించారు. దీంతో రాత్రి నుంచి లక్ష క్యూసెక్కుల మేర నీరు వృథాగా పోతోంది. 60 టీఎంసీల నీరు వృథాగా పోతుంది. కొట్టుకుపోయిన గేటు నుంచి 75 వేల క్యూసెక్కులు వృథాగా పోతోంది. కొట్టుకుపోయిన గేటుపై భారం పడకుండా మరో 7 గేట్ల నుంచి నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. కొట్టుకుపోయిన గేటు సహా 8 గేట్ల నుంచి లక్ష క్యూసెక్కుల మేర నీరు వృథాగా పోతోంది. కర్ణాటక శివమొగ్గలో కురిసిన భారీ వర్షాలకు తుంగభద్ర డ్యామ్‌కు వరద నీరు పోటెత్తింది. తుంగభద్ర నుంచి సుంకేశుల ప్రాజెక్టుకు లక్ష క్యూసెక్కుల వరద కొనసాగుతోంది. వరద ఎక్కువగా ఉండడంతో మరమ్మతులకు ఆటంకం కలుగుతోంది. తుంగభద్రలో వరద తగ్గాక అధికారులు మరమ్మతులు చేపట్టనున్నారు. రోజుకు 9 టీఎంసీల చొప్పున 60 టీఎంసీలు అధికారులు ఖాళీ చేయనున్నారు. ప్రాజెక్టులో 60 టీఎంసీలు ఖాళీ చేశాక కొత్త గేటు ఏర్పాటు చేసే అవకాశం ఉంది.

## వైద్యురాలి హత్యాచార ఘటనపై సీబీఐ విచారణకు కేంద్ర మంత్రి డిమాండ్




న్యూఢిల్లీ, ఆగస్టు 11 (జనంసాక్షి) : కోల్‌కతాలోని ఆర్జీ కార్ మెడికల్ కాలేజీ, హాస్పిటల్‌లో పోస్ట్ గ్రాడ్యుయేట్ ట్రైనీ డాక్టర్ హత్యాచర ఘటన దేశవ్యాప్తంగా కలకలం రేపింది. ఈ ఘటనకు బాధ్యులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ నిరసనలు మిన్నంటాయి. ఇకఈ ఘటనకు సంబంధించి నిర్వహించిన శవ పరీక్ష నివేదిక వెలువడింది. ఆమెపై లైంగిక దాడి చేసిన అనంతరం హత్య చేసినట్టు అది నిర్ధారించింది.

ఈ కేసులో నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. మరోవైపు ఆర్జీ కార్ మెడికల్ కాలేజీ ఘటనపై కేంద్ర మంత్రి సుకంత మజుందార్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ ఘటన సిగ్గుచేటని, సమగ్ర దర్యాప్తును చేపట్టి వాస్తవాలను నిగ్గుతేల్చాలని అన్నారు. వైద్యురాలి హత్యాచార ఘటనపై సీబీఐ విచారణ జరిపించాలని ఆయన డిమాండ్ చేశారు.

పోలీసులు తొలుత ఇది ఆత్మహత్య కేసని చెప్పి, ఆపై హత్య కేసు అన్నారని అసలు సీబీఐ విచారణ జరిపిస్తేనే వాస్తవాలు వెలుగుచూస్తాయని చెప్పారు. కాగా, ఈ ఘటనపై జేఎంఎం ఎంపీ మహువ మాఝీ స్పందించారు. ఈ తరహా ఘటనలు ఎక్కడ జరిగినా వాటిని తీవ్రంగా ఖండించాలని అన్నారు. ఈ ఘటనలపై ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు తీవ్రంగా స్పందించి దోషులను తక్షణమే గుర్తించి కఠిన చర్యలు చేపట్టాలని చెప్పారు. ఇలాంటి ఘటనలను రాజకీయం చేయడం తగదని ఆమె పేర్కొన్నారు.

## నాగార్జున సాగర్ వద్ద విమానాశ్రయం

- కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు



అమరావతి, ఆగస్టు 11 (జనంసాక్షి) : నాగార్జున సాగర్‌తో పాటు మరికొన్ని విమానాశ్రయాల ఏర్పాటుకు కేంద్రం ఆలోచిస్తుందని కేంద్ర విమానాయానశాఖ మంత్రి కింజరపు రామ్మోహన్ నాయుడు వెల్లడించారు. వీటితో పాటు శ్రీకాకుళం, దగదర్తిలో, కుప్పం వద్ద కూడా విమానాశ్రయాల ఏర్పాటుకు ప్రయత్నిస్తున్నామని వివరించారు. ఆదివారం భోగాపురం విమానాశ్రయ పనులను మంత్రి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పనుల పురోగతిని సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో విమానాశ్రయాల నిర్మాణానికి తాను కట్టుబడి ఉన్నానని పేర్కొన్నారు. ఎన్డీయే ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఇప్పటి వరకు నాలుగు శాతం పనులు పురోగతి సాధించాయని అన్నారు. ఇప్పటివరకు 36 శాతం పనులు పూర్తికాగా గడువు కంటే ముందే నిర్మాణాన్ని పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తామని స్పష్టం చేశారు. అనంతపురం, ఒంగోలులో కూడా విమానాశ్రయం ఏర్పాటు చేయాలని కోరుతున్నారని తెలిపారు. రాష్ట్రం ఈస్ట్, కోస్ట్‌లో ఉందని, పారిశ్రామికంగా ఎంతో అభివృద్ధి చెందే అవకాశమున్నందున భవిష్యత్ అవసరాలకు తగ్గట్లు విమానాశ్రయాల ఏర్పాటుకు ముందుస్తు చర్యలు తీసుకుంటున్నామని స్పష్టం చేశారు.

జనంసాక్షి
www.janamsakshi.org
సోమవారం
12 ఆగస్టు 2024
తెలంగాణ

# రెవెన్యూ ఉద్యోగులు ప్రభుత్వానికి కళ్ళు, చెవులు

## నూతన ఆర్ఓఆర్ చట్టం పై ట్రెసా ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి సదస్సులో ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి..

**కరీంనగర్ బ్యూరో, ఆగస్టు 11 (జనంసాక్షి)**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రతిపాదించిన నూతన ఆర్ఓఆర్ ముసాయిదా బిల్లుపై తెలంగాణ రెవెన్యూ ఎంప్లాయిస్ సర్వీసెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కరీంనగర్ కలెక్టరేట్ ఆడిటోరియంలో రాష్ట్ర స్థాయి సదస్సు నిర్వహించారు. ప్రభుత్వం ప్రతిపాదించిన ముసాయిదా బిల్లుపై వివిధ వర్గాల తో చర్చించి ప్రజలకు పట్టాదారులకు రైతులకు మరింత మేలు జరిగే విధంగా చట్టం రూపకల్పంలో సహకరించాలనే లక్ష్యంతో నిర్వహించిన రాష్ట్రస్థాయి సదస్సులో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి మాట్లాడుతూ... గత ప్రభుత్వం తీసుకొచ్చిన ధరణి ద్వారా రైతులు, ఉద్యోగులు అనేక సమస్యలు ఎదుర్కొన్నారని అదేవిధంగా రెవెన్యూ వ్యవస్థను గత ప్రభుత్వం భ్రష్టు పట్టించిందని తెలియజేశారు. కొత్త రెవెన్యూ చట్టం ఈ సమస్యలన్నింటికీ పరిష్కారం చూపే విధంగా ఉండాలని అదేవిధంగా రెవెన్యూ ఉద్యోగులు ప్రభుత్వానికి కళ్ళు చెవులు గా ఉంటారని గ్రామస్థాయి రెవెన్యూ వ్యవస్థను కూడా పటిష్టపరిచి ఒక మంచి చట్టం ద్వారా తెలంగాణ ప్రజలకు మేలైన సర్వీసులు అందిస్తామని తెలియజేశారు. ట్రెసా ప్రయత్నాన్ని అభినందిస్తూ వారందించే సూచనలు అన్నింటిని ప్రత్యేకంగా ముఖ్యమంత్రి దృష్టికి, రెవెన్యూ మంత్రి దృష్టికి తీసుకువెళ్లి అవన్నీ చట్టంలో పొందుపరిచేలా తాను ప్రయత్నిస్తానని తెలియజేశారు. అతిథులుగా పాల్గొన్న మానకొండూరు శాసనసభ్యులు కవ్వంపల్లి సత్యనారాయణ, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి లు మాట్లాడుతూ... నూతన రెవెన్యూ చట్టంలో పొందుపరచవలసిన వివిధ అంశాలను రైతులకు, పట్టాదారులకు అందించవలసిన సర్వీసులను వివరించారు.



ట్రెసా రాష్ట్ర అధ్యక్షులు వంగా రవీందర్ రెడ్డి మాట్లాడుతూ... ప్రభుత్వం కొత్త చట్టం చేసే ముందు వివిధ వర్గాల నుండి సూచనలను తీసుకోవడం శుభ పరిణామమని, అదే విధంగా నూతన చట్టం అమలుకు సంబంధించి అసోసియేషన్ ద్వారా తగిన సూచనలు చేయడం జరుగుతుందని వీటి ద్వారా రైతులకు మరిన్ని సేవలు అందించడానికి రాష్ట్ర రెవెన్యూ ఉద్యోగులందరూ ముందుంటారని తెలియజేశారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతమ్ కుమార్ మాట్లాడుతూ... గత అనేక సంవత్సరాలుగా రెవెన్యూ ఉద్యోగులు ప్రజలకు సేవ చేస్తున్నారని రెవెన్యూ వ్యవస్థ బలంగా ఉంటే అది సాధారణ ప్రజలకు చాలా ఉపయోగకరంగా ఉంటుందని సూచించారు. వీరిరువురు కొత్త చట్టంలో ఆర్డీఓ అప్పిలేట్ అథారిటీ గా ఉండాలని కలెక్టర్ స్థాయిలో రివిజన్ కు అవకాశం ఉండాలని సూచించడం జరిగింది.


కార్యక్రమంలో రిటైర్డ్ రెవెన్యూ అధికారులు గౌరిశెట్టి మనోహర్, గంప శంకరయ్య, చంద్రయ్య, ప్రభాకర్, సుదర్శన చారి, ఈశ్వర్ లు మాట్లాడుతూ... కొత్త రెవెన్యూ చట్టంలో పలు విలువైన సూచనలు అందించారు. క్రెడాయ్ ప్రతినిధి అనిల్, రియల్ ఎస్టేట్ రంగానికి చెందిన చంద్రమౌళి, న్యాయవాదులు కొరివి వేణుగోపాల్, ఎర్రం రాజి రెడ్డి, సొల్లు సత్యం, రైతు సంఘాల ప్రతినిధులు పాల్గొని ప్రభుత్వం ప్రతిపాదించిన నూతన ఆర్ఓఆర్ ముసాయిదా బిల్లును స్వాగతిస్తూ పలు విలువైన సూచనలు చేశారు. వక్తలు ప్రధానంగా ఆక్యుమెంట్ కాలం ఉండాలని, భూధార్ ఇచ్చే ముందే సరైన సర్వే నిర్వహించాలని, నామమాత్రంగా నైనా భూమిశిస్తూ ఉండాలని, సాదాబైనామాల విషయంలో నియంత్రణ ఉండాలని, మ్యూటేషన్, సక్సేషన్ మొదలైన సర్వీసులు మండల స్థాయిలోనే రైతులకు అందుబాటులో ఉండాలని అవి ఇచ్చే ముందు ప్రతి సర్వే సబ్ డివిజన్ రికార్డ్ తయారు చేసి వాటికి భూధార్ నెంబర్ కేటాయించాలని ముఖ్యంగా గ్రామస్థాయిలో రెవెన్యూ వ్యవస్థను పటిష్ట పరచాలని జిల్లా స్థాయి లోనే రైతులకు అన్ని రకాల రెవెన్యూ సర్వీసులు అందించాలని కోరడం జరిగింది. ఈ కార్యక్రమంలో కరీంనగర్ ఆర్డీఓ మహేశ్వర్, మెట్పల్లి ఆర్డీవో శ్రీనివాస్, వీఆర్వో ల సంఘం రాష్ట్ర అధ్యక్షులు గోల్కొండ సతీష్ , టీఎన్జీవోస్ అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి, ట్రెసా రాష్ట్ర కమిటీ సభ్యులు రియాజ్, నిరంజన్, చైతన్య వివిధ జిల్లా కమిటీల అధ్యక్షులు రమన్ రెడ్డి, వకీల్, కిషన్, శ్రీనివాస్, రాజ్‌ప్రకాష్ వివిధ జిల్లాల నుండి తహసీల్దార్లు, నాయబ్ తహసీల్దారులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు. ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం ప్రభుత్వం ప్రతిపాదించిన రెవెన్యూ ముసాయిదా బిల్లుకు అవసరమైన సూచనలు ఇవ్వడం ద్వారా రాష్ట్రంలో రైతులకు పట్టాదారులకు మరింత మేలైన సౌకర్యాలు అందే విధంగా చూడాలని వక్తలు కోరారు.




# రాజన్న ఆలయంలో సెల్ ఫోన్ల భద్రపరిచే చోట దోపిడీ..

**భక్తుల నుండి రెట్టింపు డబ్బులు వసూలు చేస్తున్న నిర్వాహకులు..**

**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి ఆగస్టు 11 (జనంసాక్షి)**



ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయంలో సెల్ ఫోన్ భద్రపరచు స్థలంలో భక్తులు నిలువు దోపిడీకి గురవుతున్నారు. శ్రావణమాసం కావడంతో రాష్ట్ర నలుమూలల నుండి ఆలయానికి భక్తులు రావడంతో రద్దీ పెరుగుతుంది. ఆలయం లోపలికి సెల్ ఫోన్ ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలు తీసుకెళ్లడాన్ని ఆలయ అధికారులు నిషేధించారు. సెల్ ఫోన్ ఎలక్ట్రానిక్ పరికరాలు భద్రపరచడానికి నిర్ణీత రుసుముతో ఆలయ ఆవరణలో సెల్ ఫోన్ భద్రపరచుటకు గదిని ఏర్పాటు చేశారు. సెల్ ఫోన్ భద్రపరచడానికి రూ 5 ధర నిర్ణయించి అక్కడ ఫ్లెక్సీ పై కూడా ధరలను ఏర్పాటు చేశారు.నిర్వాహకులు మాత్రం నిబంధనలు బేఖాతరు చేస్తూ భక్తుల నుండి రెట్టింపు డబ్బుల్ని వసూలు చేస్తున్నారు. ఆలయానికి వచ్చిన భక్తులు తమ సెల్ ఫోన్ భద్రపరచడానికి వెళ్లగా కౌంటర్లో రూ 10 తీసుకొని రసీదు ఇస్తున్నారు. రూ 5 ధర నిర్ణయించి ఉండగా రెట్టింపు డబ్బులు ఎలా తీసుకుంటారని ప్రశ్నించిన భక్తులకు దురుసుగా సమాధానం బదిలిస్తున్నారు. ఆలయ అధికారుల స్పందించి అధిక ధరల దోపిడిని నియంత్రించాలని భక్తులు కోరుతున్నారు. ఈ విషయమై ఆలయ ఈవో వినోద్ రెడ్డిని సంప్రదించగా అధిక ధరలు వసూలు చేస్తున్నట్లు తన దృష్టికి వచ్చిందని నోటీసులు జారీ చేసి తగిన చర్యలు తీసుకుంటామన్నారు.

# 9వ రోజుకు చేరిన జర్నలిస్టుల దీక్ష

- జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయించే వరకు పోరాటం చేస్తాం
- టి.యు.డబ్ల్యు.జె.జిల్లా అధ్యక్షులు చీటీ శ్రీనివాసరావు




**జగిత్యాల బ్యూరో, ఆగస్టు 11,(జనంసాక్షి):**

జగిత్యాల పట్టణంలో జర్నలిస్టులు ఇళ్ల స్థలాల సాధన కై చేపట్టిన నిరవధిక నిరసన దీక్ష కార్యక్రమం తొమ్మిదవ రోజుకు చేరింది. ఈ సందర్భంగా జర్నలిస్టుల సంఘం జగిత్యాల జిల్లా శాఖ అధ్యక్షులు మాట్లాడుతూ ఇళ్ల స్థలాల కొరకు గత మూడు దశాబ్దాలుగా నిరీక్షిస్తున్నా, మాకు నిరాశే మిగిలింద న్నారు ప్రజా ప్రతినిధులు మా సేవల్ని వాడుకున్నారే తప్ప మాకు ఎలాంటి న్యాయం చేయలేద న్నారు. ఇప్పటికైనా మమ్మల్ని గుర్తించి మాకు న్యాయం చేయకపోతే, నిరసన కార్యక్రమాలు ఇలాగే, కొన సాగిస్తూ మాకు,న్యాయం జరిగే వరకూ పోరాటం చేస్తామన్నారు .ఈదీక్ష శిబిరాన్ని మూమెంట్ ఫర్ పీస్ అండ్ జస్టిస్ నాయకులు సోయబుల్ హక్ మహమ్మద్ అబ్దుల్ హలీం కాజా సాలీముద్దీన్ సయ్యద్ గౌస్ అబ్దుల్ షఫీ, మమ్మద్ ఖలీల్ వాజిద్ జలీల్,సభ్యులు ప్రారంభించారు,ఈ కార్యక్రమానికి, టి.పి.యు.ఎస్, జిల్లా అధ్యక్షులు బోనగిరి దేవయ్య నాయకులు, నరేందర్‌రావు వొడ్నాల రాజశేఖర్, ప్రసాద్‌రావు, ఎస్సీ.ఎస్టీ.టి.యు ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షులు జాదవ్ వెంకట్రావు నిర్మల్ జిల్లా శాఖ అధ్యక్షులు భూక్య రాజేష్ నాయక్ జగిత్యాల జిల్లా అధ్యక్షులు సునావత్ రాజు, దీక్ష శిబిరానికి చేరుకొని సంఘీభావం తెలిపారు,దీక్షలో పాల్గొన్న, బెజ్జంకి సంపూర్ణ చారి,ఎల్లాలరాజేందర్ రెడ్డి,గుర్రం చంద్రశేఖర్, సిరిసిల్ల రాజేంద్రశర్మ సాదుల రవి,కడార్ల రంజిత్,కోల హరీష్ గౌడ్, ఇట్టెరాజు, గొల్లపల్లి మనోజ్ గౌడ్ ,తాండ్ర శంకర్ గౌడ్ లకు శ్రీచైతన్య జూనియర్,డిగ్రీ కళాశాలల విద్యాసంస్థల అధినేత ముసిపట్ల రాజేందర్,డైరెక్టర్ నేరెళ్ల మల్లేశం గౌడ్ లు నిమ్మరసం ఇచ్చి దీక్ష విరమింపజేశారు. ఈకార్యక్రమంలో టీ.యూ.డ.బ్ల్యూ.జే రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు రాగుల గోపాలచారితో పాటు ప్రింట్ , ఎలక్ట్రానిక్ మీడియా పాత్రికేయులు పాల్గొన్నారు.

# రుణమాఫీ కాని రైతులు అధైర్యపడవద్దు..

## కాంగ్రెస్ రాష్ట్ర అధికార ప్రతినిధి కటకం మృత్యుంజయం

**ఎల్లారెడ్డిపేట, ఆగస్టు 11, (జనంసాక్షి) :**



రాష్ట్రంలో రుణమాఫీ కాని వారు రైతులు అధైర్యపడవద్దని కాంగ్రెస్ రాష్ట్ర అధికార ప్రతినిధి కటకం మృత్యుంజయం అన్నారు. ఎల్లారెడ్డిపేట కాంగ్రెస్ కార్యాలయంలో ఆదివారం మృత్యుంజయం మాట్లాడుతూ రాష్ట్రంలో 30వేల మంది రైతులకు సాంకేతికపరంగా పొరపాటు జరిగి ఉండవచ్చని అంచనా ఉండవచ్చని అన్నారు. ఏ ఒక్క రైతు కూడా అధైర్యపవద్దని ఈ నెల చివరి వరకు బ్యాంకుల దగ్గర జరిగిన పొరపాటును సవరించడం జరుగుతుందన్నారు. రాష్ట్రంలో ఒక బ్యాంకు వద్ద రైతు పేర్లు నమోదు జరగలేదని తనకు తెలిసిందన్నారు. రెండు లక్షల రూపాయల రుణమాఫీని బిఆర్ఎస్ పార్టీ నాయకులు జీర్ణించుకోలేకపోతున్నారని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాట ఇచ్చిన ప్రకారంగా లక్ష వరకు ఒకసారి, లక్షన్నర వరకు ఒకసారి, రెండవ సారి ఈనెల 15లోపల రెండు లక్షల రూపాయల రుణమాఫీ జరుగుతుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాటకు కట్టుబడి ఉందని, ఆరు గ్యారంటీలను అమలు పరచడంలో నిమగ్నం కావడం జరుగుతుందన్నారు. ప్రాజెక్టుల పేరిట బిఆర్ఎస్ పార్టీ దోపిడి చేసిందని ఈ దోపిడిని ప్రజలలో ఎండగతామన్నారు. సామాన్య ప్రజానీకానికి మేలు చేసే విధంగా ఈ ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. బిఆర్ఎస్ పార్టీ అధికారం కోల్పోయిన తరువాత మతిస్థిమితం లేకుండా కొంతమంది సామాన్యులను రెచ్చగొట్టడం జరుగుతుందన్నారు. అప్పుడు కూడా తెలంగాణ ఉద్యమంలో ఇలాగే రెచ్చగొట్టి కొంతమంది జీవితాలు త్యాగం చేయడం జరిగిందన్నారు. అలాంటి వారికి కూడా ఈ ప్రభుత్వం న్యాయం చేయాలని తాను ప్రభుత్వాన్ని, ముఖ్యమంత్రిని వేడుకుంటున్నానని తెలిపారు. ఈ సమావేశంలో మండల కాంగ్రెస్ అధ్యక్షులు సద్ది లక్ష్మారెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు దొమ్మాటి నర్సయ్య, జిల్లా ఉపాధ్యక్షులు షేక్ గౌస్, జిల్లా కిసాన్ సెల్ ఉపాధ్యక్షులు మర్రి శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు బుగ్గ కృష్ణమూర్తి, గుర్రం రాములు,తిరుపతిగౌడ్ ,నంది కిషన్, గంటా బుచ్చాగౌడ్, చెన్నిబాబులు పాల్గొన్నారు.



# పలు విభాగాలను పరిశీలించిన ఆలయ ఈవో..

**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి ఆగస్టు 11 (జనంసాక్షి):**

శ్రావణ మాసం ఆదివారం కావడంతో రాజన్న ఆలయంలో భక్తుల రద్దీ అధికంగా వుంది. ఇటీవల కాలంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆలయ ఉద్యోగులు బదిలీలు కావడంతో వివిధ ఆలయాల నుండి రాజన్నలయానికి బదిలీపై వచ్చిన వారికి పూర్తిస్థాయి బాధ్యతలు అప్పగించలేదు. భక్తుల రద్దీ అధికంగా ఉండడంతో ఆలయ ఈవో వినోద్ రెడ్డి పలు విభాగాలను పరిశీలించాడు. ఆలయ పిఆర్ఓ కార్యాలయం, క్యూలైన్లు, కేశఖండనం తదితర ప్రాంతాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆలయ ఈఓ మాట్లాడుతూ భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. వివిధ ప్రాంతాల నుండి బదిలీపై వచ్చిన ఆలయ ఉద్యోగులకు రెండు మూడు రోజులలోగా పూర్తిస్థాయి బాధ్యతలు అప్పగిస్తామన్నారు. ఆయన వెంట ఎస్పీఎఫ్ ఏఎస్ఐ కరన్ సింగ్ పాల్గొన్నారు.

# రాంనగర్ లో తల్లిపాల వారోత్సవాలు..

**గోదావరిఖని, జనం సాక్షి:**

స్థానిక రాంనగర్ 2(1)లో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు.ఈ సందర్భాన్ని పురస్కరించుకొని సీ మంతాలు చేశారు.అన్నప్రాసన చేశారు.పిల్లలకు అక్షరాభ్యాసం చేయించారు.ఈ కార్యక్రమంలో జమునా, కే.జ్యోతి, కే.రమణ, పీ.స్వప్న, వి.ప్రేమలత, డాక్టర్ శ్రీవాణి, ఏ ఎన్ ఎంలు, ఆశ వర్కర్స్, హెల్పర్స్, ఆర్ పిలు, గర్భిణులు,తదితరులు పాల్గొన్నారు.

# కాంట్రాక్టు కార్మికులకు 30 లక్షల ప్రమాద బీమా సౌకర్యాన్ని అన్ని బ్యాంకులకు వర్తింపజేయాలి..

- మెడికల్ టెస్ట్ ల పేరుతో కాంట్రాక్టు కార్మికులను వేధింపులకు గురి చేయొద్దు..
- సిఎంపిఎఫ్ స్లిప్ లు ఇవ్వాలి..
- కార్మికుల జీతాల నుంచి రికవరీ చేసిన సిఎంపిఎఫ్ డబ్బులను డిపాజిట్ చేయాలి..
- సింగరేణి కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అక్బర్ అలీ..

**గోదావరిఖని,జనం సాక్షి:**

సింగరేణి లో పని చేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు 30 లక్షల ప్రమాద బీమా సౌకర్యాన్ని ప్రవేశ పెట్టిన యాజమాన్యం కు అభినందనలు తెలుపుతున్నామని సింగరేణి కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ ఏఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అక్బర్ అలీ పేర్కొన్నారు. ఆదివారం గోదావరిఖని భాస్కర్ రావు భవన్ లో జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ సింగరేణి లో పని చేస్తున్న కాంట్రాక్ట్ కార్మికుల కు 30 లక్షల ప్రమాద బీమా సౌకర్యాన్ని యాజమాన్యం ప్రవేశపెట్టినందుకు కాంట్రాక్టు కార్మికులు హర్షం వ్యక్తం చేస్తున్నారని, కాని ఇట్టి సౌకర్యం కేవలం హెచ్.డి.ఎఫ్.సి బ్యాంకు లో ఖాతా ఉన్న కాంట్రాక్టు కార్మికుల కు వర్తిస్తుందని యాజమాన్యం పేర్కొనడం సరిగా లేదని, దీని వల్ల ఈ బ్యాంకు లో ఖాతా లేని వారికి తీవ్ర నష్టం జరుగుతుందని ఆయన అన్నారు, కనుక ఇది అన్ని బ్యాంకుల లో ఖాతా ఉన్న కాంట్రాక్టు కార్మికుల కు ఇట్టి ప్రమాద బీమా సౌకర్యాన్ని వర్తించే విధంగా యాజమాన్యం చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. అదేవిధంగా సింగరేణి లో పని చేస్తున్న కాంట్రాక్ట్ కార్మికుల ను మెడికల్ టెస్ట్ ల పేరుతో వేదింపులకు గురి చేస్తున్నారని ఆయన ఆరోపించారు. కంపెనీ లో పని చేస్తున్న పర్మనెంట్ కార్మికులు తీవ్ర అనారోగ్యాలకు గురైన వారు, ప్రమాదాల్లో గాయపడ్డ వారు కాళ్ళు, చేతులు విరిగి, కండ్లు కనపడక, చెవులు వినపడక సరిగా విధులు నిర్వహించలేని వారిని మెడికల్ అన్ ఫిట్ చేయమంటే చేయకుండా యాజమాన్యం ఊడిచె పని, తుడిచే పని చేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులను మెడికల్ టెస్ట్ ల పేరుతో పని లో నుండి తీసెస్తామని బెదిరింపు లకు గురి చేయడం సరైంది కాదని, ఇట్టి విధానాన్ని మానుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. అదేవిధంగా సింగరేణి లో పని చేస్తున్న కాంట్రాక్ట్ కార్మికుల కు ఇంత వరకు




సి.ఎం.పి.ఎఫ్ చిట్టీలు ఇవ్వలేదని, కొంత మంది కి సిఎంపిఎఫ్ రికవరీ ఐనా డిపాజిట్ చేయలేదని ఆయన ఆరోపించారు. ఇప్పటికైనా యాజమాన్యం స్పందించి కాంట్రాక్టు కార్మికుల కు సి.ఎం.పి.ఎఫ్ చిట్టీలు ఇవ్వాలని, అదేవిధంగా చాలీచాలని జీతంతో పని చేస్తున్న కాంట్రాక్ట్ కార్మికుల కు హైపవర్ కమిటీ వేతనాలు చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. ఇంకా ఈ సమావేశంలో ఏఐటియుసి నగర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం.ఎ.గౌస్, ఏఐటియుసి ప్రజా సంఘాల నాయకులు కందుకూరి రాజారత్నం, మద్దెల దినేష్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

# హుజురాబాద్ ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి విమర్శించడం సరికాదు

## మండల కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు ఎండీ సాహెబ్ హుస్సేన్



**వీణవంక ఆగస్టు 11(జనంసాక్షి)**

వీణవంక తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.కొంతమంది మంత్రులు ఇటీవల అమెరికా పర్యటనలో భాగంగా అమెరికాలో ఎనిమిది రోజులు దక్షణ కొరియాలో రెండు రోజులు పర్యటించి సుమారు అమెరికా ప్రతినిధులతో 52 సమావేశాలకు హాజరై తెలంగాణ రాష్ట్రానికి సుమారు 50వేల కోట్ల రూపాయల పెట్టుబడులే లక్ష్యంగా పెట్టుకొని ప్రధానమైన కంపెనీ అయినటువంట కార్గిజెంట్ హైటీ కంపెనీ కావచ్చు. వాష్ కర్ర హెూల్డింగ్స్ ప్రముఖ కంపెనీలతో సమావేశమై రాష్ట్రానికి పెట్టుబడులను ఆహ్వానించడం జరిగింది.ఈ అమెరికా కంపెనీలు ఏర్పడడం వలన తెలంగాణలో ఉన్నటువంటి 50 వేల యువకులకు నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కలుగుతాయనిఅదేవిధంగా దక్షణ కొరియాలోని ఎల్ జి సంసంగ్ ప్రముఖ కంపెనీల తో ఒప్పందం ఏర్పరచుకొని దేశంలో ఉన్నటువంటి అగ్ర కంపెనీలను తెలంగాణలో ఏర్పాటు చేసి చైనాతో పోటీపడే విధంగా అభివృద్ధి సాధించడం లక్ష్యంగా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి. బృందం వివిధ కంపెనీల సీఈఓ లు వ్యాపారవేత లతో చర్చలు జరుపుతున్నారని ఇది తెలంగాణ నిరుద్యోగులకు బంగారు భవిష్యత్తుకు బాటలు వెయ్యడానికే చర్చలు జరుగుతున్నాయని ఇలాంటి విషయాలకు సానుకూలంగా స్పందించడమే కాకుండా రేవంత్ రెడ్డి బృందానికి విమర్శించడం సరికాదు అని కాంగ్రెస్ పార్టీ మండల సీనియర్ నాయకుడు ఎండీ సాహెబ్ హుస్సేన్ అన్నారు.

# నేర రహిత పట్టణంగా తీర్చిదిద్దడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

## డీఎస్పీ శివరాం రెడ్డి



**నల్గొండటౌన్, ఆగస్టు 11 (జనంసాక్షి):**

జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ ఆదేశానుసారం నల్గొండ పట్టణంలో పది బృందాలతో నాకాబంది కార్యక్రమం నిర్వహించడం జరిగింది. నెంబర్లు ప్లేట్లు లేని, మైనర్ డ్రైవింగ్ మరియు డ్రంక్ అండ్ డ్రైవ్‌లలో మొత్తం 6 కార్లు, 2 ఆటోలు మరియు 44 ద్విచక్రవాహనాలు స్వాధీనం చేసుకోవడం జరిగింది. అలాగే, బహిరంగ ప్రదేశాలలో మద్యం తాగే వారి పట్ల 54 కేసులు నమోదు చేయడం జరిగింది. అనంతరం వారికి వన్ టౌన్ పోలీస్ స్టేషన్ సిఐ రాజశేఖర్ రెడ్డి, టూ టౌన్ సిఐ డేనియల్ సమక్షంలో కౌన్సిలింగ్ చేయడం జరిగింది. ఇప్పుడు పట్టుబడిన ప్రతి ఒక్కరి సమాచారం ఆన్లైన్లో నమోదు చేయబడుతుందని, మళ్లీ అదే నేరంతో దొరికితే జైలుకు పంపబడుతుందని హెచ్చరించడం జరిగింది. అలాగే, వెహికల్ చెకింగ్ నిర్వహించేటప్పుడు ఇకనుండి స్నైపర్ డాగ్‌తో గంజాయి మరియు ఇతర నిషేధిత పదార్థాలను చెక్ చేయించడం జరుగుతుందని తెలిపారు.

# సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

**చిట్యాల ఆగస్టు 11(జనంసాక్షి):**



సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో పెద్దకాపర్తి గ్రామ లబ్ధిదారులకు ఆదివారం నకిరేకల్ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే వేముల వీరేశం చేతుల మీదుగా చెక్కుల పంపిణీ చేశారు ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కాట%శీ% వెంకటేశం , చిట్యాల మండల పార్టీ అధ్యక్షులు గుడిపాటి లక్ష్మీ నరసింహ, కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు నీలకంఠ%శీ% లింగస్వామి, శిరసు ప్రభాకర్, పొట్లపల్లి ఆంజనేయులు, లబ్ధిదారులు గుజ్జరి యాదగిరి, పొట్లపల్లి మౌనిక, బడే యాదగిరి, ఓర్సు పద్మ, పొట్లపల్లి సుప్రియ తదితరులు పాల్గొన్నారు.

# భారత మాజీ కెప్టెన్‌పై చీటింగ్ కేసు

### గడువు విధించిన బీసీసీఐ

భారత మాజీ కెప్టెన్ మహేంద్ర సింగ్ ధోనీ ఐపీఎల్ కెరీర్‌పై చర్చ నడుస్తున్న సమయంలో అభిమానులకు ఓ షాకింగ్ న్యూస్. మహీ భాయ్‌పై రూ.15 కోట్ల చీటింగ్ కేసు నమోదైంది. దాంతో, ఈ కేసుపై అభిప్రాయం తెలపాల్సిందిగా ఆదివారం భారత క్రికెట్ నియంత్రణ మండలి మహీ భాయ్‌ను కోరింది. బీసీసీఐకి చెందిన ఎథిక్స్ కమిటీ ధోనీకి ఆగస్టు 30వ తేదీ వరకూ గడువు విధించింది. ఉత్తరప్రదేశ్‌లోని అమేథికి చెందిన రాజేశ్ కుమార్ మౌర్య అనే వ్యక్తి ధోనీ తనను రూ. 15 కోట్లు మోసగించాడని బీసీసీఐకి ఫిర్యాదు చేశాడు. బీసీసీఐ ఎథిక్స్ కమిటీ నిబంధన 36 కింద ఆ కేసును రిజిష్టర్ చేసుకుంది. మిహిరా దివాకర్ అనే వ్యక్తిపై ధోనీ పెట్టిన రూ.15 కోట్ల స్కామ్ కేసుకు దీనికి సంబంధం ఉంది. దాంతో, మహీని రాజేశ్ కుమార్ నమోదు చేసిన ఫిర్యాదుపై స్పందించాల్సింది బీసీసీఐ కోరింది.




### క్రికెట్ అకాడమీ పేరుతో..

ధోనీ పేరుతో క్రికెట్ అకాడమీ నడిపేందుకు అర్కా స్పోర్ట్స్ మేనేజ్‌మెంట్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ 2021లో మహీతో ఒప్పందం చేసుకుంది. అయితే.. అగ్రిమెంట్ ప్రకారం ధోనీకి రావాల్సిన డబ్బును అర్కా కంపెనీ యజమాని సౌమ్యా దాస్ (%యాశీబఎఖు ఖుం%) ఇవ్వలేదు. భారత మాజీ సారథికి అతడు దాదాపు రూ.15 కోట్లు టోకరా వేశాడు. దాంతో, ధోనీ రాంచీ సివిల్ కోర్టులో సౌమ్యాపై కేసు వేశాడు. ఇప్పుడు రాజేశ్ కుమార్ ధోనీనే తమను మోసం చేశాడంటూ బీసీసీఐకి ఫిర్యాదు చేయడం గమనార్హం. ఐపీఎల్ 17వ సీజన్‌లో చెన్నై సూపర్ కింగ్స్ కెప్టెన్సీ నుంచి వైదొలిగిన ధోనీ ఫినిషర్‌గా అదరగొట్టాడు. అయితే.. ఐపీఎల్‌కు వీడ్కోలు పలుకుతాడనే వార్తల నేపథ్యంలో 18వ సీజన్‌లో మహీ ఆడడంపై సందేహాలు నెలకొన్నాయి. వచ్చే ఏడాది ఐపీఎల్ మెగా వేలం ఉంది. అందుకని ధోనీని అన్‌క్యాప్డ్ ప్లేయర్‌గా కొనసాగించాలా? అనే విషయమై సీఎస్కే యాజమాన్యం తర్జనభర్జన పడుతోంది.

# అమెరికా స్కేట్‌బోర్డర్‌కు కొత్త మెడల్..!

ఒలింపిక్స్‌లో నాసిరకం పతకాలు ఇస్తున్నారంటూ పారిస్ పరువు తీసిన ఓ అథ్లెట్‌కు కొత్త మెడల్ దక్కింది. అమెరికా స్కేట్‌బోర్డ్ ఆటగాడు నిజయ్ హ్యూస్టన్‌కు విశ్వక్రీడల నిర్వాహకులు మరో మెడల్ ఇచ్చారు. అసలేం జరిగిందంటే..? జూలై 29న జరిగిన స్కేట్ బోర్డ్ పోటీల్లో హ్యూస్టన్ కాంస్యం గెలిచాడు. అయితే వారం రోజులకే ఆ పతకం రంగు వెలిసిపోవడం గమనించిన అతడు సోషల్‌మీడియాలో ఓ పోస్ట్ పెట్టాడు. దాంతో ఒలింపిక్ నిర్వాహకులు అతడికి మరొక కాంస్యాన్ని ఇచ్చారు. 'ఒలింపిక్ మెడల్స్ అథ్లెట్లకు ఎంతో విలువైనవి. దెబ్బతిన్న పతకాలను మోన్ని డి పారిస్ స్వీకరిస్తుంది. వాటిని కొత్త వాటిలా మార్చి అథ్లెట్లకు ఇస్తుంది' అని విశ్వ క్రీడల నిర్వాహకులు ఓ ప్రకటనలో తెలిపారు. 'ఒలింపిక్ మెడల్స్ కొత్తగా ఉన్నప్పుడు మెరిసిపోతాయి. కానీ, అవి నా చర్మం మీద చెమటకు తడిసి, నా స్నేహితులు వాటిని మెడలో వేసుకున్నాక రంగు తేలిపోయి పాతవాటిలా మారుతాయి. అందరూ అనుకుంటున్నట్టు ఒలింపిక్ మెడల్స్ నాణ్యమైనవి కావు. చూడండి ఈ మెడల్ ఎంత గరుకుగా మారిందో. ముందు భాగం కూడా దెబ్బతిన్నది' అని హ్యూస్టన్ తన ఇన్‌స్టా పోస్ట్‌లో రాశాడు.

# భారత్‌కు పోటీగా ఈజిప్ట్



కూడా ఒలింపిక్స్ నిర్వహించేందుకు ఉత్సాహం చూపిస్తోంది. ఒలింపిక్స్ 2036, 2040 ఆతిథ్యం కోసం ఈజిప్ట్ బిడ్డింగ్ వేయనుందని ఆదివారం ఆఫ్రికన్ నేషనల్ ఒలింపిక్ కమిటీస్ అసోసియేషన్ వెల్లడించింది. ఈ ఆఫ్రికా దేశం భారత్‌కు ప్రధాన పోటీదారుగా మారనుంది.

### ఒలింపిక్స్ హక్కులు ఎవరికో..?

పారిస్ ఒలింపిక్స్ ముగింపు వేడుకలు మరికాసేపట్లో షురూ కానున్నాయి. మరో నాలుగేండ్ల తర్వాత మళ్లీ విశ్వ క్రీడా సంబురం మొదలవ్వనుంది. 2028లో జరుగనున్న ఆ ఒలింపిక్స్‌కు అమెరికాలోని లాస్ ఏంజిల్స్ ఆతిథ్యం ఇవ్వనుంది. అనంతరం 2032 హక్కులు ఆస్ట్రేలియాలోని బ్రిస్బేన్ సిటీ దక్కించుకుంది. 2036 విశ్వ క్రీడలకు ఆతిథ్యమిచ్చేందుకు భారత్ సిద్ధంగా ఉన్న విషయం తెలిసిందే. ఇప్పుడు ఈజిప్ట్ ఇప్పటివరకూ ఆఫ్రికా ఖండంలోని ఏ దేశం కూడా ఒలింపిక్స్‌కు ఆతిథ్యమివ్వలేదు. 2008లో కైరో కొద్దిలో చాన్స్ కోల్పోయింది. దాంతో, విశ్వ క్రీడలకు అవసరమైన వసుతులపై ఈజిప్ట్ దృష్టి పెట్టింది. వందల కోట్ల రూపాయలు ఖర్చు చేసి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లు ఏర్పాట్లు చేస్తోంది. ఇప్పటికే భారత్‌తో పాటు సౌదీ అరేబియా, ఇండోనేషియా, ఖతర్‌లు 2036 ఒలింపిక్ హక్కుల కోసం బిడ్డింగ్ వేయాలనే పట్టుదలతో ఉన్నాయి. అయితే.. ఆతిథ్యమిచ్చే దేశం మరికొన్ని రోజుల్లో తేలనుంది.

# వాళ్ల ఆలోచనలు మారుస్తా..!

### వివాదాస్పద బాక్సర్ ఇమనె

ఒలింపిక్స్‌లో వివాదాస్పద బాక్సర్ ఇమనె ఖలిఫ్ విమర్శకులకు తన పంచ్‌తోనే సమాధానమిచ్చింది. విశ్వ క్రీడల ఆసాంతం 'పురుష బాక్సర్' అనే అపవాదు ఎదుర్కొన్న ఆమె బాక్సింగ్‌లో అల్జీరియాకు తొలి స్వర్ణం అందించింది. అనంతరం తాను మహిళనే అని అందరికీ మరోసారి చెప్తూ భోరున కన్నీళు పెట్టుకుంది. ఒలింపిక్స్‌లో తన లక్ష్యం పూర్తికావడంతో ఇమనె విమర్శకులకు బుద్ధి చెప్పేందుకు సిద్దమైంది. విశ్వ క్రీడల సమయంలో తనపై ఆన్‌లైన్‌లో వేధింపులకు పాల్పడిన వాళ్లపై ఆమె కేసు పెట్టింది. వాళ్ల ఆలోచనలు మార్చాలనుకుంటున్నా అని ఇమనె చెప్పింది. 'పారిస్ ఒలింపిక్స్ సమయంలో సోషల్ మీడియాలో నాపై వచ్చిన వార్తలు అనైతికమైనవి. అందుకనే వాళ్లను న్యాయ పోరాటంతో ఎదుర్కోవాలని భావిస్తున్నా. ప్రపంచంలోని అలాంటివాళ్ల ఆలోచనలు మార్చాలని అనుకుంటున్నా' అని ఇమనె వెల్లడించింది.

### లింగ పరీక్షలో ఫెయిల్

నిరుడు ప్రపంచ చాంపియన్‌షిప్స్ ముందు నిర్వహించిన లింగ పరీక్షలో ఇమనె ఫెయిల్ అయింది. ఆమెలో టెస్టోస్టిరాన్ హార్మోన్ లక్షణాలు అధికంగా ఉండడంతో అమ్మాయిల విభాగంలో పోటీ పడేందుకు నిర్వాహకులు అనుమతించలేదు. కానీ, ఐఓసీ మాత్రం ఖలిఫ్‌ను పారిస్ ఒలింపిక్స్‌లో ఆడేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఒలింపిక్స్‌లో 66వ కిలోల విభాగంలో పోటీ పడిన ఇమనె తొలి బౌట్ నుంచే ప్రత్యర్థులను బెంబేలెత్తించింది. ఏడు అడుగుల ఎత్తు ఉండే ఇమనె పంచ్ ధాటికి రింగ్‌లో ఎవరూ నిలువలేకపోయారు. అయితే.. 16వ రౌండ్ మ్యాచ్‌లో ఇమనె ఖలిఫ్ కేవలం 46 సెకన్లలోనే ఇటలీ బాక్సర్‌ను యాంజెల కరినిని ఓడించింది. దాంతో, రింగ్‌లో తనను ఓ అబ్బాయి కొడుతున్నాడని, ఖలిఫ్ అమ్మాయి కాదని యాంజెల వాపోయింది. అంతేకాదు ఇక తాను ఫైట్ చేయలేనంటూ ఆమె వైదొలిగిన విషయం తెలిసిందే. అక్కడితో



అల్జీరియా బాక్సర్‌పై అందరికి సందేహం ఏర్పడింది. పురుష లక్షణాలున్న ఖలిఫ్‌ను అమ్మాయిల బౌట్‌లో ఎలా అనుమతించారు? అని యావత్ ప్రపంచం ఐఓసీని ప్రశ్నించింది.

# వినేశ్ ఫోగట్‌కు గోల్డ్ మెడల్

పారిస్ ఒలింపిక్స్‌లో పతకం కోల్పోయిన భారత రెజ్లర్ వినేశ్ ఫోగాట్‌కు స్వదేశంలో భారీ మద్దతు లభిస్తోంది. 100 గ్రాముల అదనపు బరువుతో ఫైనల్ ఆడలేకపోయిన ఆమె అప్పీల్‌పై అర్బిట్రేషన్ కోర్టు తీర్పుపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. వినేశ్‌కు రజతం వస్తుందా? లేదా? అని యావత్ భారతం ఆసక్తిగా ఎదురుచూస్తోంది. అయితే.. విశ్వ క్రీడల్లో విశేషంగా రాణించిన వినేశ్ ఫోగాట్‌కు గోల్డ్ మెడల్ ఇస్తామని హర్యానాకు చెందని ఖాప్ పంచాయతీ ప్రకటించింది. వినేశ్ స్వరాష్ట్రమైన హర్యానాలోని ఖాప్ పంచాయతీల్లో ఒకటైన నందాల్ ఆమెకు పసిడి పతకాన్ని బహూకరించనుంది. నందాల్ పంచాయతీ పెద్ద ఓం ప్రకాశ్ నందాల్ ఈ విషయాన్ని వెల్లడించాడు. 'పారిస్ నుంచి వినేశ్ స్వదేశం రాగానే ఖాప్ పంచాయతీలు ఆమెను సన్మానిస్తాయి. అనంతరం స్వర్ణ పతకంతో ఆమెను సత్కరిస్తాయి' అని ఓం ప్రకాశ్ తెలిపాడు. అంతేకాదు ఒలింపిక్స్‌లో వినేశ్‌ను అనర్హురాలిగా ప్రకటించడంపై విచారణ జరిపించాల్సిందిగా ఆయన రాష్ట్రపతి ద్రౌపది ముర్మును అభ్యర్థించారు. ఒలింపిక్స్ 50 కిలోల విభాగంలో ఫైనల్ చేరిన వినేశ్ ఫోగట్‌కు బుధవారం ఊహించని షాక్ తగిలింది. 100 గ్రాముల అదనపు బరువు కారణంగా నిర్వాహకులు ఆమెను అనర్హురాలిగా ప్రకటించారు. దాంతో, భారమైన హృదయంతో ఆమె రెజ్లింగ్‌కు వీడ్కోలు పలికింది. అనంతరం అడ్ హక్ ప్యానెల్ క్రీడా కోర్టులో తనకు న్యాయం చేయాలని, గురువారం జరుగబోయే ఫైనల్లో తనను అనుమతించాలని అప్పీల్ చేసింది. కానీ, సదరు కోర్టు ఆలస్యంగా స్పందించింది. సీఏసీ అనేది ఒక అంతర్జాతీయ సంస్థ. క్రీడలకు సంబంధించిన వివాదాలను మధ్యవర్తిత్వం ద్వారా పరిష్కరిస్తుంటుంది.

# వన్డేల్లో సెంచరీ కొట్టినా వేటు

భారత క్రికెటర్లలో సంజూ శాంసన్‌కు ప్రతిభలో కొదువ లేదు. కానీ, విధి అతడితో ఆట ఆడకుంటున్నట్టుంది. ఎందుకంటే..? ఇప్పటికే జట్టులో పాతుకుపోవాల్సిన అతడు అడపాదడపా టీమిండియా జెర్సీ వేసుకుంటున్నాడు. అందుకనే కాబోలు శాంసన్ ప్రస్తావన వచ్చినప్పుడల్లా దురదృష్టానికి కేరాఫ్ అని ఎవరైనా చెప్పేస్తారు. టీ20ల్లో దంచికొట్టే సంజూ వన్డేల్లో మాత్రం అవకాశాల్ని అందిపుచ్చుకోలేకపోతున్నాడు. శ్రీలంక పర్యటనతో రాక రాక వచ్చిన అవకాశాన్ని సైతం అందుకోలేక విమర్శలయ్యాడు. వరుసగా మొదటి రెండు వన్డేల్లో సున్నా చుట్టేసి జట్టుతో పాటు కొత్త కోచ్ గౌతం గంభీర్‌ను సైతం తీవ్రంగా నిరాశపరిచాడు. దాంతో, మళ్లీ వన్డే అవకాశం కోసం నిరీక్షించాల్సిన పరిస్థితి తెచ్చుకున్నాడు. ఇదే విషయంపై ఈ పవర్ హిట్టర్ ఏమన్నాడంటే..? లంక పర్యటన తర్వాత స్వదేశం వచ్చిన శాంసన్ ఈమధ్యే కేరళ క్రికెట్ లీగ్ ప్రారంభోత్సవంలో పాల్గొన్నాడు. ఈ సందర్భంగా వన్డేల్లో సెంచరీ కొట్టిన తర్వాత కూడా మిమ్మల్ని ఎందుకు పక్కనపెట్టారు? అనే ప్రశ్న అడిగారు. అందుకు సంజూ నవ్వుతూ ఏం చెప్పాడంటే.. 'నన్ను సెలెక్టర్లు ఎప్పుడు ఎంపిక చేసినా వెళ్లి ఆడుతాను. అంతే. అంతిమంగా ఆరోజు మా జట్టు బాగా ఆడిందా? లేదా? అనేది నాకు ముఖ్యం. ఇక నేను అన్ని విషయాల్ని పాజిటివ్‌గానే చూస్తాను. నాకు సాధ్యమైనంత మేర పోరాడుతాను' అని శాంసన్ తెలిపాడు. ఐపీఎల్‌లో రెచ్చిపోయి ఆడే శాంసన్ వన్డేల్లో మాత్రం ఒక్క శతకం మినహా స్థాయికి తగ్గ ప్రదర్శన చేయలేదు. ఇప్పటివరకూ 16 వన్డేల్లో



510 పరుగులు సాధించాడు. వన్డే వరల్డ్ కప్ తర్వాత దక్షిణాఫ్రికా పర్యటనలో సంజూ కీలక ఇన్నింగ్స్ ఆడాడ. సెంచరీతో చెలరేగాడు. దాంతో, టీమిండియా 78 పరుగులతో గెలుపొంది 2–1తో సిరీస్ కైవసం చేసుకుంది. దాంతో, ఈ కేరళ క్రికెటర్‌కు జట్టులో చోటు ఖాయమని అనుకున్నారంతా. కానీ, సెలెక్టర్లకు ఇంకా అతడిపై నమ్మకం కుదిరినట్టు లేదు. అందకనే కాబోలు తాజాగా శ్రీలంక సిరీస్‌కు రిషభ్ పంత్, కేఎల్ రాహుల్‌లను ఎంపిక చేశారు. దాంతో, సంజూ బ్యాకప్‌గా లంకకు వెళ్లినట్టు అయింది. అయితే.. తొలి రెండు వన్డేల్లో కోచ్ గంభీర్ శాంసన్‌కు చాన్స్ ఇచ్చాడు. కానీ, మనోడు రెండు మ్యాచుల్లో డకౌట్ అయి తీవ్రంగా నిరాశపరిచాడు.




## నేషనల్ మార్ట్ 'గోల్‌మాల్'

- ఒకదానికి డబుల్ బిల్లింగ్
- ఒక్కసారిగా కంగుతిన్న వినియోగదారుడు
- అప్రమత్తం లేకపోతే జేబుల్ ఖాళీ

**సంగారెడ్డి ప్రతినిధి, ఆగస్టు 11, (జనంసాక్షి):** సంగారెడ్డిలో గల ప్రముఖమైన సూపర్ మార్కెట్ లలో ఒకటైన పేరు ప్రఖ్యాతులు కల్గిన నేషనల్ సూపర్ మార్ట్‌లో బిల్లింగ్‌లో అవకతవకలు బయటపడ్డాయి. ఇది గ్రహించిన వినియోగదారుడు ఒక్కసారిగా కంగుతిన్నాడు. అలవాటు ప్రకారం సంగారెడ్డి నివాసి ఇర్ఫాన్ అనే యువకుడు ఆదివారం నాడు వారి ఇంటికి కావాల్సిన వస్తువులు కొనుగోలు చేయుటకు నేషనల్ మార్ట్ సూపర్ మార్కెట్‌కు వెళ్లాడు. అక్కడ అతడికి కావలసిన వస్తువులన్నీ కొనుగోలు చేసి బిల్ కౌంటర్లో డబ్బులు చెల్లించి ఇంటికి తిరిగి వెళ్ళాడు. వెంటనే అక్కడ తీసుకొన్న బిల్ ప్రకారం వస్తువులు ఒక్కొకటి గా చెక్ చేసుకొన్నాడు ఆ క్రమంలో కొన్ని వస్తువులు ఒకటి కొనగా దానికి బదులుగా రెండు సార్లు బిల్లింగ్ జరిగిన పలు సంఘటన అతనికి దిగ్ర్బాంతికి గురిచేసాయి. ఉగ్రరూపం దాల్చిన ఆ యువకుడు వెంటనే ఆ సూపర్ మార్ట్‌కు తిరిగి వెళ్ళాడు. జరిగిన అవకతవకలను తెలియచేసి గట్టిగ నిలదీసాడు వెంటనే సిసి కెమెరాల క్లిప్పింగ్స్ బహిర్గత పర్చాలని డిమాండ్ చేసాడు. జరిగిన తప్పును తెలుసుకొన్న సిబ్బంది అతడికి రెండొవ సారి తప్పుగా వేసిన బిల్ డబ్బులను తిరిగి చెల్లించి, జరిగిన తప్పుకు క్షేమాపణలు కోరడంతో విషయం సద్దుమణిగింది. ఈ విధమైన అవకతవకల వల్ల కొన్ని వందల మంది వినియోగదారులు ఈ రకంగా దగాపడి మోసానికి గురి అవుతున్నారని ఆవేదన వ్యక్తం చేసాడు. ప్రభుత్వ ఉద్యోగులు, జిల్లా యంత్రాంగం నిద్రపోవడం వల్ల ఇలాంటి పరిస్థితులు తలెత్తుతాయని తెలియచేస్తూ, తక్షణమే జిల్లా యంత్రాంగం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసాడు.

## ప్రతి పౌరుడు తన ఇంటి మీద జాతీయ జెండాని ఎగువేయాలి

**సంగారెడ్డిప్రతినిధి, ఆగస్టు 11(జనంసాక్షి)** ప్రతి పౌరుడు తన ఇంటి మీద జాతీయ జెండాని ఎగువేయాలని సంగారెడ్డి బీజేపీ జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం సంగారెడ్డి జిల్లా బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు ప్రవీణ్ అధ్వర్యంలో హార్ గర్ తిరంగా యాత్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి భారతీ యుని ఇంటిపై జాతీయ జెండాను ఎగురవే యవలసిందిగా ప్రతి ఒక్కరి బాధ్యతగా కోరారు. ఈ కార్యక్రమంలో జేవైఎం జాతీయ ప్రధాన కార్యదర్శి రోహిత్ చాహల్, మెదక్ పార్లమెంట్ సభ్యులు మాధవనేని రఘునందన్ రావు, యువమోర్చ రాష్ట్ర అధ్యక్షులు సేవెళ్ల మహేందర్, భారతీయ జనతా పార్టీ నాయకులు, యువమోర్చా నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## జన ఔషధీ కేంద్రాన్ని ప్రారంభించిన ఎంపీ

**మల్కాజిగి,ఆగస్టు11(జనంసాక్షి)** ప్రధానమంత్రి భారతీయ జన ఔషధీ కేంద్రాన్ని భారతీయ జనతా పార్టీ సీనియర్ నాయకులు గోపు రమణారెడ్డి ఆధ్వర్యంలో నేరేడ్ మెట్ డివిజన్ పరిధిలోని మధురానగర్‌లో జన ఔషధీ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి మల్కాజిగిరి ఎంపీ ఈటెల రాజేందర్ ముఖ్యఅతిథిగా హాజరై మల్కాజిగిరి కార్పొరేటర్ శ్రావణ్ కుమార్, వినాయక నగర్ డివిజన్ కార్పొరేటర్ రాజ్యలక్ష్మితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.దేశంలో 12,400 పైగా కేంద్రాలు ఉన్నయని, ఈ కేంద్రాలలో దాదాపు 50 నుండి 90 శాతం మార్కెట్ ధరలు కన్నా నాణ్యత కలిగిన మందులు ,బ్రాండెడ్ తో సమానమైన క్వాలిటీ కలిగి అన్ని పరీక్షలు జరిగిన తర్వాత ఈ కేంద్రాలకు కేంద్ర ప్రభుత్వం ద్వారా మందులు సరఫరా చేయబడుచున్నాయని తెలిపారు. భారతదేశంలో ప్రతి మనిషి డబ్బు లేక ఆరోగ్యం క్షీణించి ప్రాణాలు కోల్పోకూడదని ఉద్దేశ్యంతో మన ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోది గారు ప్రవేశపెట్టిన అనేక పథకాలలో ఒక బ్రహ్మాండమైన పథకం పీఎం బిజెపి ప్రధానమంత్రి భారతీయ జన ఔషధి పరియోజన ఈ పథకం అని గుర్తు చేశారు.భారతీయ జనతా పార్టీ రాష్ట్ర మాజీ సైనికుల విభాగం కన్వీనర్ గోపురమన రెడ్డి మాట్లాడుతూ.. జంట నగరాలలో ఇది 27వ జన ఔషధీ కేంద్రం మధుర నగర్ కాలనీలో ఏర్పాటు చేయడం ఎంతో సంతోషం గా ఉందని ప్రజలకు మరింత సేవ చేయాలని తపన ఉందని, ఒక మాజీ సైనికుడునని సమాజానికి పనిచేయాలని మంచి హృదయంతో పని చేస్తున్నానని తెలిపారు.అతి తక్కువ సరసమైన ధరలో లభిస్తున్న మందులను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ ఎన్ రామచంద్ర రావు,మాజీ మహిళా రాష్ట్ర అధ్యక్షురాలు గీత మూర్తి, సత్యనారాయణ బాబు,ఓం ప్రకాష్, సైనిక్ విహార్ కాలనీ అసోసియేషన్ సభ్యులు అనేక మంది భారతీయ జనతా పార్టీ నాయకులు మహిళలు పాల్గొన్నారు.

# సమస్యలన్నీ పరిష్కరిస్తా..!

- సాగునీటికీ ఇబ్బంది రాకుండా చూస్తా
- లోకల్ బాడీ ఎన్నికలే లక్ష్యంగా పనిచేయాలి
- ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి

**వనపర్తి, ఆగస్టు11 (జనంసాక్షి):** ఇంకో నాలుగు ఐదు రోజులలో సాగునీటి సమస్యలను పరిష్కారం అవుతాయని ,సాగునీటి సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించి సమస్యలను పరిష్కరిస్తున్నామని, ప్రతి ఎకరాకు సాగునీరు అందించే లక్ష్యంగానే పనిచేస్తున్నామని వనపర్తి ఎమ్మెల్యే మేఘా రెడ్డి వెల్లడించారు. ఆదివారం పెద్దమందడి మండలం మంగంపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొని లబ్ధిదారులకు చెక్కులను అందించారు. ఈ సందర్భంగా మేఘారెడ్డి మాట్లాడుతూ..ప్రతి గ్రామానికి ఆర్టీసీ బస్సు సేవలు, ప్రతి మండల కేంద్రానికి ఒక ఇంటిగ్రేటెడ్ ఎడ్యుకేషనల్ హబ్ ఏర్పాటు చేస్తామని అన్నారు. మండల పరిధిలోని ఆయా గ్రామాలకు చెందిన 76 మంది లబ్ధిదారులకు రూ.14,10,000 విలువగల చెక్కులను ఎంఎల్ఏ



లబ్ధిదారులకు అందజేశారు. నియోజకవర్గంలోని ప్రతి గ్రామానికి ఆర్టిసి బస్సు సౌకర్యం ఏర్పాటు చేస్తామని, ఇప్పటికే ఆర్టీసీ బస్సుల విషయమై రవాణా శాఖ మంత్రి గారికి నివేదికలు పంపించి ఉన్నామని, మరో 15 రోజుల్లో ప్రతి గ్రామానికి ఆర్టిసి బస్సుని ఏర్పాటు అయ్యే విధంగా చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే పేర్కొన్నారు.విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని ప్రతి మండలానికి ఒక ఎడ్యుకేషనల్ హబ్బును ఏర్పాటుచేసి నర్సరీ నుంచి డిగ్రీ వరకు నాణ్యవంతమైన ఉచిత విద్య ను అందజేసేందుకు ప్రభుత్వం పనులు ప్రారంభించడానికి త్వరలోనే ప్రతి మండలానికి ఒక ఎడ్యుకేషనల్ హబ్ ఏర్పాటు జరగబోతుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులు పంపిణీ సంబంధించి త్వరలోనే కార్యచరణ ప్రారంభమవుతుందని, అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇండ్లు రేషన్ కార్డులు అందేలా నాయకులు కార్యకర్తలు దృష్టి సారించాలని ఎమ్మెల్యే సూచించారు.రైతు రుణమాఫీకి సంబంధించి అన్నదాతలు ఎలాంటి అధైర్యానికి లోను కాకూడదని, అర్హులైన ప్రతి ఒక్కరికి రుణమాఫీ అందుతుందని, రుణమాఫీ కానీ లబ్ధిదారుల జాబితాను అధికారులకు అందజేయాలని లేదంటే తనకు ఇచ్చిన నేను ప్రత్యేక శ్రద్ధ వహించి రుణమాఫీ అయ్యే విధంగా చర్యలు తీసుకుంటానని ఆయన అన్నదాతలకు భరోసా కల్పించారు. రానున్న లోకల్ బాడీ ఎన్నికలలో ప్రతి గ్రామంలో కాంగ్రెస్ పార్టీకి చెందిన మనవారే ప్రజా ప్రతినిధులుగా ఎన్నికయ్యేల రేపటి నుంచే కార్యకర్తలు గ్రామాలలో ఎన్నికల కార్యచరణ ప్రారంభించాలని ఎమ్మెల్యే సూచించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల సమన్వయకర్త తుడి శ్రీనివాసరెడ్డి, వనపర్తి మార్కెట్ యార్డ్ ఉపాధ్యక్షులు, రామకృష్ణారెడ్డి, మాజీ ఎంపీపీ రఘు ప్రసాద్ మాజీ జెడ్పిటిసి వెంకటస్వామి, మాజీ సర్పంచులు, మాజీ ఎంపిటిసిలు కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## న్యూరో సంబంధిత రోగులకు సువర్ణ అవకాశం

**నిజామాబాద్ బ్యూరో,ఆగస్టు 11(జనంసాక్షి)** న్యూరో ఫిజీషియన్ డాక్టర్ గోవీన్ మంద భవానీ కేర్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ప్రారంభించడం అభినందనీయమని ఐఎంఏ అధ్యక్షులు బి దామోదర్ అన్నారు. ఆదివారం నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని ఖలీల్వాడిలో భారత్ ల్యాబ్ ముందుర శ్రీ భవానీ కేర్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఐఎం ఏ అధ్యక్షులు బి. దామోదర్ రావు. డిఏ, ఐఎంఏ జనరల్ సెక్రెటరీ డాక్టర్ శ్రీశైలం, ఐఎంఏ ట్రెజరర్ డాక్టర్ రాజేంద్రప్రసాద్, తాన అధ్యక్షులు డాక్టర్ ఎస్ శివ ప్రసాద్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నిజామాబాదులోని ఏఐఐఎంఎస్ న్యూరో డాక్టర్ సేవలను వినియోగించుకోవాలని అన్నారు. నిజామాబాదులో అందరికీ అందుబాటులో ఈ హాస్పిటల్‌ను ప్రారంభించడం సంతోషకరం అన్నారు. గ్రామీణ నేపథ్యం కలిగిన డాక్టర్ అయి ఉండి హైదరాబాద్ లాంటి పట్టణాలలో హాస్పిటల్ పెట్టి నిర్వహించే నైపుణ్యం ఉన్నప్పటికీ జిల్లా ప్రజలకు సేవలు అందించాలని నిజామాబాదులో నెలకొల్పడం జిల్లా ప్రజలకు సువర్ణ అవకాశమన్నారు. న్యూరో సంబంధిత రోగులు వైద్య సేవలు వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వేణు, గోపాల్ హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.








## విరబూసిన బ్రహ్మ కమలాలు

**సదాశివపేట ఆగస్టు 11 (జనం సాక్షి) :** చాలా అరుదుగా మాత్రమే పూసే బ్రహ్మకుమాలాలు శ్రావణ శుక్రవారం చూపరులకు కనువిందు చేశాయి. శుక్రవారం అర్ధరాత్రి సదాశివపేట పట్టణానికి చెందిన వెంకటాపురం సత్యనారాయణ, సుజాత గృహంలో ఒకేసారి 24 బ్రహ్మ కమలాలు వికసించాయి. దీంతో ఆ దంపతులు పుష్పాలకు ప్రత్యేక పూజలు చేశారు. ఒకేసారి 24 బ్రహ్మకమాలలు వికసించడంతో ఆనందం వ్యక్తం చేశారు.









## నేను పోలీస్ అధికారిని అని తండ్రికి బెదిరింపు కాల్

- డ్రగ్ అమ్మితే పట్టుకున్నానని బెదిరింపు
- వీడియో కాల్ తో భయపడ్డ తల్లిదండ్రులు




**భైంసా ఆగస్టు 11 (జనంసాక్షి) :** నిర్మల్ జిల్లా,అపరిచిత వ్యక్తుల ఫోన్ కాల్స్ గ్రామీణ ప్రజలను భయపెడుతున్నాయి. నిన్న శనివారం భైంసా మండలం లోని ఇలేగాం గ్రామానికి చెందిన కాంబ్లె వెంకటేష్ కు923126480921 నంబర్ నుండివీడియో కాల్ వచ్చింది. వీడియో కాల్ రాగానే రిసీవ్ చేసుకున్న వ్యక్తికి నీ కూతురు కాంబ్లే శృతి అని డ్రగ్స్ అమ్ముతుంటే పట్టుకున్నానని, పది నిమిషాల్లో నా దగ్గరకు రావాలని బెదిరించాడు. దీంతో తీవ్ర అయోమయానికి గురైన తండ్రి మాట్లాడుతూనే, ఒక్కసారి ఫోన్ కట్ చేసి , పాఠశాలను సంప్రదించగా విద్యార్థి సేఫ్ గా ఉందని తెలుసుకున్న తండ్రి ఊపిరి పీల్చుకున్నాడు. అపరిచిత వ్యక్తుల కాల్స్ వల్ల తెలియని అమాయక ప్రజలుఇబ్బందులు పడుతున్నారు. మాయమాటలు నమ్మి మోసపోతున్నారు. ఇకనైనా ఇటువంటి కాల్స్ వల్ల జాగ్రత్తగా ఉండాలని పోలీసులు సూచిస్తున్నారు.







## ఎయిర్‌పోర్టులో భారీగా బంగారం సీజ్

**హైదరాబాద్, ఆగస్టు 11 (జనంసాక్షి) :** శంషాబాద్ ఎయిర్‌పోర్టులో భారీ మొత్తంలో బంగారం పట్టుబడ్డది. సుమారు 1.4 కిలోల బంగారాన్ని శంషాబాద్ ఎయిర్‌పోర్టులో స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన బంగారం విలువ సుమారు రూ.కోటి వరకు ఉంటుందని డీఆర్ఐ (డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్) అధికారులు తెలిపారు. దుబాయ్ నుంచి హైదరాబాద్‌కు తరలిస్తుండగా.. బంగారం తరలిస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్టు తెలిపిన అధికారులు.. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు వెల్లడించారు.

## విద్యాభివృద్ధికి విరాళాలివ్వడం అభినందనీయం

- రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ్మ



**వనపర్తి, ఆగస్టు11 (జనంసాక్షి):** ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల ఏర్పాటుకు ఇతోధికంగా విరాళాలు ఇచ్చి విద్యాభివృద్ధికి తోడ్పాటును అందించడం అభినందనీయమని రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ, ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా ఇన్చార్జ్ మంత్రి దామోదర రాజ నర్సింహ కొనియాడారు .అన్ని దానాల్లో కెల్ల విద్యాదానం చాల గొప్పదని, సామాజిక స్పృహతో విరాళం ఇచ్చి అన్ని సౌకర్యాలతో కోన్నూర్ గ్రామంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల నిర్మించడం అభినందనీయమని రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ, జిల్లా ఇన్చార్జి మంత్రి దామోదర రాజ నర్సింహ అన్నారు.రాష్ట్రంలో అన్ని పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించేందుకు అమ్మ, ఆదర్శ పాఠశాల కింద నిధులు మంజూరు చేసి పనులు పూర్తి చేయించడం జరిగిందన్నారు. ఉపాధ్యాయులకు పదోన్నతులపాటు బదిలీలు పారదర్శకంగా నిర్వహించడం జరిగిందన్నారు. ప్రభుత్వ ఇచ్చిన అన్ని హామీలు నెరవేర్చడం జరుగుతుందని మంత్రి అన్నారు. ఆదివారం వనపర్తి జిల్లా, దేవరకద్ర నియోజకవర్గంలోని వనపర్తి రోడ్ (మదనాపూర్) మార్కెట్ యార్డు నూతన పాలక వర్గ ప్రమాణ స్వీకారోత్సవంలో మంత్రి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. నూతన చైర్మన్‌గా పల్లే పాగు ప్రశాంత్ రెడ్డి, వైస్ చైర్మన్ కే.తిరుపతి రెడ్డి తో పాటు కమిటీ సభ్యుల చేత జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి స్వరన్ సింగ్ ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం మదనాపురం మండలం కొన్నూరు గ్రామంలో రూ. 2.18 కోట్ల వ్యయంతో నిర్మించిన 33/11 కే.వి. సబ్ స్టేషన్ ను ప్రారంభోత్సవం చేశారు. అదే గ్రామంలో రూ. 20 లక్షల వ్యయంతో నిర్మించిన నూతన ఆరోగ్య సబ్ సెంటర్ ను ప్రారంభించారు. రూ. 20 లక్షల వ్యయంతో నిర్మించిన నూతన గ్రామ పంచాయతీ భవనంతో పాటు కార్పొరేట్ స్థాయిలో నిర్మించిన ప్రభుత్వ ఉన్నత, ప్రాథమిక పాఠశాల భవనానికి ప్రారంభోత్సవం చేశారు. కొన్నూరు ఉన్నత, ప్రాథమిక పాఠశాల ను దాదాపు రూ. 1.5 కోట్ల వ్యయంతో అన్ని మౌలిక సదుపాయాలతో కార్పొరేట్ స్థాయిలో ఆధునికంగా నిర్మించగా అందులో మన ఊరు మనబడి కార్యక్రమం కింద ఉన్నత పాఠశాలలకు రూ. 54.34 లక్షలు, ప్రాథమిక పాఠశాలకు రూ. 8.77 లక్షలు మంజూరు చేయగా మిగిలిన మొత్తం స్థానిక ఎంపిటిసి శరత్ రెడ్డి విరాళంగా ఇచ్చారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మంత్రి మాట్లాడుతూ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తో పాటు ప్రాథమిక పాఠశాల, రెండు అంగన్వాడీ కేంద్రాలు ఒకే చోట నిర్వహించే విధంగా నిర్మాణం చేయడం అపురూపంగా ఉందన్నారు. కొన్నూర్ గ్రామంలో సకల సౌలతులతో కూడిన సరస్వతి ఆలయం ఏర్పడిందని పాఠశాలను అభివర్ణించారు. విద్యార్థులతో ముచ్చటించారు. బన్నీ అనే విద్యార్థిని ను పెద్ద అయ్యాక ఎంచేయాలనుకున్నావు అని ప్రశ్నించారు. నేను ఏం.ఎల్. ఏ అవ్వాలని ఉంది అని అనటంతో మంత్రి ప్రశంసించారు. ఇంకో అమ్మాయి కలెక్టర్ కావాలని ఉందని, ఇంకొకరు ఎప్సి కావాలని ఉందని సమాధానం చెప్పడంతో కొన్నుర్ గ్రామ ప్రజలు ప్రజాసేవను ఆదర్శంగా తీసుకుంటున్నారని ప్రశంసించారు. దేవరకద్ర శాసనసభ్యులు జి .మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ పాఠశాల నిర్మాణానికి పెద్ద మనసుతో నిధులు విరాళం చేసిన శరత్ రెడ్డి, కొండా రెడ్డి లను అభినందించారు.కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి, డి. ఈ. ఓ గోవిందరాజులు, పంచాయతీ రాజ్ కార్యనిర్వహక ఇంజనీరు మల్లయ్య, ఎంపీటీసీ శరత్ రెడ్డి, ప్రధానోపాధ్యాయులు, ఉపాద్యాయులు, ప్రజాప్రతినిధులు, విద్యార్థులు పాల్గొన్నారు.



## డిండి, ఎస్ఎల్‌బిసిలను పూర్తి చేస్తాం

- రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి



**దేవరకొండ ఆగష్టు 11 (జనం సాక్షి) :** నల్గొండ జిల్లా దేవరకొండ నియోజకవర్గం పరిధిలో చేపట్టిన డిండి లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టుతో పాటు, ఎస్ ఎల్ బి సి సొరంగం పనులనుపూర్తి చేసి తీరుతామని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి అన్నారు.ఒకరోజు నల్గొండ జిల్లా పర్యటనలో భాగంగా ఆదివారం ఆయన ముందుగా అడవిదేవులపల్లి మండలం ,చిట్యాల వద్ద దున్నపోతుల గండి ఎత్తిపోతల పథకంపై సమీక్షించి,అనంతరం హెలికాప్టర్లో డిండి చేరుకొని సాంఘిక సంక్షేమ రెసిడెన్షియల్ పాఠశాలలో జిల్లాలోని దేవరకొండ నియోజకవర్గం తో పాటు,మునుగోడు ఇతర నియోజకవర్గాలలో చేపట్టిన ప్రాజెక్టుల పనులపై జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి, స్థానిక శాసనసభ్యులు బాలు నాయక్, మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, ఇరిగేషన్ ఇంజనీరింగ్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. తమ ప్రభుత్వ హాయంలో ఎట్టి పరిస్థితులలో ఎస్ ఎల్ బి సి సొరంగం పనులను, డిండి ప్రాజక్ట్ ను పూర్తిచేస్తామని అన్నారు. ఎస్ఎల్‌బిసి టన్నెల్ నిర్మాణంలో ఒక వైపు నుంచి ఒక రకమైన సమస్య ఉంటే మరోవైపు నుంచి ఇంకో సమస్య ఉందని, అయినప్పటికీ సమస్యలన్నీ తీరుస్తూ ఎట్టి పరిస్థితుల్లో నిర్మాణాన్ని పూర్తి చేస్తామని తెలిపారు. ఎస్ ఎల్ బి సి సొరంగ మార్గం పూర్తి చేయడానికి 460 కోట్లతో రివైజ్డ్ ఎస్టిమేషన్స్ వేసి మంజూరుకు క్యాబినెట్ ముందుకు తీసుకెళ్ళామన్నారు. డిండి లిఫ్ట్ ఇరిగేషన్ పథకం ద్వారా మూడున్నర లక్షల ఎకరాలకు సాగు నీరు అందించడానికి ముందుకు వెళ్తున్నామని తెలిపారు. దేవరకొండ నియోజకవర్గం లో మంజూరై ఉన్న అంబాభవాని, కంబాలపల్లి లిఫ్ట్ ఇరిగేషన్ పథకాలను పూర్తి చేస్తామని చెప్పారు.

దేవరకొండ శాసనసభ్యులు బాలు నాయక్ మాట్లాడుతూ ఐదేళ్ల కాలంలో డిండి, ఎస్ఎల్బీసీ నిర్మాణాన్ని పూర్తి చేయాలని కోరారు. సింగరాయపల్లి ప్రాజెక్టుకు 119 కోట్లు మంజూరు అయ్యాయని, 93 కోట్ల రూపాయలు విడుదల అయ్యాయని ,80 శాతం పనులు పూర్తయ్యాయని, కేవలం 20% పనులు మాత్రమే పెండింగ్లో ఉన్నందున వెంటనే వాటిని పూర్తి చేయాల్సిందిగా మంత్రికి విజ్ఞప్తి చేశారు. గొట్టిముక్కల ప్రాజక్ట్ దాదాపు పూర్తయిందని, మూడున్నర ఎకరాలకు సంబంధించి భూసేకరణ సమస్య ఉందని, అలాగే రోడ్డు సమస్య ఉందని వాటిని పరిష్కరించాలని మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. చింతపల్లి రిజర్వాయర్ భూ సేకరణ సమస్య వల్ల పనులు ముందుకు సాగట్లేదని తెలుపగా మంత్రి మాట్లాడుతూ సమస్యను పరిష్కరించేందుకు ప్రత్యామ్నాయ మార్గాలు చూడాలని జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డిని ఆదేశించారు. డిండి లిఫ్ట్ ఇరిగేషన్, ఎస్ఎల్బిసి పనులపై ప్రతి నెల సమీక్షించాలని శాసనసభ్యులు మంత్రికి విజ్ఞప్తి చేశారు.

మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి మాట్లాడుతూ ప్రాజెక్టుల్లో భూములు కోల్పోయిన , కిష్టరాంపల్లి, చర్లగూడెం రిజర్వాయర్ల కింద భూములు కోల్పోయిన నిర్వాసితులకు ఇబ్రహీంపట్నం వద్ద భూ నిర్వాసితులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని కోరారు. ప్రపంచంలోనే అత్యధిక ఫ్లోరైడ్ ఉన్న ప్రాంతం మునుగోడు నియోజకవర్గమని, ఎస్-ఎల్‌బిసి, డిండి ఎత్తిపోతల పథకాలు పూర్తి చేస్తామని మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి చెప్పడం చాలా అభినందనీయమని అన్నారు. డిండి ఎత్తి పోతల పథకంలో కిష్టరాంపల్లి, చర్ల గూడెం ప్రాజెక్టులు చాలా పెద్దవని,ఈ రెండు ప్రాజెక్టుల కింద భూములు కోల్పోయిన నిర్వాసితులకు 2018 లో 4, 5 లక్షలు మాత్రమే పరిహారం అందిందని, కనీసం ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీలో న్యాయం చేయాలన్నారు. ఉదయ సముద్రం ప్రాజెక్టు కింద మునుగోడు నియోజకవర్గంలో ఆయకట్టును మరో 20000 ఎకరాలకు పెంచాలని మంత్రిని కోరారు. పునాదిగాని కాలువ, ధర్మారెడ్డి కాలువ, పిలాయిపల్లి కాలువ స్థిరీకరణను పెంచాలని కోరారు.నీటిపారుదల శాఖ కార్యదర్శి ప్రశాంత్ జీవన్ పాటిల్, ఇంజనీరింగ్ ఇన్ చీఫ్ అనిల్, నల్గొండ జిల్లా కలెక్టర్ సి. నారాయణరెడ్డి, నీటిపారుదల శాఖ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at #119&120, 1st Floor, Down Town Mall, Lakdikapul, Hyderabad, Telangana-500004. Editor : M.M.RAHMAN RNINo. APTEL/2013/50370